ప్రకటనల కోసం
సంప్రదించండి
9848328698


తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
RNI NO.APTEL / 2013 /50370
బుధవారం 13.03.2024 | సంపుటి : 10 సంచిక : 243 | పేజీలు : 12 వెల: రూ. 4/-
Follow :
తెలంగాణ
Simultaneously Published from Hyderabad & Karimnagar
ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

సామాన్యుని స్వరం
జనం గోసల గొంతుక జనంసాక్షి ఇది ప్రజల ఛానల్
JANAMSAKSHI TV


## రిటైర్డు న్యాయమూర్తి చేత
# కాళేశ్వరంపై విచారణ
## భద్రాద్రి,యాదాద్రి విద్యుత్‌ప్లాంట్లపైనా ఎంక్వైరీ



### పేదలకు శుభవార్త..
### కొత్త రేషన్‌కార్డులు ఇస్తాం
### కొత్తగా 16 కార్పొరేషన్లు

- డిఎస్సీ 2008 అభ్యర్థులకు ఉద్యోగాలు
- ఇందిరమ్మ ఇళ్లకు రూ.22,500 కోట్లు
- కోదండరామ్, అమిర్‌అలీఖాన్‌లు తిరిగి ఎమ్మెల్సీలుగా ఎంపిక
- రాష్ట్ర కేబినెట్ పలు కీలకనిర్ణయాలు
- వివరాలు ప్రకటించిన మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ కేబినేట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. 16 బిసి కార్పోరేషన్ల ఏర్పాటు, డిఎస్సీ 2008 అభ్యర్థులకు ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇళ్లకు 22,500 కోట్ల కేటాయింపు చేయాలని నిర్ణయించింది. అలాగే కోదండరామ్, అమీర్ అలీ ఖాన్‌లను తిరిగి ఎమ్మెల్సీలుగా ఎంపిక చేస్తూ కేబినేట్ తీర్మానించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం క్యాబినెట్ భేటీ జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు అమోదం తెలిపారు. ఈ భేటికి సంబంధించిన వివరాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి , శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ మీడియాకు తెలిపారు. 16 కార్పొరేషన్ల ఏర్పాటుకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో

మిగతా 2లో..



# కోటి మంది మహిళల్ని కోటీశ్వరులను చేస్తాం

- వారి ఆశీర్వాదం వల్లే కాంగ్రెస్‌కు అధికారం : రేవంత్
- మాట తప్పకుండా సోనియా తెలంగాణ ఇచ్చారు
- కానీ, కేసీఆర్ పదేళ్లపాటు మహిళలను పట్టించుకోలేదు
- 'మహాలక్ష్మి స్వశక్తి మహిళ' పథకాన్ని ప్రారంభించిన సీఎం

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆడబిడ్డల ఆశీర్వాదం వల్లే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన సభలో 'మహాలక్ష్మి స్వశక్తి మహిళ' పథకాన్ని సీఎం ప్రారంభించారు."మాట తప్పకుండా.. మడమ తిప్పకుండా సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారు. ప్రత్యేక రాష్ట్రం ఇస్తే ఏపీలో పార్టీకి తీవ్ర నష్టమని తెలిసినా మనకు రాష్ట్రం ఇచ్చారు. కానీ, కేసీఆర్ పదేళ్లపాటు మహిళలు, ఆడబిడ్డలను పట్టించుకోలేదు. అందుకే మహిళల ఉసురు తగిలి ఆయన పదవి పోయింది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తే.. కేసీఆర్ కుటుంబానికి కడుపుమంటగా ఉంది. ఆడబిడ్డలకు ఉచిత ప్రయాణం వద్దంటూ ఆటో డ్రైవర్లతో ధర్నా చేయించారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించే రాజీవ్ ఆరోగ్యశ్రీని కేసీఆర్ నిర్వీర్యం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆ పథకాన్ని రూ.10లక్షలకు పెంచాం. కేసీఆర్, మోదీ కలిసి రూ.400 ఉన్న గ్యాస్ సిలెండర్‌ను రూ.1200 చేశారు. మహిళలకు భారం కావొద్దని మళ్లీ రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నాం. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

మిగతా 2లో..



## ఆర్యవైశ్యులకు అండగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

- నాలుగు దశాబ్దాల తరువాత ఆర్యవైశ్యులకు సముచిత స్థానం
- ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం
- సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఉప్పల శ్రీనివాస్ గుప్త

**హైదరాబాద్(జనంసాక్షి):** ఆర్యవైశ్యులకు అండగా తెలంగాణ ప్రభుత్వం నిలిచింది. సుమారు నాలుగు దశాబ్దాల చరిత్ర తర్వాత ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పిస్తూ తెలంగాణ రాష్ట్రంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ప్రకటించడం గొప్పవిషయమని అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్, ఐవీఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ఐవీఎఫ్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త హర్షం

మిగతా 2లో..

### 43 మంది లోక్‌సభ అభ్యర్థుల ప్రకటన
# కాంగ్రెస్ రెండో జాబితా



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల రెండో జాబితాను కాంగ్రెస్ మంగళవారం ప్రకటించింది. మొత్తం 43 మంది అభ్యర్థుల పేర్లతో రెండో జాబితాను విడుదల చేసిం ది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ సమావేశంలో రెండో జాబితాను ప్రకటించారు. ఈ జాబితాలో జనంల్ కేటగిరీలో 10మంది, 13 మంది ఓబీసీలు, 10 మంది షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులు, 9 మంది షెడ్యూల్డ్ తెగల అభ్యర్థులు, ఒక ముస్లిం అభ్యర్థులు ఉన్నారు. రాజస్థాన్ లోని జాలోర్ నుంచి రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట కుమారుడు వైభవ్, అసోం లోని జోర్హాట్ నుంచి గౌరవ్ గగోయ్ పోటీ చేస్తున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. మధ్యప్రదేశ్ లోని చింద్వారా నుంచి మాజీ సీఎం కమల్ నాథ్ కుమారుడు నకుల్ పోటీ చేయనున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల రెండో జాబితాను తాజాగా విడుదల చేసింది. ఇందులో 43 మంది పేర్లను ప్రకటించారు. గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్,

మిగతా 2లో..



# కాళేశ్వరంలో రెండు పిల్లర్లు కుంగితే అంత రాద్ధాంతం ఎందుకు?

- కరీంనగర్ కదనభేరి సభలో మాజీ సీఎం కేసీఆర్
- కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కరెంట్ కష్టాలు
- పంటలు ఎండిపోతున్నా పట్టింపు ఏదీ?
- వందరోజుల్లోనే కాంగ్రెస్ బండారం బయటపడింది
- గులాబీ జెండానే తెలంగాణకు అండ అని వ్యాఖ్య

**కరీంనగర్ బ్యూరో(జనంసాక్షి):** రెప్పపాటు కరెంట్ పోకుండా కరెంట్ ఇచ్చిన ఘనత టిఆర్ఎస్ ప్రభుత్వం ఘనతేనని మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ అన్నారు. రైతులను ఆదుకోవాలని రైతుబంధు ఇచ్చామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను గెలిపించాలని, గులాబీ జెండా మాత్రమే తెలంగాణకు అండగా ఉంటుందన్నారు. కరీంనగర్ కదనభేరిలో బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఘాటు విమర్శలు చేశారు. గులాబీ జెండా ఎగిరితేనే కాంగ్రెస్‌పై యుద్ధం చేయగలుగుతామని అన్నారు. లేకుంటే వారి గ్యారెంటీలను పట్టించుకోరని అన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి ఆరు గ్యారంటీలు, కరెంటు

మిగతా 2లో..



# సీఏఏపై కేసు

### సుప్రీంలో పిటీషన్ దాఖలు చేసిన కేరళ ముస్లింలీగ్
### చట్టానికి మేం వ్యతిరేకంగా పోరాడుతాం: సీపీఎం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** కేంద్రప్రభుత్వం తెచ్చిన సీఏఏ చట్టానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ చట్టాన్ని అమలు చేయకుండా స్టే విధించాలని కోరుతూ కేరళకు చెందిన ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సీఏఏ వల్ల నిర్దిష్ట మతాలకు మాత్రమే పౌరసత్వం దక్కుతుందని కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. ఇది ప్రాథమికంగా రాజ్యాంగ విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొంది. మరి ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరిస్తుందా లేదా.. అన్నది ఆసక్తిగా మారింది. ఒక వేళ సుప్రీంకోర్టు విచారణకు స్వీకరిస్తే ఎలాంటి తీర్పు వస్తుందో చూడాలి. మరోవైపు పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అమలు నిబంధనలను కేంద్రం నోటిఫై చేయడంపై విపక్షాలు భగ్గుమన్నాయి. లోక్‌సభ ఎన్నికల ముందు సీఏఏ అమలు చేయడాన్ని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ సహా తృణమూల్, సీపీఐ, ఆప్, సమాజ్‌వాదీ,

మిగతా 2లో..

# రైలు పట్టాలపై నా జీవితం మొదలు

### అందుకే వారి కష్టాలు బాగా తెలుసు : మోదీ
### గత పదేళ్లలో గణనీయ ప్రగతి సాధించిన రైల్వే
### మరో 10 వందే భారత్ రైళ్లు, పలు కార్యక్రమాలను ప్రారంభించిన ప్రధాని
### వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి

**అహ్మదాబాద్(జనంసాక్షి):** రైలు పట్టాలపై తన జీవితాన్ని ప్రారంభించానంటూ ప్రధాని నరేంద్ర మోదీ గతాన్ని గుర్తు చేసుకొన్నారు. అందుకే అక్కడ ఉండే కష్టాల గురించి బాగా తెలుసన్నారు. అహ్మదాబాద్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో దేశవ్యాప్తంగా రూ. 85 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులకు మంగళవారం మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన

మిగతా 2లో..



# రాష్ట్రాభివృద్ధి మాతోనే సాధ్యం

### భారాస,కాంగ్రెస్,ఎంఐఎంలు ఒకే గూటి పక్షులు
### అమిత్‌షా ఆరోపణలు



**హైదరాబాద్(జనంసాక్షి):** ప్రధాని మోదీ గత పదేళ్లలో సాధించిన విజయాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్టీ సోషల్ మీడియా వాలంటీర్లకు పిలుపు ఇచ్చారు. వాస్తవాలు వివ రించేందుకు సోషల్ మీడియా వాలంటీర్లు కూడా బాధ్యతగా తీసుకోవా లని అమిత్ షా నిర్దేశించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ బీజేపీదే అధికారమని అమిత్ షా విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 12 కంటే ఎక్కువ సీట్లు దక్కించుకుంటామని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. మూడోసారి నరేంద్ర మోదీని ప్రధాన మంత్రిగా చూడాలని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. హైదరాబాద్‌లో బీజేపీ సోషల్ మీడియా ఇన్‌ఛా ర్జ్‌ల సమావేశంలో అమిత్ షా మాట్లాడారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన భాజ పా బూత్ స్థాయి అధ్యక్షుల విజ య సంకల్ప సమ్మేళనంలో ఆయ న ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సోషల్ మీడియా ద్వారా ప్రతి ఇంటికీ బీజేపీని తీసుకెళ్లాలని సూచించారు.

మిగతా 2లో..



# హర్యానా కొత్త సీఎంగా నయాబ్ సింగ్ సైనీ

**చండీఘడ్(జనంసాక్షి):**హర్యానాలో బీజేపీ సీనియర్ నేత, సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ రాజీనామా నేపథ్యంలో కొత్త సీఎంకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా పార్టీ నుంచి వెలువడింది. హర్యానా కొత్త సీఎంగా నయాబ్ సింగ్ సైనీని ఎంపిక చేసినట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో సైనీ సాయంత్రం 5 గంటలకు హర్యానా సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నయాబ్ సింగ్ సైనీ ప్రస్తుతం హర్యానా బీజేపీ అధ్యక్షుడు, కురుక్షేత్ర లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా ఉన్నారు.

మిగతా 2లో..

### భారీగా డ్రగ్స్ పట్టివేత..
ఆరుగురు పాకిస్థానీయుల అరెస్టు

రూ.400 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలు స్వాధీనం

2లో

తొలిసారి..
### కుప్పకూలిన తేజస్..



# ఎరువుల కృత్రిమ కొరత కట్టడికి చర్యలు

- ప్రత్యేక యాప్‌ను ఏర్పాటు చేసిన ప్రభుత్వం




**నల్లగొండ బ్యూరో, మార్చి 12 (జనంసాక్షి) :** పంటల సాగు సమయంలో ఎరువుల కొరత సృష్టించకుండా ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ఉ ఏర్పాటు చేసింది. దుకాణాలపై పర్యవేక్షణ, తద్వారా నిల్వల లెక్కలు తేల్చేందుకు వ్యవసాయ శాఖ ఫైవ్ (ఫెర్టిలైజర్స్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం) అనే ప్రత్యేక యాప్‌ను అమల్లోకి తెచ్చింది. ఇందులో కొత్తగా పలు అంశాలు చేర్చి సమాచారం పక్కాగా నమోదు చేయిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్గొండ 815, సూర్యాపేట 552, యాదాద్రి భు వనగిరి 190, ఎరువుల దుకాణాలు ఉన్నాయి. ఎడిఎ, ఎవోలు వారంలో పది దుకాణాల చొప్పున తనిఖీ చేయాల్సి ఉంటుంది. సోమవారం, బుధవారాల మధ్య అయిదు, గురువారం, శనివారాల మధ్య మిగతా దుకాణాల్లో ఆయా అధికారులు నిల్వలు పరిశీలించాలి. దుకణం లొకేషన్‌కు వెళ్లినప్పుడు మాత్రమే యాప్ కూడా ఓపెన్ అవుతుంది. వచ్చే మూడు రోజుల్లో ఏయే దుకాణాలు తనిఖీ చేయాలనే సమాచారం సోమవారం ఉదయమే వ్యవసాయ శాఖ నుంచి వస్తుంది. దాని ప్రకారం ఆయాచోట్ల నిల్వలను పరిశీలించి వివరాలు సక్రమంగా ఉన్నాయా? లేదా? అని తనిఖీ చేస్తారు. ముందుగా ఆయాచోట్ల నిల్వలను పరిశీలించి వివరాలు సక్రమంగా ఉన్నాయా? లేదా? అని తనిఖీ చేస్తారు. ముందుగా యాప్‌లో దుకాణ లొకేషన్ చిత్రాలను అప్‌లోడ్ చేస్తారు. తర్వాత స్టాక్ రిజిస్టర్‌లో సంతకం పెట్టి ఆ ఫోటోలను మూడు రోజుల్లోగా అప్‌లోడ్ చేస్తారు. ఎరువుల నిల్వలు, టీఓలు, ఇతర వివరాలు సేకరిస్తారు. దుకాణంలోని ప్రస్తుత నిల్వలు, యాప్‌లో నమోద్కెన నిల్వలకు తేడా ఉన్నట్లయితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తారు. అన్ని వివరాలను జిల్లా స్థాయిలో డిఎవో సేకరించి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఫైవ్ యాప్ సమాచారం జిల్లా కలెక్టర్‌తో పాటు జిలా& వ్యవసాయాధికారుల వద్ద ఉంటుంది. వారు మాత్రమే లాగిన్ అయ్యే అవకాశం ఉంది. వీరి ఆధ్వర్యంలో ఎరువల నిల్వలపై పర్యవేక్షణ పక్కాగా కొనసాగే వీలుంటుంది.

**అందుబాటులో కచ్చితమైన వివరాలు**

ఫైవ్ యాప్‌తో దుకాణాల్లో నిల్వల వివరాలు కచ్చితంగా ఎప్పటికప్పుడు తెలుస్తాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. రైతులకు ఎంత మేర ఎరువులు అవసరం? ఎన్ని అందుబాటులో ఉన్నాయో వెంటనే తెలుసుకోవచ్చు. ఒకవేళ వ్యాపారులెవరైనా కృత్రిమ కొరత సృష్టించాలనుకునాన అందుకు అవకాశం ఉండదు. సీజన్‌కు, డిమాండ్‌కు అనుగుణంగా ఎరువల నిల్వలు సిద్ధం చేసుకొనేందుకు యాప్ ఉపయోగపడుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

# బొగ్గు గని సిఎంపీఓ 934 పోస్టుల భర్తీకి కృషి

(ప్రత్యేక ప్రతినిధి – జనం సాక్షి)



కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ట్రస్టీ బోర్డు సమావేశంలో కొత్త కాపు లక్ష్మారెడ్డి బొగ్గు పరిశ్రమల ఇంచార్జ్ సీఎం పిఎఫ్ ట్రస్టీ బోర్డ్ సభ్యులు పలుమార్లు సిబ్బంది కొరతగా ఉందని దృష్టికి వచ్చారు. వెంటనే దేశంలో ఉన్న సీఎంపీఎఫ్ కార్యాలయాలను సందర్శించి శిధిలావస్థలో ఉన్న భవనాలను ఆధునికరించాలని భవనాలు లేని చోట నూతన భవనాలను నిర్మించాలని,భవనాల మరమ్మతులు, క్లరికల్ సిబ్బంది నుండి అధికారుల వరకు సిబ్బందిని వెంటనే నియమాకం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కోల్ మినిస్ట్రీ నుండి కోల్ సెక్రెటరీ, చైర్మన్ సీఎం పీఎఫ్ ట్రస్టీ బోర్డ్ నూతన సిబ్బంది నియమాకానికి మొదటి దశలో కొరతగా ఉన్న సిబ్బందిని మార్చి 6న తుది నోటిఫికేషన్ విడుదల చేస్తామని, భవనాల ఆధునీకరణ నూతన భవనాల నిర్మాణం చర్యలను తదుపరి దశలో చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దేశంలో ఉన్న బొగ్గు గని కార్మికుల మెరుగైన సేవలను, సామాజిక భద్రత, ఉద్యోగ భద్రత కల్పించేందుకు అఖిల భారతీయ కదాన్ మజ్దూర్ సంఘ్ కృషిని గుర్తించాలని ఒక ప్రకటన లో సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు.

## జాతీయ స్థాయి వుడ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో సత్తా చాటిన చెన్నూర్ క్రీడాకారులు



**పాలకుర్తి, మార్చి 12 (జనంసాక్షి)** ఈ నెల 10 నుండి 11వరకు మహారాష్ట్ర లోని నాగపూర్ లో 18 వ జాతీయ స్థాయి సీనియర్ వుడ్ బాల్ ఛాంపియన్ షిప్ జరిగిన పోటీలలో పాలకుర్తి మండల కేంద్రంలోని చెన్నూర్ గ్రామానికి చెందిన కందిక ఆదర్శ్,సింగల్ స్టోక్ గేమ్ లో గోల్డ్ మెడల్ సాధించడం జరిగింది, బాలబోయిన సందీప్ సింగల్ స్టోక్ లోనే బ్రాంజ్ మెడల్ సాధించడం జరిగింది.టీం గేమ్ లో కూడా బ్రాంజ్ మెడల్ సాధించారు.టీం గేమ్ లో మరో నలుగురు క్రీడాకారులు పాల్గొన్నారు.తెలంగాణ రాష్ట్రానికి బాహుమతులను తెచ్చినందుకు వీరిని చెన్నూర్ గ్రామ యువకులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

# ప్రశాంతంగా పరీక్షలు రాయడానికి భరోసా కల్పించాలి

- కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 12 (జనం సాక్షి) :** పదవ తరగతి వార్షిక పరీక్షలను విద్యార్థులు ప్రశాంతంగా రాయడానికి భరోసా కల్పించాలని నిర్దిష్టమైన ప్రణాళికలతో పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్ కు తావులేకుండా పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మార్చి 18 నుండి ఏప్రిల్ 2 వరకు పదవ తరగతి పరీక్షల నిర్వహణపై మంగళవారం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 11,962 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారని, ఇందుకోసం 62 కేంద్రాలు ఏర్పాటు చేసి సి.సి.కెమెరా నిఘాలో పరీక్షలు పకడ్బందీగా నిర్వహిచాలని,విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వంద శాతం డ్యూయల్ డెస్క్ లు ఏర్పాటు చేయాలని సూచించారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఎటువంటి మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్ కు తావివ్వకుండా చూసేలా ఇన్విజిలేటర్లకు తగు ఆదేశాలివ్వాలని చీఫ్ సూపరింటెండెంట్లకు, డిపార్ట్మెంటల్ అధికారులకు సూచించారు.విద్యార్థులు హాల్ టికెట్, పరీక్ష ప్యాడ్ తో పరీక్షా సమయాణానికి ఒక గంట ముందుగా చేరుకోవాలని, ఒక్క నిముషం ఆలస్యమైనా అనుమతించబడరని స్పష్టం చేశారు, పరీక్షా హాల్లోకి. ఎలక్ట్రానిక్ గాడ్జెస్ అనుమతించబడవని కూడా స్పష్టం చేశారు.పరీక్షా సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ లు సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలని,పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేయాలని,144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ కేంద్రాలు, మూసి వేయించాలని జవాబు పత్రాలను పకడ్బందీగా తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు.టెలికాన్ఫరెన్స్ లో డీఈఓ రాజు, పరీక్షల సహాయ కమీషనర్ లింగం, ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిర, డిఎమ్ అండ్ ఎచ్ ఓ లక్ష్మణ్ సింగ్, పొలిసు, రెవిన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై మల్లన్న టీం ఫిర్యాదు

- పోలీసులపై దురుసుగా ప్రవర్తించడంపై ఆగ్రహం
- చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్



**కరీంనగర్, మార్చి 12 (జనంసాక్షి) :** గత 10సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో గడిచిన పదేళ్లుగా కరీంనగర్ జిల్లాలో అక్రమాలకు పాల్పడ్డ వారిపై పోలీసులు చర్యలు తీసుకోవడాన్ని జీర్ణించుకోలేక హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పోలీసులపై దురుసుగా ప్రవర్తించడాన్ని ఖండిస్తూ తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు అఖిల్ పాషా టీం సభ్యులతో కలిసి మంగళవారం తిమ్మాపూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అఖిల్ మాట్లడుతూ, కొంతమంది బీఆర్ఎస్ నాయకులు, రియల్టర్లు, పార్టీ పెద్దల అండదండలతో ప్రజలను మోసం చేసి భయభ్రాంతులకు గురిచేసి, అక్రమాలకు పాల్పడుతూ అనేక భూములను కబ్జాచేసి, సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. అయితే, కరీంనగర్ జిల్లాకు కొత్తగా వచ్చిన సీపీ అభిషేక్ మహంతి నేతృత్వంలో జిల్లా వ్యాప్తంగా న్యాయపరంగా పని చేస్తూ పోలీస్ శాఖ సామాన్య ప్రజలు, ఇచ్చిన ఫిర్యాదులతో విచారణ చేసి అట్టి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ కరీంనగర్ జిల్లా ప్రజలకు సత్వర న్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. దాంతో హుజురాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాడికౌశిక్ రెడ్డి మార్చి 7న బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, మా ప్రభుత్వం వచ్చాక కానిస్టేబుల్ నుంచి డిజిపి వరకు అందరిని జైల్లో పెడతామంటూ, ఏ స్థాయి పోలీస్ అధికారులైనా ఖబర్దార్ మిత్తితో సహా చెల్లిస్తాం, అంటూ పోలీసులని ఉద్దేశపూర్వకంగా హెచ్చరిస్తూ పోలీసుల మనోభావాలను, వారి మనోధైర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడుతూ, శాంతిభద్రతలకు భంగం కల్పిస్తూ, అక్రమార్కులను రెచ్చగొడుతూ, వారికి అండగా ఉండి, జిల్లా పోలీస్ శాఖపై బెదిరింపు ధోరణిలో వ్యవహరించి సామాన్య ప్రజలకు రక్షణ లేకుండా మాట్లాడిన కౌశిక్ రెడ్డిపై చట్టరిత్య చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలను ఇదే విధంగా బెదిరించి గెలిపిస్తే విజయ యాత్రకు నేనే వస్తా, ఓడిస్తే మా కుటుంబ శవయాత్రకు మీరు రావాలి అని బ్లాక్మెల్ చేసి గెలిచావని నీ బ్లాక్మెనల్ గెలుపును కూడా న్యాయస్థానం ద్వారా అడ్డుకుంటామని తెలిపారు.

# ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కృషితో నగరపాలక సంస్థకు టీయుఎఫ్ఐడీసీ నిధులు..

- నగర మేయర్ డాక్టర్ అనిల్ కుమార్



**గోదావరిఖని, మార్చి 12, (జనం సాక్షి):** ఎంఎల్ఎ రాజ్ ఠాకూర్ కృషి తోనే రామగుండం నగర పాలక సంస్థ కు టి యుఎఫ్ఐడిసి నిధులు విడుదలయ్యాయని రామగుండం నగర మేయర్ బంగి అనిల్ కుమార్ స్పష్టం చేశారు. పలువురు కార్పొరేటర్లతో కలసి రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. బి ఆర్ ఎస్ పాలనలో తాము మంజూరు చేయించిన నిధులనే తాము తెచ్చినట్లుగా కాంగ్రెస్ నాయకులు చెప్పుకుంటున్నారని మాజీ శాసన సభ్యులు కోరుకంటి చందర్ చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. గతంలో టియుఎఫ్‌డిసి నిధులు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ అవి కాగితాలకే పరిమితమయ్యాయని మాజీ శాసన సభ్యులు చెప్పినట్లుగా నిధులు విడుదల కాలేదని మేయర్ తెలిపారు. నిధుల కొరతతో అభివృద్ధి పనులు చేపట్టడానికి సతమతమవుతున్న తరుణంలో ఎమ్మెల్యేగా గెలిచిన రాజ్ ఠాకూర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి టియుఎఫ్ఐడిసి నిధులు రూ. 100 కోట్లు మంజూరు చేయించారని ఆయన తెలిపారు. గతంలో 2017-18 లో సి ఎం ఎ ప్లాన్ గ్రాంట్ పేరుతో నిధులు మంజూరు చేస్తున్నట్లుగా ఉత్తర్వులు ఇచ్చి సుమారు రూ 40 నుండి రూ 50 కోట్ల రూపాయల విలువైన పనులు పూర్తి చేసిన తరువాత వాటికి నిధులు విడుదల చేయకుండా, ఏండ్ల తరబడి బిల్లులు చెల్లించకుండా కాంట్రాక్టర్ లను ఇబ్బంది పెట్టడం జరిగిందని అన్నారు. మూడు నెలల కాలంలో అందరికీ అందుబాటులో ఉంటూ కార్యకర్తలకంటే ముందుగా నిరుపేద ప్రజలను కలుస్తూ వారి సంక్షేమం , నగర అభివృద్ధి , సమస్యల పరిష్కారం పై రాజ్ ఠాకూర్ దృష్టి సారించారని అన్నారు. 28వ డివిజన్ కార్పొరేటర్ పులేందర్ మాట్లాడుతూ టియుఎఫ్ఐడీసి నిధులు విడుదల చేయలేక గత ప్రభుత్వం చేతులెత్తేసిందని అన్నారు. ఈ పరిస్థితుల్లో ఎం ఎల్ ఎ రాజ్ ఠాకూర్ , జిల్లా మంత్రి శ్రీధర్ బాబు , జిల్లా ఇంచార్జ్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఒప్పించి నగరాభివృద్ధికి నిధులను విడుదల చేయించారని అన్నారు. 8వ డివిజన్ కార్పొరేటర్ ధాతు శ్రీనివాస్ మాట్లాడుతూ కోరుకంటి చందర్ ఆత్మ పరిశీలన చేసుకొని మాట్లాడాలని అన్నారు. స్వార్ధ రాజకీయాలు తప్పా ప్రజా సంక్షేమం పట్టించుకోక పోవడంతో కోరుకంటి చందర్ హయాంలో రామగుండం వెనుకబడి పోయిందని అన్నారు. సింగరేణి సంస్థ స్థలాలు ఇచ్చినప్పటికీ నిధుల కొరతతో మహిళా భవన్ లు , సీనియర్ సిటిజెన్ హాళ్లు కట్టలేక పోయారని అన్నారు. అంతకు ముందు పని చేసిన సోమారపు సత్యనారాయణ హయాంలో విడుదలైన నిధులతో తన డివిజన్ లో పనులు జరిగాయని అన్నారు. కోరుకంటి చందర్ అవాకులు చవాకులు పేలితే ప్రజల్లో మరింత చులకన అవుతారని అన్నారు. ఈ సమావేశంలో 15వ డివిజన్ కార్పొరేటర్ శంకర్ నాయక్ , పదిహేడవ డివిజన్ కార్పొరేటర్ సాగంటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# 'వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్' మంచి ఆలోచన

- ఉపాధి అవకాశాలు పెరుగుతాయి
- కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణా రెడ్డి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చ్ 12 (జనం సాక్షి) :** భారతీయ రైల్వే ఆధునీకరణ కార్యక్రమంలో భాగంగా వన్ రైల్వే స్టేషన్,వన్ ప్రొడక్ట్ .85,000 వేల కోట్లకు పైగా విలువైన రైల్వే ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్ గా శంకుస్థాపన సందర్భంగా కామారెడ్డిలో పాల్గొన్న కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డితో పాటు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాసన సభ్యులు వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోదీ పాలనలో ఎయిర్ పోర్ట్ లతో సమానంగా రైల్వే వ్యవస్థ అభివృద్ధి చెందుతుందని, వందే భారత్ వంటి రైలు వల్ల ప్రయాణం కూడా తొందరగా జరుగుతుందని అన్నారు. వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ కార్యక్రమం మంచి ఆలోచన అని, ఈ కార్యక్రమం వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ప్రపంచంలోనే మొదటి స్థానంలో భారత రైల్వే వ్యవస్థ ఉంటుందని అన్నారు.

**ప్రభుత్వ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి**

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాఠశాల విద్యశాఖ అధికారులతో జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారితో, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల, నోడల్ అధికారుల తో మంగళవారం సమీక్షా సమావేశాన్ని కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి నిర్వహించారు.ఈ సందర్భంగా కాటిపల్లి వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలనీ అన్నారు. ప్రైవేటు విద్యార్థులకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను తీర్చి దిద్దాలనీ సూచించారు.ఏ క్షణంలోనైనా ఏ పాఠశాలనైన తనిఖీ చేస్తానని, ఎక్కడ తప్పు కనిపించినా సహించేది లేదనీ పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

# రాష్ట్రంలో అత్యధిక ఎంపీ స్థానాలు గెలుస్తాం

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**నిర్మల్ బ్యూరో, మార్చ్12 (జనంసాక్షి) :** సికింద్రాబాద్ ఇంపీరియల్ గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన సోషల్ మీడియా వారియర్స్ సమావేశం, బీజేపీ విజయ సంకల్ప సభ లో కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా, రాష్ట్ర బీజేపీ ముఖ్య నేతలంతా పాల్గొన్నారు.ఈసందర్భంగా బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఈ సారి పార్లమెంట్ ఎన్నికలు అవినీతి, అక్రమాలు, స్కాం లు చేసిన కాంగ్రెస్, రాష్ట్రంలో తొమ్మిదేళ్ళు దోచుకుతిన్న బీఆర్ఎస్, పదేళ్లుగా అవినీతి లేని సుస్థిర పాలన అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ కి మధ్య జరుగుతున్న ధర్మ యుద్ధం అని అన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం లక్షల కోట్ల రూపాయల సాయం అందించిందని ,రాష్ట్రంలో అత్యధిక ఎంపీ స్థానాలు గెలిపించి, ప్రధాని మోడీ కి కానుకగా ఇచ్చేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.


## రైతులకు సాగునీరు అందించాలి



**పాలకుర్తి, మార్చి 12 (జనంసాక్షి) :** రైతులు సాగు చేసుకున్న పంటలకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని ఎంపీపీ నల్ల నాగిరెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ ఆధ్వర్యంలో రైతులు సాగు చేసుకున్న పంటలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలో గల రాజీవ్ చౌరస్తాలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నల్ల నాగిరెడ్డి మాట్లాడుతూ సాగునీరు లేక రైతులు పండించే పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# పేట చేనేత ప్రత్యేకతను చాటాలి

- చేనేత జౌళి శాఖ రాష్ట్ర సంచాలకులు అలుగు వర్షిని




**నారాయణ పేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):** పేట చేనేత ప్రఖ్యాతిని మరింత పెంచేందుకు కృషి చేద్దామని చేనేత జౌళి శాఖ రాష్ట్ర సంచాలకులు అలుగు వర్షిని అన్నారు.మంగళవారం నారాయణపేట జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన చేనేత సహకార సంఘాల సభ్యుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ తో కలిసి ఆమె మాట్లాడుతూ..చేనేత కార్మికులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందాలని సూచించారు.అంతకు ముందు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.జిల్లా కేంద్రానికి సమీపంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం పక్కనే మూడంతస్తులతో నిర్మిస్తున్న సమీకృత చేనేత కేంద్ర భవనం పనులు మూడు నెలల్లో పూర్తవుతాయని, ఆ సమీకృత చేనేత కేంద్ర భవనంలో నారాయణపేట చేనేత చీరల ప్రత్యేకతను తెలిపేందుకు ఒక మ్యూజియం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.అనంతరం చేనేత జౌళి శాఖ సంచాలకులు వర్షిణి మాట్లాడుతూ..సమీకృత చేనేత కేంద్రంలో మ్యూజియం ఏర్పాటుతోపాటు చేనేత చీరలను విక్రయించేందుకు ఒక దుకాణాన్ని కూడా ప్రారంభించాలని, ఆ దుకాణంలో పనిచేసేందుకు టెస్కో నుంచి ఒక సేల్స్ మెన్ ను ఇక్కడికి పంపించి, అతని వేతనాన్ని టెస్కో నుంచే ఇస్తామని చెప్పారు. సమీకృత చేనేత కేంద్రంలో ఏర్పాటుచేసే దుకాణంలో నారాయణపేట లోని మూడు చేనేత సహకార సంఘాల ఆధ్వర్యంలో నేసిన చీరలను విక్రయించాలని ఆమె తెలిపారు. ఆ దుకాణం నిర్వహణ చేనేత సంఘాలే చూసుకోవాలని, వచ్చే లాభాన్ని కూడా వాళ్ళే పొందాలని అన్నారు. మ్యూజియంలో చేనేతకు సంబంధించిన పురాతన పరికరాలు, వస్తువులను పెట్టాలన్నారు. ఆ మ్యూజియాన్ని సందర్శించిన వాళ్ళు అక్కడే ఏర్పాటు చేసే దుకాణంలో చేనేత చీరలను కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. చేనేత చీరలను దుకాణంలో ప్రదర్శనకు పెట్టి మరి విక్రయించాలన్నారు. వీటితో పాటు ఆ కేంద్రంలో ఒక చేనేత యంత్రాన్ని ఏర్పాటు చేసి అక్కడే చీరలను నేసేందుకు ఏ చేనేత సొసైటీ అయిన ముందుకు రావాలని ఆమె సూచించగా, మండలంలోని కోటకొండకు చెందిన చేనేత సహకార సంఘం సభ్యుడు చీరలు నేయడానికి అంగీకరించాడు. సమీకృత చేనేత కేంద్ర భవన నమూనాను తనకు పంపించాలని, కేంద్రంలో సిమెంట్ ఫ్లోరింగ్, కామన్ టాయిలెట్లను నిర్మించాలని టీఎస్ ఎంఐడిసి అధికారులకు ఆమె సూచించారు.సమీకృత చేనేత కేంద్రం ప్రారంభించాక, అక్కడే చేనేత కార్మికుల కు ప్రత్యేక శిక్షణలు ఇప్పించి, మూస పద్దతిలో చీరలు నేయకుండా డిమాండ్ ఉన్న డిజైన్లతో చీరలు తయారు చేసి విక్రయించేందుకు కృషి చేస్తామన్నారు.టీ నేతన్న యాప్ లో కార్మికులందరూ తమ పేర్లు నమోదు చేసుకోవాలని, యాప్ లో ఉన్నవారే పథకాలు లబ్ధి ఉంది అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. నారాయణపేటలోని చేనేత సొసైటీలలో ఉన్న కాటన్ చీరలను త్వరలోనే కొనుగోలు చేస్తామని ఆమె భరోసా ఇచ్చారు.సొసైటీలకు చెల్లించాల్సిన బకాయి ఎంత ఉందని ఆయా సొసైటీల సభ్యులను ఆమె అడిగి తెలుసుకున్నారు. తొందరలోనే నారాయణపేటలో సమీకృత చేనేత కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఈ ప్రాంత చేనేత కార్మికుల పనితనాన్ని , చేనేత చీరల ప్రత్యేకతను దేశ నలుమూలల చాటి చెప్పేలా ప్రణాళికను రూపొందించి ముందుకు వెళ్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ సమావేశంలో చేనేత జౌళి శాఖ ఏ. డి. బాబు, అభివృద్ధి అధికారులు సంతోష్ కుమార్, కేటీ చారి, టీఎస్ ఎం ఐ డి సి ఈ ఈ జైపాల్ రెడ్డి, అగ్రిస్టక్చర్స్ సంతోష్, ఇస్మాయిల్, ఏ డి ఓ లావణ్య, నారాయణపేట, చిన్న జట్రం, కోటకొండ చేనేత సహకార సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి 'బూర్గుల'

*ప్రముఖ స్వతంత్ర సమరయోధుడు, బహుభాషా కోవిదుడు, న్యాయవాది, సాహితీవేత్త, రచయిత. సామాజిక స్పృహతో నాటి స్వతంత్ర ఉద్యమంలో పాల్గొని స్వతంత్ర అనంతరం ఏర్పడిన హైదరాబాద్ రాష్ట్రానికి మొట్టమొదటి ముఖ్యమంత్రిగా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక కాబడిన మహనీయుడు బూర్గుల రామకృష్ణారావు. 1956 భాషా ప్రాతిపదికన ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి కాగా ఆ తర్వాత బూర్గుల రామకృష్ణారావు రెండు రాష్ట్రాలకు గవర్నర్గా తన పదవిని నిర్వహించి హైదరాబాదు రాష్ట్రానికి భారతదేశానికి అత్యుత్తమమైన సేవలు అందించిన మహనీయుడు బూర్గుల రామకృష్ణారావు. 1899 మార్చి 13 న మహబూబ్ నగర్ జిల్లా, తలకొండపల్లి మండలం, పడకల్ గ్రామంలో జన్మించారు. ధర్మపంత్ స్కూలు (హైదరాబాద్) లో ప్రాథమిక విద్యను అభ్యసించి, పూణె లోని ఫెర్గూసన్ కళాశాలలో బి.ఏ (హానర్స్) డిగ్రీ చదివారు. బొంబాయి విశ్వవిద్యాలయం నుండి ఎల్ఎల్‌బీ (లా డిగ్రీ) పూర్తిచేసి, హైదరాబాద్‌లో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు.*

బూర్గుల చిన్నప్పటి నుంచే స్వతంత్ర ఉద్యమ పట్ల ఆకర్షితులయ్యారు. 1920లో హైదరాబాదులో ఆంధ్ర మహాసభ స్థాపనలు కీలక పాత్ర వహించారు. 1923లో హైదరాబాద్‌లో న్యాయవాద వృత్తి ప్రారంభించి అగ్రస్థాయికి చేరుకున్నారు. న్యాయవాదిగా ఉంటూనే, రాజకీయాల్లో పాల్గొనడం జరిగింది. ఆంధ్రోద్యమం, గ్రంథాలయోద్యమం, భూదానోద్యమం మొదలైన వాటిలో పాల్గొన్నారు. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి మొదలైన వారితో కలిసి పనిచేసారు. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంకు అధ్యక్షుడిగా, కార్యదర్శిగా పనిచేసారు. హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెసు వ్యవస్థాపకుల్లో బూర్గుల ప్రముఖుడు. పార్టీ తరపున ఆయన అనేక కార్యక్రమాలకు నేతృత్వం వహించారు. 1931లో నల్గొండ జిల్లా దేవరకొండలో జరిగిన రెండవ ఆంధ్రమహాసభకు బూర్గుల అధ్యక్షత వహించారు. హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెస్ స్థాపనలో కీలక పాత్ర వహించి 1930 శాసనోల్లంఘన ఉద్యమంలో 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించి దేశ స్వతంత్రం ఉద్యమం వైపు తన అడుగులు వేసి ఎందరో తెలుగు ప్రజలను స్వతంత్ర ఉద్యమం వైపు నడిపించిన మహనీయుడు బూర్గుల రామకృష్ణారావు.

1947 ఆగస్టు 15 భారతదేశానికి స్వతంత్రం వచ్చినప్పటికీ హైదరాబాద్ నిజాముల ఆధీనంలో పరిపాలించబడింది. 1947 నుంచి 1948 సెప్టెంబర్ 17 వరకు హైదరాబాదు రాష్ట్ర స్వతంత్ర ఉద్యమంలో కీలక పాత్ర వహించి. 1948లో హైదరాబాదు రాష్ట్రం ఏర్పడిన తరువాత మొదటి మంత్రివర్గంలో రెవెన్యూ, విద్య శాఖల మంత్రిగా పనిచేశారు. 1952 సంవత్సరంలో భారత దేశంలో జరిగిన మొట్టమొదటి ప్రజాస్వామ్య ఎన్నికలలో విజయం సాధించిన బూర్గుల రామకృష్ణారావు, 1952 నుండి 1956 వరకు హైదరాబాదు రాష్ట్రానికి మొట్టమొదటిగా ఎన్నికైన ముఖ్యమంత్రిగా కీర్తి గడించారు. హైదరాబాద్ రాష్ట్ర అభివృద్ధిలో బూర్గుల కీలక పాత్ర వహించారు. 1956వ సంవత్సరంలో భాషా ప్రాతిపదికగా ఏర్పడిన ఆంధ్ర మరియు హైదరాబాద్ రెండు రాష్ట్రాలను కలిపి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించిన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొట్టమొదటి ముఖ్యమంత్రిగా నీలం సంజీవరెడ్డి ఎన్నిక కాగా ఆ తర్వాత 1956 తర్వాత బూర్గుల రామకృష్ణారావు కేరళ ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు గవర్నర్ గా నియమించబడ్డారు.

### బూర్గుల రామకృష్ణారావు సాహితీసేవ

బూర్గుల రామకృష్ణారావు ఒక గొప్ప రచయిత కూడా తెలుగు హిందీ ఇంగ్లీష్ కన్నడ మరాటి ఉర్దూ పారసిక సాంస్కృత భాషలలో పాండిత్యం కలిగి కవితాంజలి కథాంజలి నాటకాంజలి వంటి సాహిత్య రచనలు చేశారు. భారతదేశ చరిత్ర, హైదరాబాద్ స్వతంత్ర పోరాట చరిత్ర. అనే చారిత్రక గ్రంథాలను రచించారు. బూర్గుల రామకృష్ణారావు 1967 సెప్టెంబర్ 14న గుండెపోటుతో హైదరాబాదులో మరణించారు. గురుకుల రామకృష్ణారావు ఒక మహనీయుడు స్వతంత్ర సమరయోధుడు హైదరాబాదు రాష్ట్రంలోనే కాదు దేశ ప్రజలలో కూడా స్వతంత్ర పోరాట పటిమను సృష్టించిన మహనీయుడు. బూర్గుల రామకృష్ణారావు ఒక స్ఫూర్తిదాయక వ్యక్తి ఆయన జీవితం సేవలు రాబోయే తరాలకు మార్గదర్శకంగా ఉన్నాయి. నేటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము బూర్గుల రామకృష్ణారావు గారి సేవలను గుర్తించి ఆయన యొక్క స్ఫూర్తిని రాష్ట్ర ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి మరియు సామాజిక సాహితీ వేతలపై ఎంతైనా ఉంది.



**పూసపాటి వేదాద్రి**
కవి, సాహితీ విశ్లేషకులు
9912197694

# 400 సీట్లొస్తే రాజ్యాంగం మారుస్తారట!

*త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కి ఈసారి 400 పార్లమెంట్ సీట్లు వస్తే బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన,దేశ పౌరులందరికి న్యాయం కలిగించే రాజ్యాంగం మారుస్తారట!కర్ణాటక లోని బీజేపీ ఎంపీ ఆనంత్ హెగ్డే బహిరంగ స్టేట్మెంట్ ఇస్తాడు! ఒక వైపు ఎలక్టోరోల్ బాండ్స్ ద్వారా రాజకీయ పార్టీ లకు ఎవరెవరు ఎన్నికల చందా ఇచ్చారో, అవివరాలను ఎస్బిఐ 24 గంటల్లో కోర్టులో సబ్మిట్ చేయాలని, 15 తేదీ లోపు ఎన్నికల కమిషన్ ద్వారా డిస్ప్లే చేయాలని,సుప్రీం కోర్ట్ ఆదేశం ఇచ్చింది. లేని పక్షంలో ఎస్బిఐ మీద చర్యలు ఉంటాయని హెచ్చరిక కూడా చేయడం జరిగింది. దీనితో బీజేపీ బండారం బయట పడే పరిస్థితి వచ్చింది.*



2027లో రిటైర్ మెంట్ ఉన్న ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ రాజీనామా చేస్తారు.రాష్ట్రపతి కి ఆయన రాజీనామా పంపిన వెంటనే ఆమోదం కూడ తెలుపుతారు.ఇతని మీద ఒత్తిళ్ళు పెరగడమే రాజీనామాకు కారణం అంటున్నారు.పీఎం మోడీ ఇద్దరు ఎన్నికల కమిషనర్ లను ఈ నెల 15 న ఎంపిక చేయనున్నారు.గతంలో ఇలాగే అశోక్ లావాస కూడ రాజీనామా చేశారు. అప్పుడు ఆయన కుటుంబ సభ్యుల మీద ఐటి, తదితర ఏజెన్సీ ల దాడులు జరిగాయి.మాజీ జమ్మూ కాశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మల్లిక్,2019 లో పుల్వామా సంఘటనకు సంబంధించి వాస్తవాలను బయట పెట్టినందుకు ఆయన మీద కేసులు, ఏజెన్సీ దాడులు, విచారణలు కొనసాగాయి.సర్కార్ లో ఉన్నపుడు, సర్కార్ ముందు, సర్కార్ కు వ్యతిరేకం గా గొంతు ఎత్తవద్దు! ఎత్తితే మీ పని ఖతం అని, గత పది ఏండ్లలో కేంద్రం నీతి కొనసాగుతున్నది.ఇతర పార్టీ ల్లో ఎన్ని అవినీతి ఆరోపణలు ఉన్న వారు అయినా బీజేపీ లో చేరిపోతే, కేసులు ఉండవు! పైగా సీఎం, కేంద్ర, రాష్ట్ర మంత్రి పదవులు దక్కుతాయి.మరో వైపు ఇటీవలనే జస్టిస్ గంగూలీ రాజీనామా చేసి బీజేపీ శరణులోకి వెళ్లి, పీఎం ముందు మోకాళ్ళు ఒడ్డారు.గతంలో మాజీ చీఫ్ జస్టిస్ రాజ్యసభ సభ్యుడు అయ్యాడు, ఒకతను గవర్నర్ అయ్యాడు.నిజానికి బీజేపీ పంచన చేరుతున్న జడ్జిలు వారు కోర్ట్ లలో ఉన్నపుడు ఇచ్చిన తీర్పు లను అనుమానించాల్సిన పరిస్థితి ఉన్నది. అందుకోసం వారికి పదవులు నజ్రానగా ఇస్తున్నది, బీజేపీ,కుటుంబ వాదం అంటూ పీఎం మోడీ సహా, హోమ్ మంత్రి అమిత్ షా లు మాజీ ప్రధానులు నెహ్రు, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ మొదలు రాహుల్ గాంధీ పేర్లు ఎత్తుతూ విమర్శలు మొదలు పెట్టారు.ఎంపీ ఎన్నికల కు మరో రెండు నెలలు కూడ లేని సందర్భంగా సిఎఎ ను అమలు చేస్తారు.మొత్తం గా ఆ విషయం, ఈ విషయం మాట్లాడే పీఎం, హోమ్ మంత్రి దేశంలో నిరుద్యోగం గురించి ఒక్క మాట మాట్లాడారా? మాట్లాడే దమ్ము ఉన్నదా? ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది? అంటే ఇప్పటిదాకా ఒక్క సమాధానం లేదు!రాజ్యాంగం మారుస్తామని పార్టీ ఎంపీ ప్రకటన చేసినా, ఒక్క మాట మాట్లాడరు!గత 2019 ఎన్నికల్లో పుల్వామా వద్ద 29 మంది సైనికుల మృతి మీద ఓట్లు అడిగిన పీఎం మోడీ, ఇప్పుడు సిఎఎ మీద ఓట్లు అడిగే ప్లాన్ చేస్తున్నారు. కులం, మతం పేరు మీద ఓట్లు పడే పరిస్థితి లేదు కాబట్టి ఏం చేసుదు? ఏదో ఒకటి మాట్లాడాలి! కోట్లు ఖర్చు చేసి మోడీ కుటుంబం దేశ ప్రజలు అంటూ భారీ ప్రకటనలు కనిపిస్తున్నాయి! బుద్ధి జీవులు తేరుకోవాలి!దేశంకు ఎవరు? ఎందుకు ప్రమాదమో? తెలుసుకోవాలి! జాగో సమయం ఎక్కువ లేదు!



**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223

# మంచినీళ్ల వ్యాపారం పేరిట అక్రమ దందా

రాష్ట్రం లో మినరల్ వాటర్ పేరిట కోట్ల రూపాయల అక్రమ వ్యాపారం మూడు పూవులు ఆరు కాయలు గా సాగుతుంది.పల్లెలు,పట్టణములు,నగరముల లో గుర్తింపు లేని వాటర్ ప్లాంట్ లు పుట్టగొడుగుల్ల పుట్టుకు వచ్చి ప్రజల ఆరోగ్యంని దెబ్బతీ స్తున్నాయి.అనుమతులు లేకుండా నీళ్ల వ్యాపారం నడుస్తుంది.అధికారులు కూడా మామూళ్ల కి ఆశపడి ఈ వాటర్ ప్లాంట్ ల వైపు చూడడం లేదు.ఒక్కో వాటర్ క్యాన్ కి రూ.20 నుండి 30 వరకు వసూల్ చేయటం జరుగుతుంది.మినరల్ నీళ్లు తాగడం వల్ల కీళ్ల నొప్పులు,అనారోగ్యము బారిన పడుతున్నారు.వాటర్ క్యాన్ లను శుభ్రం చేయక పోవడం వల్ల అడుగు భాగం లో నాచు లాంటి పచ్చని పదార్థం పేరుకు పోయి ఆ నీళ్లు ప్రజలు తాగడానికి వాడడం వలన విరోచనాలు కావడం జరుగుతుంది.ప్రజలార మినరల్ వాటర్ సేవించకండి.మన మంచి నీటి బావి,బోరు నీళ్లు లో మన శరీరం కి కావలసిన అన్ని లవణాలను కల్గి వుంటాయి.అనుమతి లేని వాటర్ ప్లాంట్ లను అధికారులు తక్షణమే సీజ్ చేసి ప్రజల ఆరోగ్యం ని కాపాడాలని మా మనవి.

**- కామిడి సతీష్ రెడ్డి**
**జయశంకర్ భూపాలపల్లి జిల్లా**

# ప్రతిజ్ఞ

భారత దేశం నా మాతృభూమి
పలికీ పలికి నా హృదయం
గడ్డకట్టి కల్లోల శిఖరమయ్యింది
బోనులో ముద్దాయి గానే
నా జవసత్వం ఉడిగిపోయింది
ఏమని నిరూపించను?
నా పౌరసత్వం!
నీ కుటిల చాణుక్యాల ముందు
నీ మత విద్వేషపు చట్టాల ముందు.
భారతీయులందరూ నా సహోదరులు
మొగ్గతనం నుండే మీనార్ పావురాయినై
ఎలుగెత్తిన అజాన్ నై విన్పిస్తూనే ఉన్నా
నువ్వెప్పుడు విన్నావని!
నువ్వెప్పుడు వింటావని!
మా ముత్తాతల చెవుల్లో
నువ్వు కరిగించిన సీసం అయ్యాకే కదా!
వాళ్లు కలిమా చదివి మా కనుపాపలయ్యింది.
కుళ్ళిన శవం కంపుగొడ్తున్న
నీ కులాల రొంపి నొదిలే కదా!
సజ్దాల సామరస్యాలయ్యింది.
నువ్వు నాలుక తెగ్గోస్తేనే కదా!
నిన్ను ఎడం కాలితో తన్ని
అల్లాహోఅక్బర్ నినాదామయ్యింది.
నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను
నేనసలు ప్రేమించనిదెప్పుడు?
నఖశిఖపర్యంతం ప్రేమికుడ్ని కదా!
తల్లిని,చెల్లిని,ఆలిని,ఆకలిని
మట్టిని,మృత్యువును
సమంగా ప్రేమించిన వాడ్ని
నిన్ను ప్రేమించలేనా!

నేనీ దేశ పౌరుడ్నని
నీకే రుజువులు చూపను?
ఎర్రకోట బురుజుల నడుగు
నా రక్తం మెరుగులు చూపుతుంది.
దేశ విముక్తికై నే ముద్దాడిన
ఉరికొయ్యల నడుగు
మరణించడమంటే జీవించడమని చెప్తాయి.
యిదిగో!
నన్ను కాన్సన్ట్రేషన్ క్యాంపుల్లో
బందీని చేస్తావా!
నా కాళ్లు పాతాళంలో
నా శిరస్సు ఆకాశంలో
నా దేహం దేహమంతా
భూమండలం నిండా
విస్తరించింది జాగ్రత్త!.

(ఎన్ఆర్సి, సిఏఏ లను నిరసిస్తూ..)

**కరీముల్లా**


# మీరే రండి

ఇల్లుని వాకిలిని ఎడ్లని దూడ్లని చెట్లని చేలని
నడిచిన నేలని
వదలలేకపోతున్నా వదిలి రాలేకపోతున్నా
కొడుకా నీవు రమ్మంటున్నది నిజం కాదనలేని నిజం
నా శరీరం ఒప్పుకోవడంలేదు
ఇల్లంటే రాయిరప్పని వాకిలంటే దుమ్మూధూళని
అనుకోలేదు
పాతేసిన గుంజనో పైకిలేచే గింజనో నాకే ఎరుక
కష్టమో కామితమో నా ఏవుసం నాకే ఎరుక
నాలెక్కవేరు నాసుక్కవేరు
దూపైతే వాగుల సెలిమె దీసి నీళ్ళమీద బట్టేసి తాగుతా
కొట్టంలో ఆవులకు మేతేస్తూ వాటిని నీళ్లకు వదులుతూ
గంగడోలు నిమురుతూ ఆనందపడ్తా
వరండాలో నుల్క మంచమేసుకొని మేకల గొతికల్ని
గోలికాయల్లా లెక్కబెడ్తూ సంతృప్తిపడ్తా
ఎక్కడెక్కడో తిరిగినా రాత్రికి నా కడుపుల తలపెట్టె
గారాల పిల్లితోకని చూస్తూ సంబరపడ్తా
ఏం చెప్పను నా తీయని యెతలు
ఏం దాచను నా ఆత్మీయ కథలు
ఇప్పటివరకు ఎవరితోనూ వేలెత్తి చూపించుకోలేదు
వైరుధ్యాలు వైవిధ్యాలు కోరలేదు
హారంలో దారంలా వున్న
రయ్ మంటూ తిరిగే మోటర్లపట్నం
రమ్మంటున్నావు నీవు
రహదారుల వెంట చుద్దామంటే రవ్వంత చెత్త కనపడని
అద్దంలాంటి రోడ్డులో గ్రామీణ గుభాళింపుల్ని ఆశించి
భంగపడతాను నేను రాను నేను
అక్కడ కోడలుపిల్ల జాగ్రత్త పుట్టిన కోడిపిల్లలు భద్రం
కళ్లకి దూరంగా వున్నా మనసుకు చేరువ గానే
వున్నారు మీరంతా
వచ్చేనెల అమ్మది సంవత్సరీకం
మీరే రండి

**కోటం చంద్రశేఖర్**
**94492043348**

# భారతదేశ గ్రామీణ వ్యవస్థ- చారిత్రక జీవన విధానం!

*ప్రపంచ దేశాలలో భారతదేశ చరిత్రను ఒక్కసారి పరిశీలిస్తే ప్రపంచ మానవాళికి మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది. ముఖ్యంగా ప్రపంచంలో విలసిల్లిన నాగరికతలలో సింధు నాగరికత, మెసపోటోమియా నాగరికతలు ప్రధానమైనవి. అయితే అందులో సింధు నాగరికత ప్రజల జీవన విధానం అత్యంత ఆధునికతకు నిదర్శనం. ముఖ్యంగా సింధు నాగరికత కాలం నాటి ప్రజలు గృహ నిర్మాణం, వ్యవసాయం, వర్తక వాణిజ్యం, ఆహారపు అలవాట్లు నేటికీ వాటిని చేరుకోలేకపోయాం. సింధు నాగరికత కాలం నాటి గృహ నిర్మాణ విధానం దీర్ఘ చతురస్రాకార విధానం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం, కాల్చిన ఇటుకలతో నిర్మించిన గృహ నిర్మాణం ప్రపంచంలో ఏ నాగరికతలలో కనపడదు. ఇంత గొప్ప చరిత్ర గలిగిన భారతదేశ సామాజిక జీవన వ్యవస్థ చరిత్రను ఒక్కసారి ప్రతి విద్యార్థి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది, చదవాల్సిన అవసరం ఉంది. భారతదేశంలో ప్రస్తుతం 6లక్షల,40 గ్రామాలు ఉన్నట్లు. అధికారిక లెక్కలు ధ్రువీకరిస్తున్నాయి.*



గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుంది. ముఖ్యంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వ్యవసాయ రంగంతో ముడిపడి ఉంటుంది. వ్యవసాయ రంగం కులవృత్తులతో ముడిపడి ఉంటుంది. 2019 -20 వచ్చిన కోవిడ్ (కరోనా) కారణంగా దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో వివిధ వృత్తులలో పనిచేసినవారు తిరిగి తమ గ్రామాలకు వచ్చి జీవనం సాగించారు. ఒక్క మాటలో చెప్పాలంటే అంటే గ్రామం సామాజిక జీవనంతో ముడిపడి ఉంది. గ్రామం మానవ అభివృద్ధిలో ప్రధానమైనదిగా చెప్పవచ్చు.

భారతదేశ ఆర్థిక వ్యవస్థకు జిడిపికి భారతీయ వ్యవసాయ రంగం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ జిడిపిలో 16% వాటా గ్రామానిదే! ఇంత పెద్ద చరిత్ర కలిగిన గ్రామీణ ప్రాంతాలు ఒకప్పుడు స్వయం పోషక గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో ముడిపడి ఉన్నాయి. ముఖ్యంగా పశుపోషణ గొర్రెల పెంపకం కోళ్ల పెంపకం చేపల పెంపకం చేనేత కమ్మరి కుమ్మరి వడ్రంగి ఇతరత్రా చేతివృత్తుల వారు గ్రామాలలో నివసించేవారు. గ్రామమే దేశానికి, దేశాభివృద్ధికి మార్గదర్శకం అని చెప్పాలి. గ్రామంలో పూర్వకాలంలో కాకతీయులు నిర్మించిన గుళ్ళు గోపురాలు, నిజాం నిరంకుశ ప్రభుత్వానికి రజాకార్లకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సాగించిన పోరాటం, తెలంగాణలో భూస్వామ్య వ్యతిరేక ఉద్యమాలు నేటి ఆధునిక కాలంలో ప్రతి విద్యార్థి తెలుసుకోవలసిన అవసరం ఉంది. కాబట్టి విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల జీవన వ్యవస్థను ప్రతి విద్యార్థి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. చరిత్ర ప్రపంచ మానవాళి కి ఎంతో అవసరం. చరిత్ర అధ్యయనం వర్తమాన సమాజానికి మార్గదర్శకం. కాబట్టి విద్యార్థి, సమాజం చరిత్రను అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మారిన కాల పరిస్థితుల దృష్ట్యా చరిత్రను నిర్లక్ష్యం చేయడం భవిష్యత్ తరాలకు గొడ్డలిపెట్టుగా తయారవుతుంది.

భారతదేశంలోని పట్టణాలు, నగరాల కంటే గ్రామాలు అధిక సంఖ్యలో ఉన్నాయి. భారత జనాభాలో అరవై ఐదు శాతం మంది గ్రామాల్లో నివసిస్తున్నారు. దాదాపు అన్ని గ్రామస్తులు కర్ణభేరిపై ఆధారపడి ఉన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి, భారతదేశంలోని గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి.ఒక గ్రామం నగర జీవితంలోని సందడి నుండి విముక్తి పొందింది. గ్రామంలో జీవితం ప్రశాంతంగా, ప్రశాంతంగా, ప్రశాంతంగా ఉంటుంది. ప్రకృతి అందాలు, పచ్చదనం కన్నుల పండువగా ఉంటాయి. గ్రామ వ్యవహారాలను చూసేందుకు గ్రామ పంచాయతీలు మరియు గ్రామపెద్దలు ఉన్నారు.

మైదాన ప్రాంతాల్లోని గ్రామస్థులు దాని కోసం బాగా, చేతి పంపు లేదా చెరువు నీటిని ఉపయోగిస్తారు. నదికి సమీపంలో నివసించే వారు నది నీటిని ఉపయోగిస్తారు. మారుమూల గ్రామాల్లోని మోట్ ఇండ్ల ముందు చెరువులు ఉన్నాయి, వారు అదే నీటిని వివిధ అవసరాలకు ఉపయోగిస్తారు. కొన్ని గ్రామాలకు ప్రభుత్వ నీటి వసతి ఉంది. చాలా గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందడం లేదు. కొందరు గ్రామస్తులు తమ పశువులను చెరువు వద్దకు తీసుకెళ్తారు. గేదెలు నీటిలో లోతుగా వెళ్లి మురికిగా చేస్తాయి.చాలా మంది గ్రామస్తులకు పారిశుధ్యం విలువ అర్థం కావడం లేదు. వారికి సరైన పారిశుధ్య సదుపాయాలు లేవు. కొందరు గ్రామస్తులు తమ పశువులను తమ ఇంటి పక్కనే ఉంచుకుని అపరిశుభ్రంగా ఉంటున్నారు. భారతదేశంలోని చాలా గ్రామాలకు వైద్య సదుపాయాలు లేవు. వాటికి కరెంటు కూడా లేదు. గ్రామీణ ప్రాంతాలు చాలా వరకు పేదరికంతో ఉన్నాయి. ఉత్పాదకత స్థాయిలు తక్కువగా ఉన్నాయి. కనీస కనీస సేవల కొరత ఉంది. గ్రామస్తులు కొందరికి మూఢనమ్మకాలు ... ఎక్కువ కంటెంట్‌ని చూపించు...ఇంట్లో నివసించే వృద్ధుడు ఇంటి పెద్ద. ముఖ్యమైన నిర్ణయాలన్నీ ఆయన మార్గదర్శకత్వంలోనే తీసుకుంటారు. మహిళలు తన ఇంటిని చూసుకోవాలి , కొన్నిసార్లు ఇతర కుటుంబ సభ్యులతో పొలాల్లో పని చేయాల్సి ఉంటుంది, పాఠశాలకు వెళ్లే పిల్లలు కూడా ఇంటి కార్యకలాపాలు పశువుల పెంపకంలో, కుటుంబ సభ్యులతో పొలాల్లో పని చేయాల్సి ఉంటుంది. %ా+% చాలా ఖరీదైనది కాబట్టి, మహిళలు 'చులాస్'లో ఆహారాన్ని వండడానికి కలపను ఉపయోగిస్తారు. పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు వెళతారు , ఇంటి పనులలో పాల్గొంటారు. మనిషి సామాజిక జీవిగా వ్యవహరిస్తాడు , అన్ని సంబంధాలు ,ఇతర బహిరంగ కార్యకలాపాలను నిర్వహిస్తాడు. బహిరంగ కార్యక్రమాలలో , విద్యను పొందడంలో సమాజంలో సమాన భాగాలుగా ఉండటంలో స్త్రీలు సమానంగా పాల్గొనే కొత్త ధోరణి త్వరగా పుంజుకుంటుంది మరియు విపరీతమైన పురుషుల సహవాసం ఉన్న వ్యక్తులచే కూడా ఆమోదించబడుతుంది. వినోదం , సాంస్కృతిక కార్యక్రమాలు ,'నౌటాంకీస్' అని పిలువబడే గ్రామ నాటక ప్రదర్శనల కోసం గ్రామాల్లో సామాజిక సమావేశాలు నిర్వహించబడతాయి. ఈ నాటక ప్రదర్శనలు గ్రామ కథలు, పౌరాణిక విశ్వాసాలు , నైతిక ముగింపులతో కూడిన కథల ఆధారంగా ఉంటాయి. ప్రజలు నవ్వుతూ ఈ సామాజిక కార్యక్రమాలలో పాల్గొని ఆనందిస్తారు మరియు ఇవి గ్రామ జీవితంలో ముఖ్యమైన భాగం. ఈ విషయాలు వారి మధ్య పరస్పర అవగాహన మరియు సహకారాన్ని పెంచుతాయి. ఇళ్ళు సాధారణంగా పెంకుతో ఉంటాయి లేదా వాటిలో 70% మట్టి , బురద రూఫ్ టాప్‌తో స్థానిక భాషలో 'ఛాన్స్' అని పిలవబడే పొట్టుతో లేదా ఘనమైన మట్టి చెక్కిన ప్లేట్లతో తయారు చేయబడ్డాయి.

దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి గ్రామాలను స్థాపించిన వారు ఇక్కడ మొదటి స్థిరనివాసులని చెబుతారు. ఈ స్థిరనివాసులు ఆ ప్రాంతంలోని నియోలిథిక్ ప్రజల మధ్య రాతి పనిముట్లను వ్యాపారం చేసేవారు. ఈ ప్రాంతం దక్షిణ భారతదేశంలో ఎక్కడైనా రాతి పనిముట్లను ఉత్పత్తి చేసే అతిపెద్ద కేంద్రంగా పరిగణించబడుతుంది. బండరాళ్లపై నియోలిథిక్ కళ-1,000 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సంగనకల్లు గ్రామ నివాసం ఇప్పటివరకు తెలిసిన అతిపెద్ద గ్రామ సముదాయంగా పరిగణించబడుతుంది. కొండ గొలుసులోని బండరాళ్లపై కనిపించే రాతి కళ, రింగింగ్ రాళ్లతో కూడిన ఆచారాలు , సామాజిక వేడుకలకు నిదర్శనం, ఇప్పటికీ చేతితో పెర్కషన్ గుర్తుల ద్వారా భద్రపరచబడింది.రాతి గొడ్డలిని పాలిష్ చేసిన గ్రైండింగ్ గీతలు, ధాన్యం ప్రాసెస్ చేయబడిన బండరాళ్లపై నిస్సారమైన పుటాకార ఉపరితలాలు పెద్ద ఎత్తున రాతి పనిముట్లను తయారు చేయడానికి డోలరైట్ దోపిడీ చేయబడిన డైక్‌లు గొప్ప నియోలిథిక్ సంస్కృతికి ,ప్రజల నైపుణ్యాలకు సాక్ష్యంగా నిలుస్తాయి. ప్రారంభ,వ్యవసాయదారులు సంగనకల్లులో స్థిరపడిన ప్రజలు చిన్న మినుములు పప్పుధాన్యాలు సాగు చేసిన తొలి వ్యవసాయదారులు. వారు పశువులను , గొర్రెలు పశువుల పెంపకం ఈ ప్రాంతంలో ప్రబలంగా ఉంది. వారు గొర్రెలు , మేక పేడతో సహా పేడను డంపింగ్ చేయడానికి ప్రత్యేక ప్రాంతాలను నిర్మించారు. ఈ కుప్పలు బూడిద గుట్టల రూపంలో నేటికీ మనుగడలో ఉన్నాయి. వాటిని కుప్గల్, కుడతిని మొదలైన ప్రదేశాలలో చూడవచ్చు. సంగనకల్లు ప్రజలు విశాలమైన రాయలసీమ ప్రాంతంలోని ఇతర నవీన శిలాయుగ ప్రజలకు రాతి పనిముట్లను వ్యాపారం చేసేవారు. సుమారు 2000 బీసీ నాటికి, ఈ స్థావరం దక్షిణ భారతదేశంలో ఎక్కడైనా రాతి పనిముట్లను ఉత్పత్తి చేసే అతిపెద్ద కేంద్రంగా ఉంది. సంగనకల్లు కొండ సముదాయం మట్టి రాయితో కూడిన పురాతన గృహాలు, ఆచారాలు , సాంఘిక వేడుకలకు సంబంధించిన రాక్ ఆర్ట్ సాక్ష్యం. క్రీస్తుపూర్వం 1500 నాటికి, చనిపోయినవారిని పాతిపెట్టడానికి స్మశానవాటికలు సృష్టించబడ్డాయి. వాస్తవానికి ఈ కొండల నుండి వివిధ రకాల శ్మశాన నిర్మాణాలు నమోదు చేయబడ్డాయి.పురావస్తు శాస్త్రజ్ఞుల ఆనందం,సంగనకల్లు ఒక చిన్న ప్రాంతంలో అత్యధికంగా కనుగొనబడినందున పురావస్తు శాస్త్రవేత్తల ఆనందాన్ని పొందింది. వాస్తవానికి, కర్నాటక్ విశ్వవిద్యాలయం ,కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి చెందిన పురావస్తు శాస్త్రవేత్తలు 1997 నుండి ఈ ప్రదేశంలో పని చేస్తున్నారు. సంవత్సరాలుగా, వారు అనేక విభాగాల పరిశోధనలను నిర్వహించారు. దేశం , విదేశాల నుండి చాలా మంది పురావస్తు శాస్త్రవేత్తలు ఈ ప్రాంతంలో పనిచేశారు ,పరిశోధనలు పురావస్తు శాస్త్రానికి అంకితమైన అనేక ప్రముఖ పత్రికలలో ప్రచురించబడ్డాయి.1,000 పేజీల శాస్త్రీయ అధ్యయనంతో సహా అనేక ప్రచురణలు పురోగతిలో ఉన్నాయి. మొత్తం ప్రాంతం డిజిటల్‌గా మ్యాప్ చేయబడింది , సాంస్కృతిక ప్రకృతి దృశ్యం యొక్క ప్రతి మిల్లీమీటర్ ఈ మ్యాప్‌లలో రికార్డ్ చేయబడింది.

సంగనకల్లు బళ్లారిలోని ఆసక్తికరమైన పురావస్తు ప్రదేశం మాత్రమే కాదు. ఇంకా చాలా ఉన్నాయి. కానీ బళ్లారిలో విస్తృతంగా జరుగుతున్న క్వారీలు, మైనింగ్ కార్యకలాపాల కారణంగా చాలా వరకు నాశనమవుతున్నాయి. అదృష్టవశాత్తూ, సంగనకల్లు ఇతర ప్రదేశాల కోసం, బళ్లారిలోని పటేల్ నగర్‌లోని డిప్యూటీ కమీషనర్ నివాసానికి ఆనుకొని ఉన్న కన్నడ మరియు సంస్కృతి సముదాయంలో హంపిలో ఉన్న మ్యూజియంను పోలిన మ్యూజియం రాబోతోంది. మ్యూజియం కోసం జిల్లా యంత్రాంగం పూర్తిగా నిర్మించిన రెండంతస్తుల భవనాన్ని (సుమారు 8000 చదరపు అడుగులు) అందుబాటులోకి తెచ్చింది. సంగనకల్లు సైట్ నుండి కనుగొన్న అనేక విషయాలు ఈ మ్యూజియంలో ప్రదర్శించబడతాయి. ప్రతిపాదిత మ్యూజియం కాంప్లెక్స్ బళ్లారి , దాని పరిసర ప్రాంతాల చరిత్ర ,సాంస్కృతిక వారసత్వాన్ని దృష్టిలో ఉంచుకునే లక్ష్యంతో ఉంది. ప్రజలు తమ వారసత్వాన్ని కాపాడుకోవాలనే నిబద్ధతను లోతైన గర్వం ,ఆందోళనతో నింపడం దీని లక్ష్యం. యుగయుగాల ప్రాంత ప్రజల మైలురాయికి సంబంధించిన ఆడియో-విజువల్ టైమ్ క్యాప్సూల్‌ను రూపొందించే ప్రణాళికలు కూడా ఉన్నాయి.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
అసిస్టెంట్ ప్రొఫెసర్ జర్నలిజం విభాగం
పీఆర్‌వో, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, కేయూ



### మౌలాలి దర్గా అభివృద్ధి పనులను

# వెంటనే పూర్తి చేయాలి

### కమిషనర్ రోనాల్డ్ రోస్

**హైదరాబాద్ సిటీ, మార్చి 12(జనం సాక్షి):**

మౌలాలి హజ్రత్ కొహి మౌలాలి దర్గా భక్తుల సౌకర్యం కోసం చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని కమిషనర్ రోనాల్డ్ రోస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కమిషనర్ ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ హాసన్ ఎఫెంది తో పాటు ప్రాజెక్ట్ సిఇ దేవానంద్, ఎస్ఈ రవీందర్ రాజు, జోనల్ కమిషనర్ లతో కలిసి కమిషనర్ దర్గా అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. జిహెచ్ఎంసి ద్వారా దర్గా అభివృద్ధి పనులను రెండు దశలో చేపట్టేందుకు చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు. దర్గాకు వచ్చే భక్తుల కోసం దర్శనం ఇబ్బంది పడకుండా ఉండేందుకు మొదటి దశలో చేపట్టిన రిటైనింగ్ వాల్ తో పాటు రోడ్డు, మిడిల్ ల్యాండింగ్ వాహనాలను నిలిపేందుకు 1000 చదరపు మీటర్ల పార్కింగ్ పూర్తి చేశామని, రెండో దశలో రిటైనింగ్ వాల్‌తో పాటుగా రోడ్డు నిర్మాణానికి పనులు చేపట్టినట్లు అట్టి పనులు 50 శాతం పూర్తయ్యాయని, మిగతా 50 శాతం అసంపూర్తి పనులను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్టు కమిషనర్ వెల్లడించారు. కాంట్రాక్టర్ సగం పనులు చేసి నిలిపి వేశారని దర్గా నిర్వహణకులు కమిషనర్ కు వివరించారు. అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయించాలని ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు.

## సైలెన్స్ మూడ్‌లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**శంషాబాద్, మార్చి 12 (జనం సాక్షి)**



దేశవ్యాప్తంగా తెలంగాణ వ్యాప్తంగా ఎంపీ ఎన్నికల హడావిడిలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే, బిజెపి నేతలు బూత్ కార్యకర్తల సమావేశంలో కార్యకర్తలకు ఉత్తేజం నింపుతుంటే, బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల వలసలు నేపథ్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సైలెన్స్ మూడ్‌లో ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చేవెళ్ల నియోజకవర్గంలో ప్రచా రం జోరుగా కొనసాగిస్తున్నారు, బిజెపి ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి పార్లమెంట్ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. పలు పార్టీల ప్రచారాలకు దూరంగా ఉంటున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తదుపరి కార్యాచరణ ఎప్పటిలోగా ప్రకటిస్తారో అనే పార్టీ క్యాడర్లో అయోమయం నెలకొంది, ఏ పార్టీకి అనుకూలంగా ప్రకటనలు ఇవ్వకుండా సైలెన్స్ మూడ్‌లో ఉండడాన్ని పార్టీ క్యాడర్ జీవించుకోలేక పోతున్నాయి. గత కొన్ని రోజుల్లో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చు కుంటున్నారని ప్రచారం పుకార్లు షికార్లు అవుతున్నా ఎలాంటి పట్టింపు లేకుండా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ సైలెన్స్ మూడ్లో గడుపుతున్నారు. శంషాబాద్ మండల పరిధిలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులకు ప్రజాప్రతినిధులకు దిశా నిర్దేశం లేకుండా పార్టీ కేడర్‌కి సమయం కేటాయించకుండా ఒంటరిగా గడపడాన్ని నాయకుల్లో కార్యకర్తల్లో పలు అనుమానాలకు తావిస్తున్నాయి. పార్టీ క్యాడర్ కి ప్రజా ప్రతినిధులకు దిశా నిర్దేశం చేసే ఎమ్మెల్యే సైలెన్స్ మూడ్‌లో ఉండడం పార్టీ క్యాడర్‌ను అయోమయాన్ని గురి చేస్తున్నాయి. సైలెన్స్ మూడ్ ఎంపీ ఎన్నికల వరకు కొనసాగుతుందిఅంటూ పలువురు పార్టీ నాయకులు చమత్కరిస్తున్నారు.



## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

### కార్పొరేటర్ రావుల శేషగిరి

**కుత్బుల్లాపూర్ మార్చి 12 (జనం సాక్షి)**

విద్యార్థులు అన్ని రంగాలలో ప్రతిభను కనబరచాలని గాజుల రామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని లెనిన్ నగర్‌లో గల బాపూజీ హై స్కూల్లో విద్యార్థులకు యాజమాన్యం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రావుల శేషగిరి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తు ముడిపడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవాబ్, పాఠశాల యాజమాన్యం ముంతాజ్, హజ్రత్ అలీ, స్థానిక నాయకులు రామ్ రెడ్డి, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులందరికీ

## ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలి

**సంగారెడ్డి బ్యూరో, మార్చి 12 (జనం సాక్షి)**




జిల్లాలోని పారిశుద్ధ్య కార్మికులందరికీ ఈఎస్ఐపీ ఎఫ్ సౌకర్యం కోసం వెంటనే దరఖాస్తు చేయించాలని జాతీయ సఫయి ఖర్మచారి కమిషన్ డా,,పిపి వావాజీ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కార్మికుల సమస్యల తెలుసుకోవడం కోసం జిల్లా స్థాయి అధికారులు, పారిశుద్ధ కార్మికులతో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలోని అర్హులైన కార్మికులందరికి పిఎఫ్, ఇఎస్ఐ అప్డేట్ చేయాలన్నారు. కోవిడ్ సమయంలో సేవలు అందించిన సఫయి ఖర్మ చారులను ఆయన అభినందించారు. అవుట్ సోర్సింగ్ ద్వారా సకాలంలో జీతాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సఫయి కర్మాచారులకి వెంటనే ఐడెంటిటీ కార్డులను అందజేయాలన్నారు. మూడు నెలలుకు ఒక సారి ఖర్మచారులకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. రిటైర్మెంట్ అయిన సఫయి ఖర్మచారులకు ఉద్యోగుల బెనిఫెట్స్ పూర్తిగా చెల్లించాలి అని అధికారులను ఆదేశించారు. సఫయి ఖర్మా చారుల కారుణ్య నియామకాలను పెండింగ్‌లో ఉంచొద్దని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య సివరేజ్ పనులు చేస్తూ ప్రమాదాలలో మరణించిన కార్మికుల కుటుంబాలకు నష్ట పరిహారం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం అందించాలన్నారు. అట్రాసిటీ కేసుల వివరాలు కమిషన్కు వెంటనే అందించాలి అని ఆదేశించారు. టాయిలెట్ కాంట్రాక్టు లలో సఫయి ఖర్మచారుల కుటుంబాలకు ప్రాధ్యన్యత ఇవ్వాలి అని, పీఎం ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్, గృహలక్ష్మి పథకలలో సఫాయి కర్మఛారుల కుటుంబాలకు లబ్ధి చేకూర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సలహాదారుడు గీరేందర్నాథ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సాంఘీక సంక్షేమాధికారి రామాచారి తదితరులు పాల్గొన్నారు.

# నాయకుడిగా కాదు..మీ సేవకుడిగా వస్తున్న

### మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్

**ఎల్బీనగర్, మార్చి 12 (జనం సాక్షి)**



నాయకుడిగా కాదు మీ సేవకుడిగా మల్కాజ్గిరి ప్రజల ముందుకు వస్తున్న భారీ మెజారిటీతో గెలిపించి, ఆశీర్వదించాలని మల్కాజ్గిరి నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మన్సూరాబాద్ డివిజన్ బిజెపి పార్టీ ఆధ్వర్యంలో మల్కాజ్గిరి భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా మన్సూరాబాద్ పెద్ద చెరువు నందు వాకర్స్ ను సహారా స్టేట్స్ కాలనీ సభ్యులను వారు కలిశారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ మాట్లాడుతూ..గత ప్రభుత్వంలో కేసీఆర్ అహంకారంతో మాట్లాడుతూ మా డబ్బుతోనే కేంద్ర ప్రభుత్వం నార్తన్ స్టేట్స్ ను అభివృద్ధి చేసిందని హేళనగా మాట్లాడారని ప్రజలు కట్టిన పన్నులకు కాపలాదారులు మాత్రమేనని యజమానులు కారు అని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రం శాసనసభలో సంవాదన జరుగుతున్నప్పుడు ఆనాటి ముఖ్యమంత్రితో మీరు రాష్ట్రంలో ఉండే ప్రజల ప్రాణాలకు, ప్రజల ఆస్తులకు కాపలాదారునువే తప్ప యజమానివి కాదని చెప్పానని గుర్తు చేస్తూ ఎప్పుడు కూడా భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ నేను ప్రజలకు ఇది, అది ఇస్తున్నానని మాట ఎప్పుడు అనలేదని నా మీద విశ్వాసం ఉంచి నాకు ఈ బాధ్యత అప్పజెప్పినందుకు ఒక సేవకుడిగానే పనిచేస్తున్నానని చెబుతాడని అన్నారు. వారసత్వ రాజకీయాలు లేకుండా ఈ దేశమే సర్వస్వం అని 140 కోట్ల మంది ప్రజల క్షేమమే ధ్యేయమని బతికేటటువంటి వ్యక్తి మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ అని గర్వంగా చెప్పుకుంటానని అలాంటి వ్యక్తి సారథ్యంలో పనిచేయడం సంతృప్తినిస్తుందని అన్నారు. కెసిఆర్ కళ్ళు నెత్తికెక్కి అహంకారంతో మాట్లాడుతుండని అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఓటు వేసామని ప్రజలు చెప్పుకుంటున్నారని మా దేశం సురక్షితంగా ఉండాలంటే మళ్లీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కావాలని ఇతర పార్టీలకు ఓటు వేస్తే దరఖాస్తులు ఇచ్చి దండం పెట్టే పరిస్థితి రావద్దని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని ప్రపంచ చిత్రపటం మీద భారత జాతి ఆత్మగౌరవబావుటా నరేంద్ర మోడీ తప్ప వేరే మార్గం లేదని అన్నారు. ఒకప్పుడు నినాదాలకే పరిమితమైన వాళ్ళమని నేడు భారతదేశం వైపు కన్నెత్తి చూసే సాహసం ఈ దేశం కూడా చేయట్లేదని ప్రపంచ దేశాలు సైతం రెడ్ కార్పెట్లు వేసి మరి ప్రధాని నరేంద్ర మోడీని ఆహ్వానిస్తున్నారని అన్ని రంగాలలో అగ్రస్థానంలో నిలిపే దిశగా వారు అడుగులు వేస్తున్నారని ప్రజలందరూ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక సీట్లలో బిజెపి పార్టీని గెలిపించాలని కోరుతూ రాబోవు రోజుల్లో ఎల్బీనగర్ అభివృద్ధికి పెద్ద పీట వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎల్బీనగర్ కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్, కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి, తుంగతుర్తి బిజెపి ఇంచార్జ్ కడియం రామచంద్రయ్య, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేమన్ రెడ్డి, వివిధ కాలనీల సంక్షేమ సంఘం నాయకులు, బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దోమల బెడదకు నివారణ చర్యలు చేపట్టండి



### మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

**శేరిలింగంపల్లి, మార్చి 12 (జనం సాక్షి) :**

పారిశుద్ధ్య నిర్వహణ లోపంవల్ల శేరిలింగంపల్లి నియోజకవర్గంతో పాటు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఈమధ్య దోమల బెడద విపరీతంగా పెరిగిపోయిందని, తద్వారా ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని మియాపూర్ డివిజన్ కార్పొరేటర్, గ్రేటర్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ఆరోపించారు. ఈ మేరకు మియాపూర్ డివిజన్ పరిధి గురునాథం చెరువులో దోమల బెడద నివారణ కొరకై గుర్రపు డెక్క తొలగింపు పనులను జిహెచ్ఎంసి ఎంటామాలజీ అధికారులు, స్థానిక నాయకులు, పరిసర ప్రాంత నివాసితులతో కలసి మంగళవారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈసందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ గురునాథం చెరువు సమీప పరిసర ప్రాంతాలలో ఉన్నటువంటి పలు కాలనీలలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదని, పరిసరాలన్నీ అపరిశుభ్రంగా ఉన్నాయంటూ ఆయా కాలనీలకు చెందిన వివిధ అసోసియేషన్ ప్రతినిధులు తనను కలిసి గురునాథం చెరువులో దోమల బెడద నివారణ కొరకు తగిన చర్యలు చేపట్టాల్సిందిగా కోరడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా జిహెచ్ఎంసి అధికారులకు, ఎంటమాలజీ విభాగం అధికారులకు తాను సమాచారం అందించి మియాపూర్ డివిజన్ పరిధి గురునాథం చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులను చేపట్టాల్సిందిగా సూచించడంతో జిహెచ్ఎంసి పరిధిలోని ఎంటమాలజీ అధికారులు సిబ్బందితో కలిసి వచ్చి గుర్రపు డెక్క తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో గురునాథం చెరువు వద్దకు ఆయా కాలనీల ప్రతినిధులు, స్థానిక నాయకులతో కలిసివెళ్లి గుర్రపు డెక్క తొలగింపు ప్రక్రియను పరిశీలించడం జరిగిందని ఉప్పలపాటి శ్రీకాంత్ తెలిపారు. అయితే గుర్రపుడెక్క తొలగింపు చర్యలు వేగవతంగా చేపట్టాలని అధికారులకుసూచించడం జరిగిందన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలో ఉన్నటువంటి ఇతర చెరువులలో సైతం గుర్రపుడెక్క తోలగింగిపు పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మహమ్మద్ జాహంగీర్, మహమ్మద్ మోహిన్, యాదుల్ల, జిహెచ్ఎంసి ఎంటమాలజీ అధికారి గణేష్, మరియు తదితరులు పాల్గొన్నారు.




## చేవెళ్ల పార్లమెంటు హస్త గతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి

**రాజేంద్రనగర్, మార్చి 11 (జనం సాక్షి)**

చేవెళ్ల పార్లమెంట్ హస్త గతం కావడానికి ప్రతి కార్యకర్త సమిష్టిగా శ్రమించాలని వికారాబాద్ జిల్లా చైర్పర్సన్ సునీత మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ ముఖ్య సమావేశానికి ముఖ్య అతిథులుగా వికారాబాద్ జిల్లా చైర్పర్సన్ సునీత పద్మా రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా చైర్ పర్సన్ సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందిస్తున్న ప్రజా పాలనలోని 6 గ్యారంటీలను అమలు చేస్తూ ప్రజల మనసులో సుస్థిరంగా నిలిచిపోయిందని గడిచిన గత 10 సంవత్సరాల నుండి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేతపుచ్చుకొని హామీలు అమల్లో పూర్తిగా విఫలమైందని, దళిత ముఖ్యమంత్రి చేస్తానని, దళితులకు మూడెకరాల భూమి, ఉద్యోగ నోటిఫికేషన్, నిరుద్యోగ భృతి ఇలా అనేక హామీలను నెరవేర్చక పోడంతోనే తెలంగాణ ప్రజలు చిత్తుగా ఓడించారని, ఎన్నికల ముందు నుంచి అధికారం వస్తే వంద రోజుల్లో అమలు చేస్తామన్న పథకాలను 90 రోజుల్లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేసి చూపించడంలో ప్రజలు హర్షిస్తున్నారన్నారు. చేవెళ్ల పార్లమెంటులో పూర్తిస్థాయిలో అభివృద్ధి జరగాలంటే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని తనను అన్ని వర్గాలవారు మద్దతు తెలిపి పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని సునీత మహేందర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ అనిత రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెల్లా నరసింహారెడ్డి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కస్తూరి నరేందర్ ముదిరాజ్, గండిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు క్యాతం అశోక్ యాదవ్, మేయర్ మహేందర్ గౌడ్, బండ్లగూడ జాగిర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి. కృష్ణారెడ్డి, పాపిరెడ్డి, జితేందర్, ధనంజయ, జల్లి వెంకటేష్, సంజయ్ యాదవ్, జలపల్లి నరేందర్, శేఖర్ యాదవ్, కిరణ్, వినోద్, యాసిన్, ఆయుబి,గణేష్ పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుటీర, చేనేత పరిశ్రమలను ప్రోత్సహించేందుకే రైల్వే స్టేషన్లలో షాపింగ్ కాంప్లెక్స్

### మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్

**కాప్రా, మార్చి 12 (జనం సాక్షి)**




కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారత రైల్వే ఆధునీకరణ కార్యక్రమంలో భాగంగా. మంగళవారం గుజరాత్ లోని అహ్మదాబాద్ నుండి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా సుమారు 85 వేల కోట్ల రైల్వే ఆధునీకరణ, ప్రారంభోత్సవ, శంకుస్థాపన పనులు వర్చువల్ గా ప్రారంభించారు. ఇందులో భాగంగా చర్లపల్లి రైల్వే టెర్మినల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్‌లు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి విశాఖ రైల్వే స్టేషన్ వరకు, విశాఖ రైల్వే స్టేషన్ నుండి పూరి రైల్వే స్టేషన్ వరకు ప్రయాణించే వందే భారత్ రైళ్లకు పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇంత పెద్ద రైల్వే టెర్మినల్ మన ప్రాంతంలో నిర్మించడం హర్షనీయ విషయమని అన్నారు. ఈ నేపథ్యంలో మన ప్రాంత ప్రజలకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విషయంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఎన్ విఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ..దేశంలోనే ప్రతి రైల్వే స్టేషన్ ను మోడ్రన్ రైల్వే స్టేషన్గా తీర్చి దిద్దడమే మోడీ లక్ష్యం అన్నారు. ఆధునిక హంగులతో, సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు అన్నారు. రాష్ట్రంలోని, దేశంలోని కుటీర, చేనేత పరిశ్రమలను ప్రోత్సహించే విధంగా రైల్వే స్టేషన్లలో షాపింగ్ మాల్‌లో నిర్మించి చిన్న తరహా ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇస్తున్నారు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే బోర్డు సభ్యులు ఎం. లక్ష్మణ్ గౌడ్, డి నాదం, కొమ్ము నర్సింగరావు, చల్లా ప్రభాకర్, నాగమణి, రైల్వే అధికారులు ఏడిఎమ్ శ్రీనివాస్, స్టేషన్ మేనేజర్ దిలీప్ కుమార్, ఏకే సిన్హా, విజయ్ కుమార్, అధికారులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## ఆదిత్య మెహతా ఫౌండేషన్ పారా అథ్లెట్ పావనికి కాంస్యం

**హైదరాబాద్ మార్చి 12 (జనం సాక్షి)**

న్యూఢిల్లీలో జరుగుతున్న వరల్డ్ షూటింగ్ పారా స్పోర్ట్ ప్రపంచ కప్‌లో తెలంగాణకు చెందిన పావని బానోత్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి కాంస్య పతకం సాధించింది. ఈమె ఆదిత్య మెహతా ఫౌండేషన్‌లో శిక్షణ పొందారు. ఫైనల్స్‌లోకి నాలుగు జట్లు చేరాయి. అవి భారతదేశం, అమెరికా, బ్రెజిల్, న్యూజి లాండ్, వీటలో భారత్, న్యూజిలాండ్ మధ్య కాంస్య పతకానికి పోటీ జరిగింది, భారత్ 17 పాయింట్లతో గెలుపొందింది. న్యూజిలాండ్ 15 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. బ్రెజిల్ స్వర్ణం, అమెరికా రజతం గెలుచుకు న్నాయి. ఆదిత్య మెహతా ఫౌండేషన్‌కు చెందిన 16 ఏళ్ల 11వ తరగతి విద్యార్థిని పావని, 15 ఏళ్ల కుష్బు 13 దేశాలకు చెందిన 46 మంది ప్రతిభావంతులైన బృందంలో అతి పిన్న వయస్కురాలుగా నిలిచారు. పావని తొమ్మిది నెలల కఠోర శిక్షణతో ఈ పతకం సాధించింది.

# తాగునీటి అవసరాలకు సరిపడా నీరు!

- జలాశయాల్లో తగినంత నీటి నిల్వలు
- అదనపు జలాల కోసం ఎమర్జెన్సీ పంపిగ్‌కు ఏర్పాట్లు
- ప్రజలెవరూ ఆందోళనకు గురి కావద్దని జలమండలి విజ్ఞప్తి



**హైదరాబాద్ ప్రతినిధి మార్చి 12 (జనంసాక్షి)**

ఈ వేసవిలో హైదరాబాద్ మహానగర ప్రజల తాగు నీటి అవసరాలకి సరిపడా నిల్వలు ఉన్నాయని.. అందువల్ల నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని జలమండలి స్పష్టం చేస్తోంది. ప్రధాన జలాశయాలైన నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో సరిపడా నీరు లేనందున.. నగర వాసులకు తాగునీటి సమస్య తలెత్తుతుందని కొన్ని వార్తా పత్రికలు కథనాలు ప్రచురించాయి. ఈ నేపథ్యంలో జలమండలి ఈ విషయంపై క్లారిటీ ఇస్తుంది. ఓఆర్ఆర్ వరకు విస్తరించిన హైదరాబాద్ మహా నగర వాసుల తాగు నీటి అవసరాల కోసం జలమండలి.. నాగార్జున సాగర్ జలాశయం, అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై ఫేజ్ – 1, 2, 3ల ద్వారా రోజుకి 270 ఎంజీడీల నీటిని తరలిస్తోంది. ఈ లెక్కన నెలకు 1.38 టీఎంసీల నీటిని సరఫరా చేస్తుంది. అయితే ఈ రోజు (తేది: 12.03.2024) నాటికి నాగార్జున సాగర్ నీటి నిల్వ సామర్థ్యం 138.73 టీఎంసీ, 514.10 అడుగులు ఉంది. గతేడాది ఇదే రోజున 187.07 టీఎంసీలు, 539.40 అడుగుల నీరు ఉంది. ప్రస్తుతం రిజర్వాయర్ లో డెడ్ స్టోరేజీ లెవల్ పైన (510 అడుగుల పైన) 7.06 టీఎంసీల నీటి లభ్యత ఉంది. కాబట్టి.. ఈ వేసవిలో హైదరాబాద్ నగరానికి తాగునీటి కొరత ఉండదు. జలమండలి అధికారులు ఎప్పటికప్పుడు ప్రాజెక్టు పరిస్థితుల్ని పర్యవేక్షిస్తున్నారు. నగరానికి అవసరమైన 270 ఎంజీడీల నీరు సరఫరా చేయడానికి ఎలాంటి ఆటంకాలు ఉండవు. రానున్న నాలుగు నెలల వరకు అనగా ఈ జులై చివరి నాటికి కావాల్సిన నీరు సరఫరా చేసేందుకు ఎమర్జెన్సీ పంపింగ్ ఏర్పాట్ల పనులు పూర్తి కావస్తున్నాయి. జలాశయంలో నీటి మట్టం 510 అడుగులకు చేరగానే.. ఈ ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా హైదరాబాద్ కు సరిపడా నీటిని సరఫరా చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటామని జలమండలి తెలిపింది. మరోవైపు గోదావరి జలాల కోసం ఎల్లంపల్లి జలాశయంలో డెడ్ స్టోరేజీ నుంచి నీటిని తరలించేందుకు అత్యవసర పంపింగ్ చేయడానికి అవసరమైన ప్రక్రియ మొదలు పెట్టింది. దీంతో పాటు అవసరాన్ని బట్టి ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జంట జలాశయాల నుంచి అదనపు జలాలను తరలించేందుకు సమాయత్తమవుతోంది. ఇవే కాకుండా.. సింగూరు, మంజీరా జలాశయాల్లో సంతృప్తికరమైన నీటి నిల్వలు ఉన్నాయి. కాబట్టి.. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది ఉండదు. అందువల్ల నగర ప్రజలు ఎలాంటి ఆందోళనలకు గురి కావద్దని జలమండలి విజ్ఞప్తి చేస్తోంది.

## హెచ్‌హెచ్‌ఎఫ్ ఆధ్వర్యంలో పట్టణ పేదలకు ఉచిత ఆరోగ్య సేవలు

హైదరాబాద్, మార్చి 12 (జనం సాక్షి)

హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ (హెచ్‌హెచ్‌ఎఫ్) ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలోని మురికివాడల్లో ఉన్న పట్టణ పేదలకు ఉచితంగా ఆరోగ్య సంరక్షణ అందించారు. వందకు పైగా అర్బన్ మురికివాడలు, పదిహేడు గ్రామాల్లోని సుమారు ఎనిమిది లక్షల మంది పట్టణ పేదలకు ఈ సేవలు అందాయి. హైదరాబాద్ నగర జనాభాలో ముస్లిం మైనారిటీలు 43 శాతం ఉన్నారు. వీరిలో 60 శాతం మంది బలహీన వర్గాలకు చెందినవారు. ఎనిమిది లక్షల పేద రోగులకు ఉచిత ఆరోగ్య సంరక్షణ అందించడం ద్వారా హెచ్‌హెచ్‌ఎఫ్ ఇందులో 30 శాతాన్ని కవర్ చేసింది. ఈ లబ్ధిదారులు పేదరికం, అసమానతలను అంతం చేయడానికి యూఎన్ ద్వారా స్ట్రాటజిక్ డెవలప్‌మెంట్ గోల్స్ వ్యూహాత్మక అభివృద్ధి లక్ష్యాలకు (ఎస్డీజీ) ఇది గణనీయంగా దోహదపడింది.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
13 మార్చి 2024

# అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ నైజం

## ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్ బ్యూరో మార్చి 12 (జనం సాక్షి)**



అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ నైజమని, హంగు ఆర్భాటాలకు, కోలాహలాలకు ఆమడ దూరం ఉంటామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం డిసిసి కార్యదర్శి ఎం కృష్ణయ్య ఆధ్వర్యంలో హన్వాడ మండలానికి చెందిన పలు గ్రామాల లేబర్ సంఘం అధ్యక్షులు, టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక బిఆర్ఎస్ పార్టీ అనేది త్వరలో గత చరిత్ర మాత్రమే అవుతుందని, భవిష్యత్తు అంతా కాంగ్రెస్ పార్టీదేనని ఆయన స్పష్టం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో దౌర్జన్యాలు, భూ కబ్జాలు, దోపిడీలు చేసేవారని, కానీ కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజల పక్షాన నిలబడి వారి సంక్షేమం కోసం కృషి చేస్తుందని, ఇప్పుడు జరుగుతున్న ప్రజాపాలనకు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి ఎవరు వచ్చినా, పార్టీ అందరినీ గుండెల్లో పెట్టుకొని చూసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి ఎం కృష్ణయ్య, లేబర్ సంఘం టంకర గ్రామ అధ్యక్షులు బుడ్డన్న, మల్లేష్, దమిస్తాపూర్ వెంకటయ్య, కాటారం కృష్ణయ్య, కాటారం రామచంద్రయ్య, ఆంజనేయులు, పెద్దదర్పల్లి మల్లేష్, నీలేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా

## ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

**నాగర్ కర్నూల్ ఆర్సీ మార్చి 12 (జనంసాక్షి):**



నాగర్ కర్నూల్ గ్రామపంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలోని గ్రామపంచాయతీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు రామయ్య తో పాటు పలువురు గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొని వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే గారికి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతుందని అన్నారు.

# వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండ చర్యలు చేపట్టాలి



## జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల నడిగడ్డ, మార్చి 12 (జనం సాక్షి)**

వేసవిలో నీటి ఎద్దడి తలేత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్ సంబంధిత అధికారులకు ఆదేశించారు.మంగళవారం గద్వాల పరిధిలోని గోనుపాడు గ్రామంలో మిషన్ భగీరథ త్రాగు నీటి సరఫరాను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ, ప్రజలకు ఇబ్బంది కలగకుండా వేసవిలో త్రాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని, మిషన్ భగీరథ ద్వారా త్రాగునీరు సరఫరా చేయాలన్నారు.నీరు వృధా కాకుండా చూడాలని, ప్రతిరోజు క్లోరినేషన్ చేయాలని సూచించారు. లీకేజీలు లేకుండా చూసుకోవాలని, తెలిపారు. ఈ సందర్భంగా త్రాగు నీరు, బల్క్ వాటర్ సౌలభ్యత,నీటి సరఫరాపై మిషన్ భగీరథ అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయితి కార్యాలయంలో నీటి సరఫరాకు సంబంధించిన ఏడు రిజిస్టర్లను, క్లోరోస్కోప్ ద్వారా నీటి స్వచ్ఛతను పరిశీలించే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ ఈ జగన్మోహన్, ఈఈ శ్రీధర్ రెడ్డి, డీఈలు, ఏఈలు, ఎంపిడిఓ ఉమాదేవి,గ్రామ ప్రత్యేక అధికారి శివకుమార్, ఎంపిఓ చెన్నయ్య, గ్రామ కార్యదర్శి సాలేహ పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి



## జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**

జిల్లాలో ఏర్పాటు చేసే మెడికల్ కళాశాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం ఆయన నారాయణపేట మండలంలోని అప్పక్ పల్లి వద్ద నిర్మిస్తున్న నూతన జిల్లా ఆస్పత్రి భవనంలో కొనసాగుతున్న మెడికల్ కళాశాల వసతి, సౌకర్యాల పనులను పరిశీలించారు.జిల్లా నూతన ఆస్పత్రి భవనంలోని రెండో అంతస్తులో కొనసాగుతున్న మెడికల్ కళాశాల తరగతి గదులు, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ ,ఉపన్యాసకుల గదులు, లైబ్రరీ, ల్యాబ్ లు, అడ్మిన్ బ్లాక్, అనాటమీ డిపార్ట్మెంట్, ఫిజియాలజీ, బయో కెమిస్ట్, ల్యాబ్లు, లెక్చర్ హాల్స్, ప్రొఫెసర్స్ రూమ్స్, ట్యూటర్ రూమ్స్, డెమో రూమ్స్ నిర్మాణ పనులను ఏప్రిల్ లోపు పూర్తిచేయాలని ఆదేశించారు. నిర్మాణ పనులలో వేగం పెంచాలన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి వెళ్లి అక్కడ కొత్తగా ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ గదిని, కంటి పరీక్షల విభాగం, డెంటల్, జనరల్ ఫిజీషియన్ గదులతో పాటు అతిసార వార్డు ను చూసి, అక్కడ వైద్యులు అందిస్తున్న సేవలను పరిశీలించారు. రోగుల వద్ద నర్సులు దురుసుగా ప్రవర్తించకుండా చూడాలని అక్కడున్న హెడ్ నర్సుకు సూచించారు. అలాగే ఆస్పత్రి ఆవరణలో ఇటీవల వేసిన సీసీ. రోడ్ను పరిశీలించారు. ఆస్పత్రి ఆవరణలో రోగుల బంధువులు విశ్రాంతి తీసుకునేందుకు నిర్మించిన షెడ్డు చుట్టూ గ్రీన్ కవర్ ఏర్పాటు చేయాలని ఆసుపత్రి సూపరింటెండెట్ డాక్టర్ రంజిత్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంవో పావని,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# చత్రపతి శివాజీ స్ఫూర్తితోనే రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్



**తూప్రాన్ మార్చి 12(జనం సాక్షి) :**

చత్రపతి శివాజీ ఉద్యమ స్ఫూర్తితోనే ఆయనను ఆదర్శంగా తీసుకొని కెసిఆర్ 14 సంవత్సరాలు తెలంగాణ పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించారని రాష్ట్ర మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. తూప్రాన్ మండలంలోని వెంకటాయపల్లి గ్రామంలో చత్రపతి శివాజీ విగ్రహ ఆవిష్కరణకు మాజీ మంత్రివర్యులు హరీష్ రావు పాల్గొన్నారు. వెంకటాయపల్లి గ్రామ శివారులో చత్రపతి శివాజీ మహారాజు విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా మాట్లాడారు. శివాజీ పోరాట పటిమ వల్ల అనుకున్న లక్ష్యాన్ని సాధించడంలో పట్టు వదలని విక్రమార్కుడిలా పనిచేశాడని కెసిఆర్ అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని వర్గాలను కలుపుకొని ఉద్యమించి తెలంగాణ రాష్ట్రం సాధించాలని 10 సంవత్సరాల పాటు తెలంగాణను సస్యశ్యామల తెలంగాణగా మార్చారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు 14 హామీలు వంద రోజులలో అమలు చేస్తానని చెప్పాడని ఇంతవరకు అమలు చేయడం లేదని విమర్శించారు. 24 కరెంటు ఇస్తానని చెప్పి 16 గంటలు మాత్రమే ఇస్తున్నాడని తులం బంగారం ఏమయిందని మహిళలకు గౌరవ మృతి ఏమైందని 4000 పింఛన్ ఇస్తానని 2000 దోచుకున్నాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లంబ వెంకటమ్మ, యువకుడు లంబ రమేష్, మహదేవ్, సభ్యులు టిఆర్ఎస్ నాయకులు సత్యనారాయణ గౌడ్, బాలకృష్ణ, కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, సత్యనారాయణ, సతీష్, సత్తార్ పురం రవి, విట్టల్ రెడ్డి, తూప్రాన్ మనోహర బాద్ మండలాలకు చెందిన నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు.



## నిబంధనలకు లోబడి లే అవుట్లకు అనుమతి

**అదనపు కలెక్టర్ మిట్టల్**

నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):

నిబంధనలకు లోబడి లేఅవుట్లకు అనుమతి ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ అన్నారు.మంగళవారం నారాయణపేటలోని సర్వే నెంబర్. 197,392 లేఔట్లను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లేఅవుట్ చేసిన స్థలాలను అదనపు కలెక్టర్ పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## దేశంలోనే అతి పెద్ద గిరిజన జాతరగా పేరుగాంచింది మేడారం

### సమ్మక్క సారక్క ప్రసాదం పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**వనపర్తి బ్యూరో మార్చి 12 (జనం సాక్షి)**

దేశంలోనే అతిపెద్ద గిరిజన పండుగగా జరుపుకొనే జాతర సమ్మక్క సారక్క జాతర అని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు.టి ఎస్ ఆర్టీసీ ద్వారా బుకింగ్ చేసిన ప్రసాదాన్ని మంగళవారం ఆర్టీసీ అధికారులు ఎమ్మెల్యేకు అందజేశారు. అధికారుల నుంచి ప్రసాదాన్ని అందుకున్న ఎమ్మెల్యే ప్రజల సంక్షేమం కోసమే ఈ ప్రసాదం బుక్ చేశామని ప్రసాదాన్ని ప్రజలకు పంపిణీ చేయాలని సూచించారు. ప్రసాదం అందించిన వాటిలో ఆర్టీసీ సీఐ దేవేందర్ గౌడ్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మసూద్, కూరగాయల రవి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## చిన్నారులకు డిపాజిట్ బుక్కులు అందించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

**చిన్న శంకరంపేట్ మార్చి 12 (జనం సాక్షి)**

చిన్న శంకరంపేట్ మండలంలోని రామాయపల్లి గ్రామంలో తల్లిదండ్రులు లేని చిన్నారులకు 25000 రూపాయల ఫిక్సుడ్ డిపాజిట్ చేసిన పోస్ట్ ఆఫీస్ బుక్కులను మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అందించారు. ఈ సందర్భంగా హన్మంత రావు మాట్లాడుతూ తమ కుటుంబం ఎప్పటికి ప్రజలకు సేవ చేయానికి ముందుంటదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చేర్మెన్ గంగ నరేందర్, మాజీ ఎంపిపి బోయిని అరుణ ప్రభాకర్, గోపాల్ రెడ్డి మేడి గణేష్ పాల్గొన్నారు.

# జిల్లా కేంద్రంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు



## ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

టాస్క్ సంస్థ ఆధ్వర్యంలో త్వరలో మహబూబ్ నగర్ స్కిల్ డెవలప్మెంట్ హబ్ గా రూపాంతరం చెందుతుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్లోని మాసబ్ ట్యాంక్ లోగల టాస్క్ కార్యాలయంలో టాస్క్ సీఈవో శ్రీకాంత్తో మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మహబూబ్ నగర్ లో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు విషయమై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే రెండు మూడు వారాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్, నాలెడ్జ్ (టాస్క్) సంస్థ ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ పట్టణంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను ఏర్పాటు చేయుటకు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అనుమతి ఇచ్చారని ఆయన తెలిపారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఐటిఐ, ఒకేషనల్, ఇంటర్, డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు, వేలాదిమంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాది అవకాశాలు కల్పించే విధంగా సరియైన కోర్సుల లో స్కిల్ డెవలప్మెంట్ లలో శిక్షణ ఇప్పించి వారి స్కిల్స్ను ప్రపంచానికి పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ సెంటర్ను ప్రారంభం చేయబోతున్నట్టు ఆయన తెలిపారు. అనతి కాలంలోనే ఈ సెంటర్ ను మహబూబ్ నగర్ పట్టణంలో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీగా రూపాంతరం చేయడానికి కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులకు ఇది సువర్ణ అవకాశమన్నారు. అలాగే మహబూబ్ నగర్ పట్టణంలో స్కిల్ డెవలప్మెంట్ బిల్డింగ్ నిర్మాణానికి అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్స్ ద్వారా 20 కోట్ల రూపాయలను ఆర్అండ్బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. మహబూబ్ నగర్ను స్కిల్ డెవలప్మెంట్ హబ్గా మార్చేందుకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు కోసం అనుమతి ఇచ్చిన రాష్ట్ర ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు కు, టాస్క్ సీఈవో శ్రీకాంత్కు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.



## సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ మాకొద్దు బాబోయ్

**గద్వాల నడిగడ్డ, మార్చి 12 (జనం సాక్షి)**

అంగన్వాడీ సెంటర్లలో సీసీ కెమెరాల ఏర్పాటు,బయోమెట్రిక్ మాకొద్దు బాబోయ్ అని మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అంగన్వాడీలు వినతిపత్రం సమర్పించారు. ఈ విధానాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమంలో తెలంగాణ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్, సీఐటీయూ నాయకులతోపాటు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



## కోర్టులో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

### హైకోర్టు జడ్జినీ కలిసిన పేట బార్ అసోసియేషన్

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**

నారాయణపేట జిల్లా కోర్టులో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని హైకోర్టు జడ్జి విజయభాస్కర్ రెడ్డినీ మంగళవారం బార్ అసోసియేషన్ సభ్యులు కలిసి విన్నవించారు. జడ్జిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు కోర్టులో ఖాళీ పోస్టుల ను భర్తీ చేయాలని అలాగే ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరారు. జడ్జిని కలిసిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్, ఉపాధ్యక్షుడు నందు నామా జీ, ప్రధాకార్యదర్శి చెన్నారెడ్డి, కార్యదర్శి భీంరెడ్డి, న్యాయవాదులు అబ్దుస్ సలీం, మల్లికార్జున్, రాజేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు సంగంబండకు మంత్రులు భట్టి, ఉత్తమ్ రాక

## ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఎస్పీ యోగేష్ గౌతమ్

**నారాయణపేట మార్చి 12 (జనం సాక్షి)**



మఖ్తల్ మండలంలోని సంగంబండ లో ప్రజా దీవెన సభలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేడు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ వద్ద బండరాయిని పరిశీలించనున్నారు. ఇందుకోసం హైదరాబాదు నుండి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డిలు హెలికాప్టర్లో నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని సంగంబండ గ్రామానికి బుధవారం 10 గంటలకు చేరుకోనున్నారు.ఇందుకుగాను మంగళవారం సంగంబండ వద్ద హెలిప్యాడ్, మక్తల్ ప్రజాదీవన సభ జరగనున్న ఏర్పాట్లను జిల్లా యస్.పి యోగేష్ గౌతం స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి స్థలాన్ని పరిశీలించారు. మంత్రుల పర్యటన సందర్భంగా బహిరంగ సభకు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజలు తరలిరానున్న నేపద్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా బందోబస్తు ఏర్పాటు సదుపాయాలను యస్.పి దగ్గరుండి పర్యవేక్షించారు. పార్కింగ్, సభాస్థలి, హెలిప్యాడ్ ఏర్పాటుకు గాను ఆయచోట్ల తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై యస్.పి యోగేష్ గౌతమ్ డి.యస్.పి లింగయ్య, సిఐ చంద్రశేఖర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట డి.యస్పి, లింగయ్య, స్థానిక సీఐ చంద్రశేఖర్, యస్ఐ వై భాగ్య లక్ష్మి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గవినోళ్ళ బాలకృష్ణారెడ్డి, జి. గోపాల్ రెడ్డి, జి .లక్ష్మారెడ్డి, బోయ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పవిత్ర రంజాన్ మాసాన్ని పకడ్బందీగా నిర్వహించుకుందాం

### ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి బ్యూరో మార్చి 12 (జనం సాక్షి)**



ముస్లిం సోదరులకు ఎంతో పవిత్ర మాసమైన రంజాన్ మాసాన్ని అందరి సహకారంతో పకడ్బందీగా నిర్వహించుకుందామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.వనపర్తి నియోజకవర్గ పరిధిలోని ముస్లిం సోదరులందరూ రంజాన్ మాసాన్ని పవిత్రంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.ప్రార్థన మందిరాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సమస్య లేకుండా ఇబ్బందులు లేకుండా, సమస్య లేకుండా ఉండేందుకు సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

## డబుల్ బెడ్రూం కాలనీ సమస్యలు పరిష్కరిస్తాం

### మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు బి.కృష్ణ

**వనపర్తి బ్యూరో మార్చి 12 (జనం సాక్షి)**

డబుల్ బెడ్రూం ఇండ్ల కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు బి.కృష్ణ అన్నారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని చిట్యాల రోడ్డులో ఉన్న డబుల్ బెడ్రూం కాలనీని ఆయన సందర్శించారు. కాలనీ మొత్తం తిరిగి సమస్యలను, సౌకర్యాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మంచినీటి సమస్య, డ్రైనేజీ, విద్యుత్ దీపాలు, సిసి రోడ్లు, సెప్టిక్ ట్యాంక్ తదితర సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. మంచినీటి సౌకర్యం లేక చాలామంది డబుల్ బెడ్రూం ఇండ్లలోకి రావడం లేదని, నీటి సమస్య, డ్రైనేజీ సమస్యలు పరిష్కారమైతే లబ్ధిదారులందరూ ఇక్కడ నివాసం ఉంటారని కాలనీవాసులు ఆయన దృష్టికి తెచ్చారు. దీనికి స్పందించిన ఆయన ఈ పనులు పూర్తి కావాలంటే రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్ను ఇక్కడికి తీసుకొచ్చి ఈ సమస్యలను వారి దృష్టికి తెస్తానన్నారు. చిన్నారెడ్డి వనపర్తికి వచ్చిన వెంటనే సమయం తీసుకుని కలెక్టర్తో పాటు ఈ కాలనీని సందర్శిస్తామని చెప్పారు. చాలా సమస్యలు ఇక్కడ పెండింగ్లో ఉన్నాయని వారు వస్తేనే వెంటనే పరిష్కారం అవుతాయని చెప్పారు. దీంతోపాటు మిషన్ భగీరథ మంచినీటి సరఫరా చేసే విధానంపై కమిషనర్తో మాట్లాడుతానని, ప్రస్తుతం 3 బోర్లు ఉన్నాయని, ఆ బోర్లకు మోటర్లు బిగించి నీటి సరఫరా చేయిస్తామని హామీ ఇచ్చారు.





కొందరు మహిళలు ఇంటి నుంచి బయటకు వచ్చి.. వారి సమస్యలను అధిగమించి, క్లిష్టమైన రంగాలలో తమ ప్రతిభతో రాణిస్తున్నారు. వీరు చరిత్రను లిఖించడమే కాకుండా.. ఎంతో మంది మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. . వారి రంగాలలో చరిత్రను లిఖించిన 7 మంది భారతీయ మహిళ గురించి తెలుసుకుందాం.

చుట్టూ ఎంత చెడు జరుగుతున్నా... ప్రతీది తప్పుగా అనిపించినా.. ఎన్ని అవమానాలు ఎదురైనా.. నేను బలంగా ఉండాలని నమ్ముతాను. అని అలనాటి నటి ఆడ్రీ హెప్బర్న్ చెప్పారు. ఇప్పటికీ ఆ మాటాలు నిజమే అనిపిస్తుంది. చుట్టూ ఛీత్కారాలు ఎదురైనా బలంగా వాటిని ఎదుర్కొంటున్న మహిళలు ఎందరో. కొందరు పురుషాధిపత్యం ఉన్న రంగాలలోకి ప్రవేశించి.. అక్కడ వారికి ఎదురైన అనేక సవాళ్లను అధిగమించారు. అలుపెరగని స్ఫూర్తితో సమస్యలను ఎదుర్కొంటూ.. ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారు. ప్రపంచస్థాయిలో రికార్డులను బద్దలు కొట్టి.. దేశం గర్వించేలా చేసిన కొందరు ఆదర్శ మహిళల గురించి...

# దేశం గర్వించే ఆ మహిళలు



### ఇందు మల్హోత్రా

చట్టం ఒక మగ కోట కావచ్చు. కానీ ఇందు వంటి మహిళలు తమ తెగతో ఆ కోటలో ప్రవేశిస్తారు. ఇతరులు సైతం వచ్చేలా ఆదర్శంగా నిలుస్తారు. 1983లో ఇందు మల్హోత్ర ప్రయాణం ప్రారంభమైంది. 1988లో ఆమె సుప్రీంకోర్టులో అడ్వకేట్-ఆన్-రికార్డ్‌గా అర్హత సాధించింది. బార్ నుంచి నేరుగా సుప్రీం కోర్టుకు ఎదిగిన తొలి మహిళగా చరిత్ర సృష్టించింది. 2018లో ఆమె సుప్రీంకోర్టులో కొత్త న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది బాధ్యతలు అప్పగించిన రెండో మహిళ కూడా ఇందునే.



### పీవీ సింధు

పీవీ సింధు గురించి తెలియని వారు ఉండరు. ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించిన మొదటి భారతీయురాలుగా నిలిచింది ఈ బ్యాడ్మింటన్ ఐకాన్. హైదరాబాద్‌కు చెందిన ఈ క్రీడాకారిణి 2013 మలేషియా ఓపెన్ గ్రాండ్ ప్రిక్స్‌లో పెద్ద బ్రేక్‌ను పొందింది. అప్పటి నుంచి ఆమె వెనక్కి తిరిగి చూసుకోలేదు. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా.. విజయాలను తలకెక్కించుకోకుండా ఆటలో ప్రదర్శనను మెరుగుపర్చుకుంటూ ముందుకు సాగింది. 2019లో బ్యాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్ని గెలిచి రికార్డులు తిరగరాసింది. అంతేకాకుండా, రియో ఒలింపిక్స్, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో వరుసగా రెండు పతకాలు సాధించిన తొలి భారతీయ క్రీడాకారిణిగా గుర్తింపు పొందింది.



### అవని లేఖ

ఈమె పారాలింపిక్స్‌లో బంగారు పతకం సాధించిన మొదటి మహిళగా చరిత్ర సృష్టించింది. జైపూర్‌కు చెందిన అవని 11 సంవత్సరాల వయసులో ఓ ఘోరమైన ప్రమాదానికి గురైంది. అప్ప టి నుంచి ఆమె వీల్ చైర్‌కే పరిమితమైంది. అప్పటి నుంచి అనేక సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ.. ఆమె ఏ మాత్రం బెదరలేదు. పట్టుదలతో ఎయిర్ రైఫిల్ లో శిక్షణ తీసుకుంది. 2015 నుంచి శిక్షణ తీసుకుని 2020 పారాలింపిక్స్‌లో పాల్గొని ఆర్-2 మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో బంగారు పతకాన్ని గెలుచుకుంది. పాలాలింపిక్స్‌లో బంగారు పతకం సాధించిన మొదటి మహిళగా నిలిచింది.



### అరుణిమా సిన్హా

అరుణిమా సిన్హా ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన మొదటి మహిళా దివ్యాంగురాలు. సమస్యను ధీటుగా ఎదుర్కొనే స్ఫూర్తి ఉంటే.. ఏ సవాళ్లు పెద్దగా అనిపించవని నిరూపించారు అరుణిమా సిన్హా, ఓ రోజు ఓ దొంగల గుంపు అరుణిమను నడుస్తున్న రైలు నుంచి తోసేశారు. ఈ క్రమంలో ఆమె కాలు కోల్పో యింది. అయినప్పటికీ ఆమె తనలోని ఆత్మవిశ్వాసాన్ని కోల్పో లేదు. 2013లో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహి ంచిన మొదటి మహిళా దివ్యాంగురాలిగా చరిత్ర సృష్టించింది. అంతే కాదండోయ్.. అంటార్కిటికాలోని ఎత్తైన శిఖరం మౌంట్ విన్సన్‌ను జయించిన మొదటి మహిళగా కూడా ఈమె ప్రసిద్ధికెక్కింది. ఆఫ్రికాలోని మౌంట్ కిలిమంజా రో, ఆస్ట్రేలియాలోని మౌంట్ కోస్కియుస్కో, ఐరోపాలోని ఎల్బ్రస్ పర్వతం, దక్షిణ అమెరికాలోని అకాన్కాగువా పర్వతాలను కూడా అధిరోహించారు ఈ పద్మశ్రీ అవార్డు గ్రహీత అరుణిమా.



### అవని చతుర్వేది

2018లో మిగ్-21లో ఒంటరిగా ప్రయాణించిన మొదటి భారతీయ మహిళా ఫైటర్ పైలట్ అవని చతుర్వేది. భావనా కాంత్, మోహనా సింగ్ జితర్వాల్‌లతో పాటు, భారత వైమానిక దళంలో చేరిన మొదటి మహిళా పోరాట పైలట్‌గా అవని నిలిచారు. విమానాన్ని వేగంగా టేకాఫ్, ల్యాండింగ్ అత్యధికంగా చేసిన మహిళగా ఈమెకు గుర్తింపు ఉంది. ఈ క్రమంలోనే ఆమె మిగ్-21లో ఒంటరిగా ప్రయాణించారు.



### గీతా గోపీనాథ్

గీత గోపినాథ్ లాంటి స్త్రీలకు పరిచయం అక్కర్లేదు. 2018లో ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్‌లో చీఫ్ ఎకనామిస్ట్‌గా నియమితులైన మొదటి భారతీయ మహిళగా గీత గుర్తింపు పొందింది. హార్వర్డ్‌లోని ఎకనామిక్స్ డిపార్ట్ మెంట్‌లో ఆర్థికవేత్త అమర్త్యసేన్ తర్వాత శాశ్వత సభ్యత్వం పొందిన రెండవ భారతీయురాలు కూడా ఈమెనే. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ద్వారా గీతకు యంగ్ గ్లోబల్ లీడర్ బిరుదు కూడా లభించింది. 2014లో, ఐఎంఎఫ్ జాబితా చేసిన 45 ఏళ్లలోపు టాప్ 25 ఆర్థికవేత్తలలో కూడా గీత ఒకరు. ఆమెకు ప్రవాసీ భారతీయ సమ్మాన్ కూడా లభించింది.



### అరుణా రెడ్డి

జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్‌లో పతకం సాధించిన మొదటి భారతీయ జిమ్నాస్ట్‌గా అరుణా రెడ్డి నిలిచారు. క్రీడాకారుల వెనుక ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమైన కథలు ఉంటాయి. 2018లో జరిగిన ప్రపంచ కప్‌లో మహిళల వాల్ట్‌లో కాంస్య పతకాన్ని సాధించి చరిత్ర సృష్టించింది. ఈ అవార్డును సంపాదించేందుకు ఆమె 13 ఏళ్లకు పైగా శిక్షణ తీసుకుంది. హైదరాబాద్‌కు చెందిన ఈ జిమ్నాస్ట్‌కి కరాటేలో బ్లాక్ బెల్ట్ కూడా ఉంది.



# చల్లచల్లని బాదం మిల్క్

## వేసవిలో తాగితే ఆ రుచే వేరు

వేసవిలో ఎక్కువగా ద్రవపదార్థాలు తాగాలనిపిస్తుంది. ఎండ వేడిమి మీరు తట్టుకోవాలంటే శరీరానికి అందించాల్సింది ఎక్కువగా ద్రవ ఆహారాలే. ఒకసారి చల్లచల్లగా బాదం మిల్క్ తాగి చూడండి, చాలా టేస్టీగా ఉంటుంది. బాదం మిల్క్ అనగానే బాదం పొడి బయట నుంచి కొనుక్కొచ్చి పాలల్లో కలిపి వేసుకొని తాగేది కాదు. ఇంట్లోనే టేస్టీగా దీన్ని తయారు చేయొచ్చు. ఇది చాలా బాగుంటుంది. పిల్లలకు నచ్చుతుంది. సాయంత్రం వేళ స్కూల్ నుంచి వచ్చిన పిల్లలకు ఒక గ్లాసు బాదం మిల్క్‌ను అందిస్తే... శరీరానికి శక్తి వెంటనే అందుతుంది. పెద్దలకు కూడా ఇది బెస్ట్ రెసిపీ అని చెప్పవచ్చు. వేసవిలో కచ్చితంగా తాగాల్సిన పానీయాల్లో బాదం మిల్క్ ఒకటి. ఈ బాదంపాలు ఇంట్లోనే టేస్టీగా ఎలా చేయాలో ఇప్పుడు చూద్దాం.

బాదం పాలు రెసిపీకి కావలసిన పదార్థాలు
బాదం పప్పులు - ఒక కప్పు
జీడిపప్పు - ఒక కప్పు
పంచదార - 100 గ్రాములు
యాలకుల పొడి - అర స్పూను
పాలు - అర లీటరు

**బాదం పాలు రెసిపీ**

బాదంపప్పు, జీడిపప్పును మిక్సీలో వేసి మెత్తటి పొడి చేసుకోవాలి. వెన్న తీయని పాలను గిన్నెలో వేసి మరగ కాచాలి. అందులో యాలకుల పొడిని కూడా వేయాలి. ఆ పాలల్లో పంచదారని వేసి బాగా కలుపుకోవాలి. ముందుగా మిక్సీలో చేసి పెట్టుకున్న బాదం, జీడిపప్పు పొడిని ఈ పాలల్లో వేసి చిన్న మంట మీద పది నిమిషాల పాటు మరగనివ్వాలి. ఇప్పుడు స్టవ్ కట్టేసి వాటిని చల్లారనివ్వాలి. ఈ బాదం మిల్క్‌ను గ్లాసుల్లో వేసి పైన సన్నగా తరిగిన బాదం, జీడిపప్పులను వేసి ఫ్రిజ్లో పెట్టాలి. అవి బాగా చల్లగా అయ్యాక తాగి చూడండి. రుచి మామూలుగా ఉండదు. పిల్లలకు ఇది కచ్చితంగా నచ్చుతుంది. బయటకొనే బాదం పొడులు కన్నా దీని టేస్ట్ బాగుంటుంది.


ఈ రెసిపీలో మనం బాదం, జీడిపప్పు వంటి ఆరోగ్యకరమైన ఆహారాలను వాడాము. అలాగే పంచదారను చాలా తక్కువగా వాడాము. బాదం, జీడిపప్పులు మన శరీరానికి కావాల్సిన ఆరోగ్యకరమైన కొవ్వులను అందిస్తాయి. అలాగే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. బరువు తగ్గడానికి కూడా ఇవి సహాయం చేస్తాయి. ఎన్నో పోషకాలను శరీరానికి అందిస్తాయి. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారు వీటిని తింటే రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. మెదడు ఆరోగ్యంగా ఉండేందుకు బాదంపప్పు ఎంతో మేలు చేస్తుంది. ఇక పాలు చేసే మేలు అంతా ఇంతా కాదు. ఇది శరీరానికి కాల్షియాన్ని అందిస్తుంది. అలాగే పిల్లలకు శక్తిని అందించి వారు ఏకాగ్రతగా చదివేలా చేస్తుంది. బాదం, జీడిపప్పు, పాలు ఈ మూడు కూడా పిల్లలకు అత్యవసరమైనవి. వేసవిలో పకోడీలు, పునుకులు వంటివి సాయంత్రం పూట స్నాక్స్‌గా ఇచ్చే కన్నా ఇలాంటి బాదం పాలు ఇవ్వడం వల్ల వారు మరింత శక్తివంతంగా మారతారు.

- స్వరణి, ఆర్మూర్

# కరువు కోరల్లో బయ్యారం

- పాకాల వాగును నమ్ముకుని వరి పంట వేసుకున్న రైతులు
- యాసంగి సాగుకు నీటి ఎద్దడి తో రైతు కంట కన్నీరు!!
- ఏటిలో నీరు అడుగంటగా.. నట్టేట్లో కరెంటు మోటార్లు
- గతేడాది మే నెలాకరులోనూ సమృద్ధిగా ఏట్లో నీరు : రైతులు
- ఎండుతున్న పంటను చూసి ఆందోళనలో రైతన్న






**బయ్యారం, మార్చి 12 (జనంసాక్షి) :**
'అటు ఏరు ఇటు ఏరు మధ్యల మా ఊరు' అంటూ అందమైన బయ్యారం గురించి గానమాలపించారు బయ్యారం కవి,గాయకుడు బిక్షపతి. చుట్టూ నీరు మధ్యలో మా ఊరు అనే రీతిలో ఉంటుంది బయ్యారం. ఎక్కడెక్కడో కరువు తాండవించిన సమయంలోనూ బయ్యారంలో కరువు సమస్య ఉండేది కాదంటే అతిశయోక్తి కాదు. చుట్టూ పచ్చనికొండలు, తలాపున పెద్ద చెరువు, తూర్పున అలిగేరు,పడమర పాకలేరు నీటి పారుదలతో పచ్చని పైర్లు పండే చోట వాగుల్లో నీరులేక నెర్రెలుబాసిన మడికట్లు,ఎండుతున్న వరి పంటలే దర్శనమిస్తున్నాయి.పాకాల వాగు కింద వందల ఎకరాల సాగు బయ్యారంలో ఉండగా ఇప్పుడు ఎండిన ఏటితో వందల ఎకరాల సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఎక్కడికక్కడ చెక్ డ్యామ్‌ల ఏర్పాటుతో ఎగువ ప్రాంతాల్లోనే నీరు నిల్వ ఉంటుందే తప్ప బయ్యారం శివారులోని పంటలకు మాత్రం నీరందడం లేదు.గడిచిన పదేళ్లలో 2023లోనే అత్యధిక వర్షపాతం నమోదైందని ఘనాంకాలలో ఉన్నా గతేడాది వర్షాలు తక్కువగా కురిసినందుకు కరువొచ్చే పరిస్థితి ఉందని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి ఇప్పటికే అధికారులకు, రైతులకు ఓ ప్రకటనలో తెలిపారు. పాకాల ఏటినే నమ్ముకున్న రైతు నీరు విడుదల చేస్తే పంట తడుపుకుంటామని, నెర్రెలు భారిన నేలను చూసి ఆందోళన చెందుతున్నారు. నిండుకుండలా పాకాల చెరువులో నీరున్నప్పటికీ ఇరిగేషన్ అధికారులు నీటిని ఎందుకు విడుదల చేయట్లేదో అర్థం కాని పరిస్థితి.ఇక ఎలాగో అధికారులు నీటిని విడుదల చేయట్లేదని కళ్ళ ముందే ఎండుతున్న పంటను చూస్తూ ఉండలేని రైతు ఏటిలోని గుంతల్లో ఆగి ఉన్న నీటిని కరెంటు మోటార్లతో వందల మీటర్లనుండి పైపుల సాయంతో నీరు కడుతున్న పరిస్థితి.ఇంత చేసినా మరో తడికి పంటకు సరిపడా నీరు లేక పోవడంతో నష్టం వాటిల్లే ప్రమాదముంది. గతేడాది మే నెలాకరు దాక ఏట్లో నీరుండేదని,అదే నమ్మకంతో ఈ ఏడు కూడా నీటికి కొదవుండద నుకున్న రైతుకు కన్నీరే మిగిలిందని రైతులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో నీరు నిలవాలంటే సమీపంలో చెక్ డ్యామ్ ఏర్పాటు చేయాలని, అలా అయితేనే రెండు పంటలకు నీరందుతుందని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారో లేదో వేచి చూడాలి.

# మహిళలకు ఉపాధి అవకాశాల కోసం ఎల్లపుడూ ఏఎస్‌జిఎంకే ట్రస్ట్ సిద్ధం

## ఏఎస్‌జిఎం కే ట్రస్ట్ చైర్మన్ మొహమ్మద్ ముజీబ్ ఖాన్



**వికారాబాద్ రూరల్ మార్చి 12 (జనంసాక్షి) :**
కుల మతాలకు అతీతంగా నిరుపేద మహిళలకు ఉపాధి అవకాశాల కోసం ఎల్లప్పుడూ మా ట్రస్టు ద్వారా సహాయం అందజేస్తామని ఏ ఎస్ జిఎంకే ట్రస్ట్ చైర్మన్ మొహమ్మద్ ముజీబ్ ఖాన్ పేర్కొన్నారు మంగళవారం వికారాబాద్ జిల్లాలోని తాండూరు మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మెషీన్ ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఏ.ఎస్ జీ.ఎం.కే చారిటబుల్ ట్రస్ట్ తరఫున 20 మహిళలకు ఉచితంగా కుట్టు మెషీన్ లను ఏ.ఎస్ జీ.ఎం.కే చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ మొహమ్మద్ ముజీబ్ ఖాన్ పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఏ.ఎస్ జీ.ఎం.కే చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ మొహమ్మద్ ముజీబ్ ఖాన్ మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం స్వయం ఉపాధి దిశగా సాగాలనే ఉద్దేశ్యంలో భాగంగా మహిళా సాధికారతను ప్రోత్సహించడం కోసం ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని భవిష్యత్ లో మరెన్నో అభివృద్ధి సేవ కార్యక్రమాలు చేస్తామని ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీత మహేందర్ రెడ్డి, ఏ.ఎస్ జీ.ఎం.కే చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కలీం ముసైబ్ మరియు ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా గ్రాండ్‌క్వీన్స్ లీడర్‌షిప్ అవార్డ్స్ 2024

- 48 మంది మహిళలకు సత్కారం



**హైదరాబాద్, మార్చి 12 (జనంసాక్షి ):**
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ యువ, జిల్లా 320ఏ ప్రతిష్టాత్మకమైన 'గ్రాండ్‌క్వీన్స్ లీడర్‌షిప్ అవార్డ్స్ 2024' వేడుకలను గచ్చిబౌలిలోని క్లబ్ బొటానికాలో మంగళవారం నిర్వహించింది. ఇది ఐదో సీజన్. ఈ ఈవెంట్‌ను సెలబ్రేషన్ మేకర్స్ ఆర్గనైజ్ చేశారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ మద్దతు ఇచ్చింది. ఈ వేడుకలలో నలభై ఎనిమిది మంది మహిళలను సత్కరించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా డాక్టర్ మీర్ నవాబ్ నాసిర్ అలీ ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అవార్డుల కన్వీనర్, వ్యవస్థాపకుడు డాక్టర్ సౌరభ్ సురేఖ, సహ వ్యవస్థాపకురాలు రూపా సురేఖ మాట్లాడుతూ గ్రాండ్‌క్వీన్స్ క్లబ్ ఈ కాన్సెప్ట్‌పై ఏడు సంవత్సరాలుగా పని చేస్తున్నట్లు తెలిపారు. మహిళా అచీవర్స్, లీడర్స్ తో అద్భుతమైన సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ అవార్డుల కోసం 108 రంగాల నుంచి నామినేషన్లు ఆహ్వానించామని చెప్పారు. ఇది 5వ సంవత్సరంలో ఉందన్నారు. ఈ అవార్డులు 2020లో హైదరాబాద్‌లో ప్రారంభమయ్యాయని తెలిపారు. అప్పటి నుంచి భారతదేశం మొత్తం పర్యటిస్తోందన్నారు. గ్రాండ్ క్వీన్స్ కోల్‌కతా, భువనేశ్వర్, పాట్నా, అజ్మీర్ ఎడిషన్‌లు ఈ నెలలోనే జరగనున్నాయన్నారు. ఈ అవార్డు బంగ్లాదేశ్, యూఏఈ, యూఎస్‌ఏ, సింగపూర్, బెల్జియం తదితర దేశాల నుంచి విజేతలను కలిగి ఉందన్నారు. గ్రాండ్‌క్వీన్స్ క్లబ్ అనేది వర్కింగ్ ఉమెన్ ఫోరమ్ అన్నారు. వివిధ రంగాలు, వివిధ వయో సమూహంతో కూడిన నెట్వర్క్ అన్నారు. ఒకరికొకరు సహకరించుకోవడం, వృద్ధి చెందడం లక్ష్యమన్నారు. గ్రాండ్ క్వీన్స్ మధ్య సహకారాన్ని పెంచడానికి గ్రాండ్ క్వీన్స్ కాన్‌ఫ్లూయెన్స్, గ్రాండ్ క్వీన్స్ టాలెంట్ వాక్, గ్రాండ్ హెూమ్ చెఫ్ ఇండియా తదితర కార్యక్రమాలను ప్రవేశపెట్టారన్నారు.

## మా భూములు లాక్కుంటే
# ఉద్యమ బాట పడతాం : కోమరంభీం వాసులు

- కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి : జిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి దొర



**నూగూర్ వెంకటాపురం మార్చి 12(జనంసాక్షి ):**
ఆదివాసీలు జల్,జంగిల్, జమీన్ నినాదంతో పోరాటం చేసి, ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న అటవీ హక్కుల చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు అధికారులు కుట్ర చేయడం శోచనీయం.బెస్తగూడెం పరిధిలో,కొమరం భీం కాలనీ ఆదివాసీ పోడు రైతుల సాగును అధికారులు పలుమార్లు అడ్డుకోవడంతో మంగళవారం నాడు గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి దొర క్షేత్రస్థాయిలో సందర్శించారు.అనంతరం కొమరం భీం కాలనీ ఆదివాసీ పోడు రైతులతో మాట్లాడుతూ, తెలంగాణ గత ప్రభుత్వం ఆదివాసీల కు పోడు హక్కు పత్రాలు పూర్తి స్థాయిలో అందరికీ అందేలా చర్యలు తీసుకుంటామని మభ్య మభ్యపెట్టి రెండుసార్లు అధికారంలోకి వచ్చిందని అన్నారు.మరల మూడోసారి అధికారంలోకి వచ్చే ప్రయత్నాలు చేసిన ఆ ప్రయత్నాలను ఆదివాసి పోడు రైతులు తిప్పికొట్టారని తెలియజేశారు.ఆదివాసీల ను అక్రమార్కులు ,అడవి విధ్వంసకారకులు అని అధికారులు చిత్రీకరించడం సరికాదని ఆయన అన్నారు.ఆదివాసీల హక్కులను అడ్డుకునే అధికారం అధికారులకు లేదన్నారు.వెంకటాపురం ఆదివాసీలు ఎన్నో ఏళ్లుగా పోడు సాగు చేసుకుంటున్న భూములను, అటవీ భూములు అని ఆదివాసీలను భయపెట్టించి ,ఇదే భూమిపై గిరిజనేతరుల పెత్తనం ఏమిటని,ఆదివాసీ మహిళాల పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ధాడులకి పాల్పడం ఏమిటని ప్రశ్నించారు.గతంలో ఆదివాసీ మహిళలపై బెస్తగూడెం గ్రామానికి చెందిన గిరిజనేతరులు దాడులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకుండా అధికారులు నిమ్మకు నేరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. వెంకటాపురం పట్టణ ప్రాంతంలో అనేక ప్రభుత్వ భూములు గిరిజనేతరుల చేతిలోకి వెళ్తున్న వాటిపై చర్యలు తీసుకోరు కానీ ఆదివాసులు తమ కష్టంతో చెమటోడ్చి పోడుభూమిపై ఎందుకు ఇంత వివక్ష చూపుతున్నారని ఆయన అవేదన వ్యక్తం చేశారు.ఇప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ అదే హామీతో అధికారంలోకి వచ్చిందని ఆ హామీలను వెంటనే నెరవేర్చుకోవాలని అన్నారు.ఈ ప్రభుత్వానికి ఆదివాసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఆదివాసీలకు పోడు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసులు అక్రమార్కులు కాదని 5 వ షెడ్యూల్డ్ భూభాగంలోకి వలస వచ్చిన గిరిజనేతరులు అసలైన అక్రమార్కులు అని ఆయన ప్రభుత్వానికి గుర్తు చేశారు. ప్రభుత్వ భూములను అక్రమంగా వన్.ఆఫ్ చట్ట విరుద్ధంగా సాగు చేసుకుంటున్న వలస గిరిజనేతరులు నిజమైన అక్రమార్కులు అన్నారు. ఆదివాసీల హక్కులను కాలరాస్తున్న గిరిజనేతరుల కబ్జాలో వందలాది ఎకరాలు భూమి మూలుగు తోందన్నారు.భూములు అక్రమంగా సాగు చేసుకుంటున్న గిరిజనేతరుల పైన ఎటువంటి కేసులు ఎందుకు పెట్టడం లేదన్నారు. మా భూముల ను లాక్కోవలని చూస్తే అధికారుల పైన ఉద్యమిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లాప్రధాన కార్యదర్శి కణితి వెంకటకృష్ణ,జిల్లా వర్కింగ్ పూనెం ప్రతాప్, కొమరం భీం కాలనీ ఆదివాసీలు పాల్గొన్నారు.

## విపణి




### యూపీఐ పేమెంట్స్ బ్యాంక్‌లో ఈ సేవలకు

# మరికొన్ని రోజులే గడువు

పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విధించిన ఆంక్షలు మార్చి 15 నుంచి అమల్లోకి రానున్నాయి.దీంతో కొన్నిరకాల సేవలు నిలిచిపోనున్నాయి. ఈ గడువును పొడిగించే ఉద్దేశమేదీ లేదని ఇప్పటికే ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు. ఒకవేళ మీరు ఇప్పటికీ పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ సేవలను వినియోగిస్తుంటే.. గడువు ముగియనున్న వేళ త్వరపడాల్సిందే. ఇంతకీ ఏయే సేవలు నిలిచిపోనున్నాయ్? ఏవి కొనసాగుతాయ్?

ప్రభావితమయ్యే సేవలు ఇవే..

మార్చి 15 తర్వాత పేటీఎం పేమెంట్స్ బ్యాంకు ఖాతాలో గానీ, వాలెట్‌లో గానీ నగదును జమ/లోడ్ చేయలేరు. క్యాష్‌బ్యాక్‌లు, రిఫండ్లు కాకుండా ఇతరుల నుంచి నగదును కూడా అందుకోలేరు. ఒకవేళ ఎవరైనా శాలరీ కోసం పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఖాతా ఇచ్చి ఉంటే.. మార్చి 15 తర్వాత జమ చేయడం వీలుపడదు. కాబట్టి గడువులోగా మీ యజమానికి కొత్త బ్యాంక్ ఖాతా ఇవ్వడం మంచిది. ఎల్పీజీ సబ్సిడీ లేదా ఇతర ప్రత్యక్ష నగదు బదిలీ పథకాలకు పేటీఎం పేమెంట్స్ ఖాతాను ఇచ్చి ఉంటే వెంటనే మార్చుకోండి. మార్చి 15 తర్వాత రాయితీలు, నగదు బదిలీలు అందుకోవడం వీలు పడదు. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌లో ఒకవేళ ఏదైనా నగదు ఉంటే మార్చి 15 తర్వాత కూడా విత్ డ్రా లేదా ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చు. డెబిట్ కార్డును కూడా వినియోగించుకోవచ్చు. రిఫండ్లు, క్యాష్‌బ్యాక్‌లు, పార్టనర్ బ్యాంకుల నుంచి స్వీప్-ఇన్ సేవలు, వడ్డీ మొత్తాలు మార్చి 15 తర్వాత కూడా అనుమతిస్తారు. మీ పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఖాతా ఆటో డెబిట్‌కు లింక్ అయ్యి ఉంటే అందులో ఉన్న బ్యాలెన్స్ పూర్తయ్యేవరకు వినియోగించుకోవచ్చు. మార్చి 15 తర్వాత కొత్తగా డిపాజిట్లు మాత్రం అనుమతించరు. కాబట్టి ప్రత్యామ్నాయం చూసుకోవాల్సిందే.ఓటీటీ సబ్‌స్క్రిప్షన్‌కూ ఇదే నియమం వర్తిస్తుంది. బ్యాలెన్స్ ఉన్నంతవరకు మాత్రమే ఆటో డెబిట్‌కు అనుమతిస్తారు. మార్చి 15 తర్వాత కొత్తగా లోడ్ చేయడం కుదరదు కాబట్టి ఆటో డెబిట్‌లు నిలిచిపోయే ప్రమాదం ఉంది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ వాలెట్‌లో ఒకవేళ నగదు ఉంటే దాన్ని వినియోగించుకోవచ్చు.

# ఉత్తమ వ్యక్తిగత ఆర్థిక జీవనం ముఖ్యం



ఆర్థిక ప్రణాళిక అనేది జీవిత లక్ష్యాలను క్రమపద్ధతిలో, ప్రణాళికాబద్ధంగా సాధించడానికి ఉపయోగపడే ప్రక్రియ. ఆర్థిక వనరులను సాధ్యమైనంత ఉత్తమంగా ఉపయోగించుకోవడం ఇందులో ఒక ముఖ్య భాగం.ముఖ్యంగా యువకులలో ఆర్థిక ప్రణాళికను అలవాటు చేయడం చాలా కష్టమైన పని. అయినప్పటికీ, వారు తమ ఆర్థిక విషయాల గురించి స్వచ్ఛందంగా ప్లాన్ చేసినప్పుడు ఎక్కడ, ఎలా ప్రారంభించాలో చాలా మందికి తెలియదు. ఇక్కడ ఆర్థిక ప్రణాళికను బాగా ప్లాన్ చేసుకోవడానికి కొన్ని సూత్రాలు ఉన్నాయి. అవేంటో చూడండి.ఒకరు తమ డబ్బును సరిగ్గా ప్లాన్ చేసి నిర్వహించడానికి గొప్ప ఆర్థిక నేపథ్యం నుంచి రావలసిన అవసరం లేదు. కొంచెం నిబద్ధత చూపిస్తే సరిపోతుంది. పొదుపు చేయాలని నిర్ణయించుకోవడం డబ్బు నిర్వహణలో మొదటి అడుగు. మెరుగైన ఆర్థిక స్వాతంత్రం కోసం డబ్బు ఆదా చేయడం ఎవరికైనా చాలా ముఖ్యం. అత్యవసర పరిస్థితిలో అప్పు కూడా దొరకని పరిస్థితిని ఊహించుకోండి. డబ్బు పొదుపు అవసరం ఏంటో మీకే తెలుస్తుంది. మీకు స్మార్ట్ ఫోన్, వాహన కొనుగోలు లాంటి కొన్ని కనీస అవసరాలు ఉండొచ్చు. ఇలాంటి పరిస్థితులన్నింటిలో మీకు డబ్బు అవసరం. కానీ అది ఎక్కడ నుంచి వస్తుంది? వీటన్నింటికి సరైన సమాధానం పొదుపు. డబ్బును ఆదా చేయడం వల్ల రుణాల ఉచ్చులో పడకుండా ఉంటారు. అంతేకాకుండా క్రమం తప్పని పొదుపు మిమ్మల్ని ధనవంతుల్ని చేస్తుంది. దీనివల్ల మీ ఆర్థిక లక్ష్యాలను సకాలంలో సాధించవచ్చు. యువకుడిగా ఉన్నప్పుడు మీ పొదుపును ప్రతి నెలా సిప్ ద్వారా మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయొచ్చు.జీతం మీద జీవించే వారి ఖర్చులు వారి శక్తికి మించే ఉంటాయి. ముఖ్యంగా అనుకోని ఖర్చులు చాలా మందిని ఇబ్బందులకు గురిచేస్తాయి. అందువల్ల ప్రతి ఒక్కరూ బడ్జెట్ సిద్ధం చేయడానికి ప్రయత్నించండి. తగిన బడ్జెట్‌ను సిద్ధం చేసుకోకపోతే మీ నగదు ప్రవాహాలను నియంత్రించలేరు. బడ్జెట్.. మీకు ఎంత డబ్బు వస్తోంది? ఆ నిధులు ఎలా ఖర్చు చేయాలో చూపిస్తుంది. మీ ఖర్చులను వర్గీకరించండి. అత్యవసర అవసరాలు, లగ్జరీ, నివారించదగినవి.. ఈ విధంగా ఖర్చుల పూర్తి జాబితాను తయారు చేసుకోండి. దీనివల్ల దేనికి ముందుగా ఖర్చు పెట్టాలో తెలుస్తుంది. పరిమిత వనరులు, అపరిమిత కోరికలు చాలా మందికి ఉంటాయి. కానీ మీరు మీ వనరులను సరిగ్గా నిర్వహించాలి. ఈ వాస్తవాన్ని ఎంత త్వరగా తెలుసుకుంటే నివారించదగిన ఖర్చుల పట్ల మీరు అంత మెరుగ్గా నియంత్రించుకోగలుగుతారు. సరిగ్గా ప్లాన్ చేస్తే కొంత డబ్బును వినోదం, విశ్రాంతి కోసం కేటాయించొచ్చు.

ప్రతి ఏడాది మీ ఆస్తులు, రుణాల జాబితాను తయారుచేయండి. బ్యాంక్ బ్యాలెన్స్, పెట్టుబడులు, ఇంటి విలువ, ఇతర ఆస్తుల విలువను లెక్క కట్టండి. కారు రుణం, ఇంటి రుణం, క్రెడిట్ కార్డు బ్యాలెన్స్‌లతో పాటు ఇతర రుణాల జాబితాను తయారు చేయండి. ఈ వ్యక్తిగత బ్యాలెన్స్ షీట్ ఆర్థికపరంగా మీ నికర విలువను చూపుతుంది. మీ ఆర్థిక స్థితిని తదుపరి స్థాయికి తీసుకెళ్లడానికి ఇది చాలా ఉపయోగపడుతుంది.మీ దగ్గర ఉన్న మిగులు నగదుతో ఎలా వ్యవహరిస్తారనేది మీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. మీ వద్ద ఉన్న నగదును సరైన చోట పెట్టుబడి పెట్టకపోతే ద్రవ్యోల్బణం కారణంగా దాని విలువ క్షీణించే అవకాశం ఉంది.

| నెక్ గుడ్ల ధరలు | ఒకటి | వంద |
| --- | --- | --- |
| హైదరాబాద్ | ₹ 4.10 | ₹ 410 |
| వరంగల్ | ₹ 4.12 | ₹ 412 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)

హైదరాబాద్

₹60,740 (22 క్యారెట్లు) | ₹66,260 (24 క్యారెట్లు)

చెన్నై

₹61,490 (22 క్యారెట్లు) | ₹67,090 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**

హైదరాబాద్

₹79,500

## హైస్పీడ్ విద్యుత్తు కార్లు

### షావోమీ నుంచి డెలివరీలు ఈ నెల నుంచి మొదలు



చైనాకు చెందిన టెక్ దిగ్గజం షావోమీ విద్యుత్తు వాహనాల రంగంలోకి అడుగుపెట్టింది. తొలి కారు స్పీడ్ అల్ట్రా (ఎస్‌యూ)7 డెలివరీలను ఈనెల నుంచి మొదలుపెట్టనున్నట్లు మంగళవారం ప్రకటించింది.దీని ధరను మార్చి 28వ తేదీన ప్రకటించవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం కారు విక్రయాల కోసం చైనాలోనే 29 చోట్ల 59 స్టోర్లను సిద్ధం చేసినట్లు సంస్థ పేర్కొంది.ఎస్‌యూ7ను గతేడాది ఆవిష్కరించింది. ప్రపంచంలోనే తొలి ఐదు అతిపెద్ద కార్ల తయారీ కంపెనీల్లో ఒకటిగా నిలవాలన్నదే తమ లక్ష్యమని షావోమీ సీఈవో లీ జున్ తెలిపారు. రానున్న పదేళ్లలో కార్ల విభాగంలో 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించారు. ఎస్‌యూ7లో సూపర్ ఎలక్ట్రిక్ మోటార్ టెక్నాలజీని వినియోగించామని చెప్పారు. ఫలితంగా టెస్లా, పోర్షె ఈవీలు చురుగ్గా వేగాన్ని అందుకొంటుందన్నారు. ఎస్‌యూ7, ఎస్‌యూ7 మ్యాక్స్ పేరిట రెండు వేరియంట్లలో లభించనుంది. ఎస్‌యూ 7 విషయానికి వస్తే.. 0-100 కి.మీ. వేగాన్ని 5.28 సెకన్లలో అందుకుంటుందని కంపెనీ చెబుతోంది. అలాగే ఒక్కసారి ఛార్జ్ చేస్తే 668 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. అత్యధికంగా గంటకు 210 కి.మీ. వేగం అందుకోగలదు. ఇక ఎస్‌యూ7 మ్యాక్స్ 2.78 సెకన్లలో 100 కి.మీ. వేగాన్ని అందుకుంటుంది. ఒకసారి ఛార్జింగ్‌తో 800 కి.మీ. ప్రయాణిస్తుంది. గంటకు 265 కిలోమీటర్లు దీని టాప్‌స్పీడ్.షావోమి వాహనాల్లో కూడా ఫోన్లు, ఇతర పరికరాల్లో వినియోగించే ఆపరేటింగ్ సిస్టమ్‌నే వాడింది. ఇక దీనిని బీజింగ్‌లోని ప్రభుత్వ రంగానికి చెందిన బీఏఐసీ గ్రూప్ తయారీ ప్లాంట్‌లో నిర్మిస్తోంది.

# గ్యాంగ్‌స్టర్ల పెళ్లి..


## హైలెవెన్ భద్రత

**దిల్లీ(జనంసాక్షి):** కట్టుదిట్టమైన భద్రత మధ్య గ్యాంగ్‌స్టర్ల జంట వివాహం చేసుకుంది. హరియాణాకు చెందిన సందీప్ అలియాస్ కాలా జథేడీ రాజస్థాన్‌కు చెందిన అనురాధా చౌధరి అలియాస్ మేడమ్ మింజ్ పెళ్లి.. దిల్లీలోని ఒక బాంక్వెట్ హాల్‌లో జరిగింది. అందరి దృష్టిని ఆకర్షించిన ఈ వేడుక దృశ్యాలు తాజాగా వైరల్ అవుతున్నాయి.దిల్లీలోని ద్వారకా సెక్టార్-3లో ఉన్న సంతోష్‌గార్డెన్‌లో ఈ వేడుక జరగ్గా.. ఆ పరిసర ప్రాంతమంతా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. సందీప్ గతంలో ఓసారి హరియాణా పోలీసుల నుంచి తప్పించుకోవడంతో పాటు బలగాలపై దాడి చేయించాడు. దీంతో మరోసారి అటువంటి ఘటనలకు ఆస్కారం ఇవ్వకుండా పోలీసులు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేశారు. హోటల్ ప్రవేశమార్గాల్లో మెటల్ డిటెక్టర్లు మొదలు.. లోనికి వచ్చే వారికి బార్‌కోడ్ బ్యాండ్లు, వాహనాలకు ప్రవేశ పాసులు మంజూరు వంటి చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలు, డ్రోన్లతో అక్కడి కార్యకలాపాలను పర్యవేక్షించారు. 250 మందికి పైగా దిల్లీ పోలీసుల పహారా మధ్య వారి పెళ్లి జరిగింది. అతడి తరఫు న్యాయవాది రూ.51వేలు చెల్లించి ఈ వేదికను బుక్ చేశాడు.అనురాధ అలియాస్ మేడమ్ మింజ్ అలియాస్ రివాల్వర్ రాణి, సందీప్ నాలుగేళ్లుగా ప్రేమలో ఉన్నారు. వారిద్దరూ పలు కేసుల్లో నిందితులు. సందీప్.. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌కు సందీప్ అత్యంత సన్నిహితుడు. అతడిపై దోపిడీ, హత్య, హత్యాయత్నం వంటి డజనుకు పైగా కేసులున్నాయి. అనురాధ..గ్యాంగ్‌స్టర్ ఆనంద్‌పాల్ సింగ్ (2017లో పోలీసు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు) వద్ద పని చేసింది. మనీ లాండరింగ్, కిడ్నాప్, బెదిరింపులు వంటి పలు కేసుల్ని ఎదుర్కొంటోంది. 2020లో పరారైన వీరు పోలీసుల్ని తప్పించుకొని పలు రాష్ట్రాలకు మకాం మార్చారు. చివరకు 2021 జులైలో పోలీసులకు చిక్కారు. కొంతకాలం తర్వాత ఆమె బెయిల్‌పై బయటకు వచ్చింది. ఈ పెళ్లి కోసం కోర్టు అతడికి ఆరు గంటలపాటు పెరోల్ ఇచ్చిన సంగతి తెలిసిందే.



# 'మిషన్ దివ్యాస్త్ర' పరీక్షవేళ..

## బంగాళాఖాతంలోనే తిష్టవేసిన డ్రాగన్ నిఘా నౌక..!



శత్రురాడార్లు.. గగనతల రక్షణ వ్యవస్థలకు దుర్భేద్యమైన 'మిషన్ దివ్యాస్త్ర' పరీక్షను చైనా అత్యంత జాగ్రత్తగా పరిశీలించింది.దీనిలో భారత్ ఒక క్షిపణితో బహుళ లక్ష్యాలను ఛేదించే ఎంఐఆర్‌వీ (మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీఎంట్రీ వెహికల్) టెక్నాలజీని తొలిసారి సోమవారం పరీక్షించిన విషయం తెలిసిందే. దీనికి కొన్ని వారాల ముందే బీజింగ్ నుంచి బంగాళాఖాతం దిశగా చైనా పరిశోధక నౌక బయల్దేరింది. ఇప్పటికే మరో నిఘా ఓడ భారత్‌కు పశ్చిమాన మాల్దీవుల్లో తిష్ఠ వేసిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 23వ తేదీన క్వాంగ్‌డావ్ నుంచి 'షియాంగ్ యంగ్ హాంగ్ 01' నౌక బయల్దేరింది. ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ నిపుణుడు డామియన్ సైమన్ లెక్కల ప్రకారం 4,425 టన్నుల బరువున్న ఈ ఓడ ఆదివారం బంగాళాఖాతంలోకి ప్రవేశించింది. ఈ విషయాన్ని తన సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో వెల్లడించారు. ప్రస్తుతం అది భారత్ అణుశక్తి చోదిత సబ్‌మెరైన్ స్థావరమైన విశాఖ తీరం నుంచి 480 కిలోమీటర్ల దూరంలో ఉంది. సాధారణంగా క్షిపణి పరీక్షలకు ముందు హెచ్చరిక సూచీ అయిన 'నోటీస్ టు ఎయిర్‌మిషన్'(నోటామ్)ను భారత్ మార్చి 7వ తేదీన జారీ చేసింది. దీంతో బంగాళాఖాతంలో 3,550 కిమీ రేంజిలో నౌకలు, విమానాల కార్యకలాపాలను నియంత్రించినట్లైంది. ఈ తేదీల్లోనే డ్రాగన్‌కు చెందిన 'షియాంగ్ యంగ్ హాంగ్ 01' బంగాళాఖాతంలోకి వచ్చింది. దీనిలో అగ్ని-5 పరీక్షను పూర్తిగా గమనించి రేంజి, సామర్థ్యాన్ని అంచనావేసుకొనే టెక్నాలజీ ఉందనే అంచనాలున్నాయి. కానీ, చైనా మాత్రం ఇది కేవలం పరిశోధక నౌకే అని బుకాయిస్తోంది. భారత్ సహా పశ్చిమ దేశాలు మాత్రం ఈ ఓడలు ప్రత్యర్థి నౌకాదళ, సబ్‌మెరైన్ కదలికలను గుర్తించగలవని చెబుతున్నాయి.కొంత మంది చైనా నిపుణులు అగ్ని-5 రేంజి 5,000 కిలోమీటర్ల కంటే అధికమని బలంగా నమ్ముతున్నారు. 2012లో పీఎల్‌ఏ అకాడమీ ఆఫ్ మిలటరీ సైన్సెస్ నిపుణుడు డువెన్లాంగ్ ఈ క్షిపణి రేంజి దాదాపు 8,000 కిలో మీటర్ల వరకు ఉంటుందని ఓ పత్రికకు రాసిన వ్యాసంలో పేర్కొన్నాడు.భారత్ అగ్ని శ్రేణి క్షిపణి పరీక్ష తలపెట్టినప్పుడల్లా చైనా నౌకలు హిందూ మహాసముద్రంలోకి చొరబడటం ఇదే తొలిసారి కాదు. 2022 నవంబర్‌లో కూడా ఆ దేశానికి

# 'టిక్‌టాక్' పాలిటిక్స్..

ఎన్నికల వేళ అమెరికాలో యాప్ బ్యాన్‌పై ట్రంప్ బిగ్ ట్విస్ట్

వాషింగ్టన్: అధ్యక్ష ఎన్నికల వేళ అమెరికాలో టిక్‌టాక్ షార్ట్ వీడియో యాప్‌పై చర్యలు రాజకీయ రంగు పులుముకుంటున్నాయి. త్వరలో టిక్‌టాక్‌పై అమెరికా ప్రతినిధుల సభ పాస్ చేయనున్న నిషేధం బిల్లుపై రిపబ్లికన్ పార్టీ తరపున అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తాజాగా అభ్యంతరం వ్యక్తం చేశారు.టిక్‌టాక్ లేకపోతే యువత నొచ్చుకుంటుందని అంతేగాక మెటాకు చెందిన ఫేస్‌బుక్ బలోపేతమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఫేస్‌బుక్‌లో నిజాయితీ లేదని, టిక్‌టాక్ నిషేదం వల్ల ఫేస్‌బుక్ లాభపడటం తనకు ఇష్టం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. ఈ యాప్‌ను ప్రస్తుతం అమెరికాలో పెద్ద సంఖ్యలో యువత వాడుతోందని, వారంతా యాప్ లేకపోతే పిచ్చివాళ్లయ్యే అవకాశం ఉందన్నారు. టిక్‌టాక్‌లో మంచితో పాటు చెడు కూడా ఉందన్నారు. 2021లో క్యాపిటల్ భవనంపై దాడి సందర్భంగా ట్రంప్ పెట్టిన పోస్టులను ఫేస్‌బుక్‌తో పాటు ఇన్‌స్టాగ్రామ్ నుంచి మెటా డిలీట్ చేసింది. దీంతో మెటాపై ట్రంప్ ఆగ్రహంతో ఉన్నారు. ట్రంప్‌తో పాటు రిపబ్లికన్లంతా ఫేస్‌బుక్‌ను తీవ్రంగా విమర్శిస్తుంటారు. ట్రంప్ తాజా వ్యాఖ్యల తర్వాత ఫేస్‌బుక్ షేర్లు స్టాక్‌మార్కెట్‌లో నష్టాలు చవిచూశాయి.అయితే 2020లో తాను అధ్యక్షుడిగా ఉన్న సమయంలో చైనాకు చెందిన టిక్‌టాక్‌తో పాటు వి చాట్‌ను నిషేధించడానికి ట్రంప్ ప్రయత్నించడం గమనార్హం. కోర్టులు జోక్యం చేసుకుని ఈ ప్రయత్నానికి బ్రేకులు వేశాయి. ప్రస్తుతం మళ్లీ అధ్యక్ష ఎన్నికలకు పోటీపడుతున్న వేళ ట్రంప్ టిక్‌టాక్ నిషేధంపై మాట మార్చడం వెనుక బలమైన రాజకీయ వ్యూహం ఉందన్న వాదన వినిపిస్తోంది. ఓపక్క యువతను ఆకట్టుకోవడంతో పాటు మరోపక్క తనకు ఇష్టంలేని ఫేస్‌బుక్ చెక్ పెట్టడమే ట్రంప్ లక్ష్యంగా కనిపిస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు.కాగా, అమెరికాలో ప్రస్తుతం 17 కోట్ల మంది టిక్‌టాక్‌ను వాడుతున్నారు. యూఎస్ ప్రతినిధుల సభ బుధవారం(మార్చ్ 13)న టిక్‌టాక్‌పై దాదాపు నిషేధం విధించినంత పనిచేసే ఓ కీలక బిల్లును పాస్ చేయనుంది. ఈ బిల్లు పాసైన 165 రోజుల లోపు చైనాకు చెందిన బైట్‌డ్యాన్స్ కంపెనీ టిక్‌టాక్‌ను అమ్మేయాల్సి అమ్మేయాల్సి ఉంటుంది. లేదంటే గూగుల్, ఆపిల్ ప్లే స్టోర్లు టిక్‌టాక్‌కు వెబ్ హోస్టింగ్ సేవలు నిలిపివేస్తాయి.ఈ బిల్లు గనుక ఏకగ్రీవంగా పాసైతే దీనిపై తాను సంతకం చేస్తానని అధ్యక్షుడు బైడెన్ ఇప్పటికే స్పష్టం చేశారు. మరోపక్క తాము అమెరికన్ల డేటాను చైనాకు గతంలో ఎప్పుడూ షేర్ చేయలేదని, ఇక ముందు కూడా షేర్ చేయబోమని టిక్‌టాక్ యాప్ యాజమాని బైట్‌డ్యాన్స్ కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. యాప్‌పై నిషేధం అమెరికా ప్రజల రాజ్యాంగ హక్కు అయిన భావ ప్రకటన స్వేచ్ఛను హరించడమేనని మండిపడింది.




## జాతీయం అంతర్జాతీయం

జనంసాక్షి

# అలా జరిగితే నా పదవికి రాజీనామా చేస్తా

### అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ



**జనంసాక్షి:**పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) నిబంధనలను కేంద్రం నోటిపై చేయడంతో అస్సాం రాష్ట్రంలో నెలకొన్న ఆందోళనలపై ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ స్పందించారు.ఈ చట్టంతో లక్షల మంది అస్సాంలోకి ప్రవేశిస్తారనే భయాలు ప్రజల్లో నెలకొనడంపై మాట్లాడారు. అవసరమైతే తాను రాజీనామా చేయడానికైనా సిద్ధమేనని ప్రకటించారు. శివసాగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ " నేను అస్సాం పుత్రుడిని. నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్ఆర్‌సీ)కి దరఖాస్తు చేయకుండా ఒక్కరికైనా కొత్త చట్టం కింద పౌరసత్వం లభిస్తే.. మొదట వ్యతిరేకించే వ్యక్తిని నేనే. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తా. ఈ చట్టాన్ని వ్యతిరేకించేవారు చెప్పే వారి మాటలు నిజమా.. కాదా అనే విషయం పోర్టల్‌లో ఉన్న డేటానే చెప్పనుంది" అని పేర్కొన్నారు. అదే సమయంలో సీఏఏ కొత్త చట్టమేమీ కాదని చెప్పారు. గతంలోనే రాష్ట్రంలో అమల్లోకి వచ్చిందన్నారు. అవసరమైన వారు నిర్దేశిత పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వీధుల్లోకి రావడం వల్ల ఏ ప్రయోజనం లేదని పేర్కొన్నారు.నిన్న కేంద్ర ప్రభుత్వం సీఏఏ చట్టాన్ని అమల్లోకి తెస్తున్నట్లు ప్రకటించింది. దీంతో 16 పార్టీల కూటమైన అస్సాం యూవోఎఫ్ఏ ఆందోళనలకు పిలుపునిచ్చింది. దీంతో అప్రమత్తమైన ఆ రాష్ట్ర పోలీసులు వివిధ పార్టీలకు నోటీసులు జారీ చేశారు. ఎట్టి పరిస్థితుల్లో ఆందోళనలు చేపట్టకూడదని.. శాంతిభద్రతలకు సహకరించాలని కోరారు. దీనికి విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే చర్యలు చేపడతామన్నారు. సున్నితమైన ప్రదేశాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. చెక్‌పోస్టుల వద్ద భద్రతను పెంచారు. 2019లో ఈ చట్టాన్ని ప్రకటించిన సమయంలో గువాహటీ సహా పలు ప్రాంతాల్లో హింసాత్మక ఆందోళనలు చోటుచేసుకొన్నాయి. మరికొన్ని రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుందన్న ప్రచారం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సోమవారం సీఏఏను బయటకు తీసింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్ నుంచి భారత్‌కు శరణార్థులుగా వచ్చిన ముస్లిమేతరులకు పౌరసత్వం కల్పించేలా నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిప్రకారం 2014 డిసెంబర్ 31కి ముందు ఈ మూడు దేశాల నుంచి వచ్చిన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలకు దీని కింద పౌరసత్వం ప్రసాదిస్తారు.

# దీప్తి శర్మ ఒంటరి పోరాటం వృధా



ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2024లో యూపీ వారియర్జ్ మరియు గుజరాత్ జెయింట్స్ మధ్య బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగింది. ఈ మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన గుజరాత్‌కి ఓపెనర్స్ దగ్గర నుంచి గుడ్ స్టార్ట్ లభించింది. కెప్టెన్ బెత్ మూనీ వీరోచిత ఇన్నింగ్స్ తో గుజరాత్ నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. కెప్టెన్ బెత్ మూనీ (52 బంతుల్లో 74 నాటౌట్‌బీ 10 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడి హాఫ్ సెంచరీ సాధించగా, లారా వాల్‌వార్ట్ (30 బంతుల్లో 43బీ 8 ఫోర్లు, 1 సిక్స్) రాణించింది. వారియర్జ్ బౌలర్లలో సోఫీ ఎకెల్‌స్టోన్ 3, దీప్తి శర్మ 2 వికెట్లు పడగొట్టారు. 153 పరుగులు లక్ష ఛేదనతో ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన వారియర్జ్‌కి "షబ్నమ్" తాను వేసిన మొదటి ఓవర్ లోనే కెప్టెన్ అలెక్స్ హీలీ,ఓనెడౌన్ బాట్స్మన్ చమరి అతపత్తును పెవిలిన్ కి పంపింది. ఆదిలోనే తడబడిన వారియర్జ్‌కి దీప్తి శర్మ(60బంతుల్లో 88: 9ఫోర్లు , 4సిక్సస్ )ఒంటరి పోరాటంతో రాణించినా వారియర్జ్ ఓటమిపాలైంది. నిర్ణీత 20 ఓవర్లలో వారియర్జ్ 5 వికెట్లు కోల్పోయి 144 పరుగులకే పరిమితమైంది. దీప్తితో పాటు పూనమ్ ఖేమ్నర్ (36 బంతుల్లో 36బీ 3 ఫోర్లు, 1 సిక్స్) పోరాడినా వారియర్జ్‌కు గెలిపించలేకపోయారు. చివరి ఓవర్లో 26 పరుగులు అవసరం కాగా దీప్తి 2 సిక్సర్లు సహా 17 పరుగులు సాధించినప్పటికీ వారియర్జ్ లక్ష్యానికి 9 పరుగుల దూరంలో నిలిచిపోయింది. ఈక ఇ మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ గెలిచినప్పటికీ ప్లే ఆఫ్స్‌కు చేరుకోవడం కష్టమే అవుతుంది. ఒకవేళ గుజరాత్ ప్లే ఆఫ్స్ కి చేరుకోవాలి అంటే ఆర్సీబీ , వారియర్జ్ మిగిలిన మ్యాచ్స్ లో ఓడిపోవాలి అలానే గుజరాత్ అత్యధిక నెట్ రన్ రేట్ తో గెలవలిసి ఉంటుంది. ఢిల్లీ, ముంబై ఇండియన్స్ ఇదివరకే ప్లే ఆఫ్స్ బెర్త్‌లు ఖరారు చేసుకోగా.. ఆర్సీబీ మరో బెర్త్ రేసులో ముందుంజలో ఉంది.

# ఐసీసీ అవార్డు యశస్వి కైవసం

ప్రస్తుత టీమిండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్ క్రికెట్ చరిత్రలో రికార్డుల మోత మోగిస్తున్నాడు అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. తాజాగా ముగిసిన టీమిండియా, ఇంగ్లాండ్ టీంల మధ్య జరిగిన టెస్టు సిరీస్ లో యశస్వి జైస్వాల్ పరుగుల వరద పారించడంతో అనేక కొత్త రికార్డులను సృష్టించాడు. తాజాగా ముగిసిన 5 మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో భాగంగా బ్యాట్‌తో విధ్వంసం సృష్టించి ఇంగ్లాండ్ బౌలర్లని ఉతికిపారేశాడు. ఇందులో ముఖ్యంగా వరుస డబుల్ సెంచరీలు సాధించిన యంగ్ ప్లేయర్ గా జైస్వాల్ రికార్డు బద్దలు కొట్టాడు.ఇక, ఈ సిరీస్ లో యశస్వి జైస్వాల్ 712 రన్స్ చేసి అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఎంతో అద్భుతమైన ఆటతీరుతో ముందుకు వెళ్తున్న యశస్వి జైస్వాల్ ను తాజాగా ఐసీసీకి చెందిన అవార్డు వరించింది. ఇక ఈ విషయం చూస్తే.. ఫిబ్రవరి నెలకు గానూ జైస్వాల్ ను " ప్లేయర్ ఆఫ్ ది మంత్ " గా ఐసీసీ ఎన్నుకుంది. ఇక ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు కొరకు జైస్వాల్ తో పాటు న్యూజిలాండ్ నుండి కేన్ విలియమ్సన్, శ్రీలంక నుండి పాతుమ్ నిస్సాంకలు గట్టి పోటీ ఇచ్చారు. ముందుగా ఈ ముగ్గురు ఆటగాళ్లను ప్లేయర్ ఆఫ్ ది మంత్ గా ఐసీసీ నామినేట్ చేయగా.. ఇందులో న్యూజిలాండ్ కు చెందిన కేన్ విలియమ్సన్, శ్రీలంకకు చెందిన పాతుమ్ నిస్సాంకలను వెనక్కినెట్టి జైస్వాల్ ఈ ప్రతిష్టాత్మక ఐసీసీ అవార్డును గెలుపొందాడు. ముందుముందు ప్రపంచంలోనే అత్యుత్తమ ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ గా యశస్వి జైస్వాల్ రాణిస్తాడని అతని గణాంకాలు చెబుతున్నాయని ఐసీసీ ఈ సందర్భంగా తెలిపింది. ఇక ప్రస్తుతం నడుస్తున్న ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా జైస్వాల్ నిలిచాడని ఐసీసీ పేర్కొంది. గడిచిన నెలలో ఇంగ్లండ్ పై వరుస మ్యాచ్ లలో ఏకంగా రెండు అద్భుతమైన డబుల్ సెంచరీలను సాధించాడు. మొదటి డబుల్ సెంచరీ విశాఖపట్నంలో జరిగిన టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 219 పరుగులు చేసాడు., ఆపై రాజ్ కోట్ లో జరిగిన మరుసటి టెస్టు మ్యాచ్ రెండో ఇన్నింగ్స్ లో డబుల్ సెంచరీని సాధించాడు. ఇకపోతే యశస్వి జైస్వాల్ కేవలం వరుస డబుల్ సెంచరీలు మాత్రమే కాకుండా ఫిబ్రవరి మాసంలో జైస్వాల్ అనేక రికార్డులను కొల్లగొట్టాడు.



# "పాకిస్తాన్ హిందువులు స్వేచ్ఛగా ఉపిరి పీల్చుకుంటారు"

## సీఏఏకి మద్దతుగా పాక్ మాజీ స్టార్ క్రికెటర్ డానిష్ కనేరియా



పాకిస్తాన్ మాజీ స్టార్ క్రికెటర్ డానిష్ కనేరియా భారత పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అమలుకు మద్దతు తెలిపారు. 2015కి ముందు భారత్‌కి తరలివెళ్లిన శరణార్థులకు సంబంధించి, సీఏఏ నిబంధనలు పాకిస్తానీ హిందువులందరికీ మంచి వని కనేరియా ప్రశంసించారు. పాకిస్తానీ హిందువులు ఇప్పుడు స్వేచ్ఛగా ఊపిరిపీల్చుకోగ లుగుతారు అని కనేరియా ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. సీఏఏని అమలు చేసినందుకు భారత ప్రధాని నరేంద్రమోడీకి, హెూమంత్రి అమిత్ షాలకు ధన్యవాదాలు తెలిపారు. పాకిస్తాన్ క్రికెట్ టీంలో లెగ్ స్పిన్నర్‌గా సేవలందించిన డానిష్ కనేరియా, ఆ జట్టుకు ఆడిన రెండో హిందువుగా ప్రసిద్ధి చెందారు. అనిల్ దల్పత్ తర్వాత పాకిస్తాన్ క్రికెట్ టీంకి ప్రాతినిధ్యం వహించారు. ఇటీవల పాక్ జట్టులో తనపై ఇతర క్రికెటర్లు చూపిన మతవివక్షను కూడా ఆయన వెల్లడించారు. తాను హిందువు అని, అఫ్రిది వంటి ఆటగాళ్లు తనపై వివక్ష చూపించేవారని పేర్కొన్నారు. పాకిస్తాన్ తరుపున 2000–2010 క్రికెట్ ఆడిన కనేరియా 61 టెస్టుల్లో 261 వికెట్లు పగగొట్టారు. 18 వన్డేలు ఆడారు. సోమవారం సీఏఏని అమలు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ చట్టం ద్వారా పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల్లో మైనారిటీలుగా ఉండీ, మతవివక్ష ఎదుర్కొంటూ భారత దేశానికి శరణార్థులుగా వచ్చిన వారికి ఈ దేశ పౌరసత్వాన్ని ఇస్తుంది. ముస్లిమేతర హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు మరియు పార్సీకు పౌరసత్వం రానుంది. డిసెంబర్ 21, 2014కి ముందు దేశానికి వచ్చిన వారు మాత్రమే పౌరసత్వానికి అర్హులు.

# ముంబై ఇండియన్స్‌కు సూర్యకుమార్ దూరం!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2024 మార్చి 22 నుంచి ఆరంభం కానుంది. టోర్నీ తొలి మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తలపడనున్నాయి. ఇక మార్చి 24న నరేంద్ర మోదీ స్టేడియంలో ముంబై ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్ జట్లు ఢీకొట్టనున్నాయి. ఈ మ్యాచ్‌కు ముందు ముంబైకి భారీ షాక్ తగిలింది. స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ మొదటి రెండు మ్యాచులకు దూరం కానున్నాడని సమాచారం. స్పోర్ట్స్ హెర్నియా సర్జరీ చేయించుకున్న సూర్య ముంబై ఆడే తొలి రెండు మ్యాచ్‌లకు అందుబాటులో ఉండే అవకాశాలు తక్కువగా ఉన్నాయని తెలుస్తోంది?. ఈ ఏడాది ఆరంభంలో స్పోర్ట్స్ హెర్నియా సర్జరీ చేయించుకున్న సూర్యకుమార్ యాదవ్.. బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) వైద్య బృదం పర్యవేక్షణలో ఉన్నాడు. అయితే సూర్య ఇంకా బ్యాటింగ్ ప్రాక్టీస్ ఆరంబించలేదని తెలుస్తోంది. ఇటీవల మిస్టర్ 360 తన పోస్ట్ చేసిన వీడియోలలో ఎక్కడా బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్నట్లు లేదు. దీంతో సూర్య ఇంకా పూర్తి ఫిట్‌నెస్ సాధించలేదని అర్థమవుతోంది. ఎన్‌సీఏ అతడికి ఎన్‌ఓసీ ఇచ్చేందుకు మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ సూర్యకుమార్ యాదవ్ తొలి రెండు మ్యాచ్‌లకు దూరమైతే.. ముంబై ఇండియన్స్‌కు ఎదురుదెబ్బే అని చెప్పాలి. ఐపీఎల్ 17వ సీజన్ ఆరంభానికి ఇంకా 10 రోజుల సమయం ఉన్న నేపథ్యంలో సూర్యకుమార్ యాదవ్ పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తాడో లేదో చూడాలి. ఐపీఎల్‌లో 139 మ్యాచులు ఆడిన సూర్య.. 3249 రన్స్ చేశాడు. ఇందులో ఓ సెంచరీ, 21 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. సూర్య చాలా ఏళ్లుగా ముంబైకి ఆడుతున్న విషయం తెలిసిందే.

# మహ్మాద్ షమీ ఔట్

జూన్‌లో ప్రపంచకప్ ప్రారంభమవుతుంది. దానికి ముందు జరిగే ఐపీఎల్ 2024 సీజన్ టీమ్ ఇండియా ప్రపంచకప్‌కు సిద్ధం కావడానికి సహాయపడుతుంది. అయితే అంతకుముందే టీమిండియా స్టార్ బౌలర్ మహ్మద్ షమీ కూడా టీ20 ప్రపంచకప్‌నకు దూరమయ్యాడు. మరి, షమీ తిరిగి మళ్లీ భారత జట్టులోకి ఎప్పుడు వస్తాడో తెలుసుకుందాం.. కెట్ ప్రేమికులను ఉర్రూతలూగించే ఐపీఎల్ ప్రారంభానికి మరికొన్ని రోజులు మిగిలి ఉన్నాయి. ఈ మిలియన్ డాలర్ల టోర్నీ మార్చి 22 నుంచి ప్రారంభమై మే నెలాఖరులో ముగుస్తుంది. ఆ తర్వాత టీ20 ప్రపంచకప్ ఫీవర్‌గా మారనుంది. జూన్ నుంచి పొట్టి ప్రపంచకప్ ప్రారంభం కానుండగా, దానికి ముందు జరిగే ఐపీఎల్ టీమ్ ఇండియా ప్రపంచకప్‌కు సన్నద్ధం కావడానికి ఉపయోగపడుతుంది. అయితే, అంతకంటే ముందే టీమిండియాకు షాకింగ్ న్యూస్ వచ్చింది. భారత జట్టు స్టార్ బౌలర్ మహ్మద్ షమీ టీ20 ప్రపంచకప్ ఆడడం అనుమానమేనని తెలుస్తోంది. 2023 వన్డే ప్రపంచకప్ తర్వాత గాయం కారణంగా భారత జట్టుకు దూరమైన మహ్మద్ షమీ ప్రస్తుతం పాదాల శస్త్రచికిత్స నుంచి కోలుకుంటున్నాడు. ప్రస్తుత సమాచారం ప్రకారం షమీ ఐపీఎల్‌కు దూరమయ్యాడు. ఇప్పటి వరకు వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. టీ20 ప్రపంచకప్ నుంచి కూడా ఔట్ కానున్నాడు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో బంగ్లాదేశ్‌తో స్వదేశంలో జరగనున్న టెస్టు సిరీస్ ద్వారా షమీ తిరిగి జట్టులోకి రాగలడని షమీ పునరాగమనంపై సమాచారం అందించిన బీసీసీఐ సెక్రటరీ జైషా అన్నారు. అంటే జూన్‌లో జరగనున్న టీ20 ప్రపంచకప్ నకు షమీ అందుబాటులో ఉండడు. జైషా మాట్లాడుతూ.. షమీకి శస్త్రచికిత్స విజయవంతమైందని, అతడు లండన్ నుంచి భారత్‌కు వచ్చాడని తెలిపాడు. బంగ్లాదేశ్‌తో స్వదేశంలో జరిగే సిరీస్‌తో షమీ తిరిగి జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. సెప్టెంబర్‌లో బంగ్లాదేశ్‌తో రెండు టెస్టులు, మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ తలపడనుంది. జైషా ప్రకారం, ఈ సిరీస్‌లో షమీ టీమ్ ఇండియాకు ప్రాతినిధ్యం వహిస్తాడు. గతేడాది నవంబర్ 2023లో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో మహమ్మద్ షమీ అద్భుత ప్రదర్శన చేశాడు. ఆడిన 7 మ్యాచ్‌ల్లో 24 వికెట్లు పడగొట్టి టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు.

# సందీప్ కిషన్‌తో త్రినాధరావు సినిమా




విభిన్నమైన కథనాలు ఎంచుకుంటూ సినిమాలు చేస్తున్నారు టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ ఇటీవల 'ఊరుపేరు భైరవకోన' చిత్రంతో ప్రేక్షకులను పలకరించాడు. సందీప్ తన 30వ సినిమాను ప్రకటించారు. 'ఎస్‌కె30' వర్కింగ్ టైటిల్‌ను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ధమాకా' మూవీతో మంచి హిట్ అందుకున్న దర్శకుడు త్రినాథరావు నక్కిన ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రానికి ప్రసన్న కుమార్ బెజవాడ కథ, మాటలు అందిస్తున్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి. వినోదాత్మక చిత్రంగా తెరకెక్కిస్తారని టాక్ వినిపిస్తుంది. మరోవైపు సందీప్ కోలీవుడ్‌లోనూ సినిమాలు చేస్తున్నారు. ఇటీవల విడుదలైన తమిళ మూవీ 'కెప్టెన్ మిల్లర్'లో కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం 'రాయన్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ రెండు సినిమాల్లోనూ ధనుష్ కథానాయకుడు. తండ్రి, కుమారుడు మధ్య జరిగే ఒక కథని వినోదాత్మకంగా రాసుకున్నారు. ముందుగా ఆ కథని శ్రీవిష్ణు, రావు రమేష్ చెయ్యాల్సి వుంది అని తెలిసింది. అయితే 'సామజవరగమన' సినిమా విడుదలవడం, అందులో శ్రీవిష్ణు, నరేష్ ఇద్దరూ కూడా తండ్రీ కొడుకులుగా చెయ్యడం ఆ సినిమా విజయవంతం అవ్వటం తెలిసిన విషయమే. అందుకని శ్రీవిష్ణు మళ్ళీ తండ్రీకొడుకుల కథ, ఇది కూడా వినోదాత్మకంగా ఉండటంతో వెంటనే అలాంటిదే ఎందుకు చెయ్యడం అని అతను ప్రసన్నకుమార్ కథని చెయ్యలేదు అని తెలిసింది. ప్రసన్నకుమార్ మరో శ్రీవిష్ణు చెయ్యను అనగానే, అతని స్థానంలో ఇంకొక నటుడు కోసం చూస్తూ ఈకథని తనకి సన్నితులైన వారికి చెప్పారు. ఆ వ్యక్తి ఈ కథని చిరంజీవి కుమార్తె సుష్మిత కి వినిపించారు, ఆమె వెంటనే కథ బాగుంది అని తన తండ్రి చిరంజీవితో ఈ సినిమా చెయ్యాలని భావించింది. ప్రసన్న కుమార్‌ని పిలిపించి చిరంజీవికి కథ చెప్పించింది అని, చిరంజీవికి బాగా నచ్చిందని ఒక వార్త అప్పట్లో హల్ చల్ చేసింది. అప్పుడే ఈ సినిమాకి కళ్యాణ్ కృష్ణ దర్శకుడు అనుకున్నారన్న వార్త కూడా వైరల్ అయింది. ఆ కథకి సిద్ధు జొన్నలగడ్డ చిరంజీవి కుమారుడుగా ఇందులో నటించనున్నాడు అన్న వార్త కూడా అప్పట్లో వైరల్ అయిన సంగతి అందరికి తెలిసిన విషయమే. ఏమైందేమో ఏమో సిద్ధు తనకి వేరే సినిమాల తో చాలా బిజీగా ఉండటంతో ఈ చిరంజీవి సినిమా చెయ్యడానికి అవలేదు. చిరంజీవి కూడా ముందుగా ఫాంటసీ సినిమా అయిన 'విశ్వంభర' చేద్దాం అని దర్శకుడు మల్లిడి వసిష్ఠతో చేస్తున్నారు. దానికితోడు సిద్ధు ప్లేస్ లో వేరే నటుల పేర్లు వినిపించినా, ఎందుకో చిరంజీవి ఈ ప్రాజెక్ట్ మీద అంతగా దృష్టి పెట్టలేదు. ఆలా చిరంజీవి తన కుమార్తెతో ప్రకటించిన ఈ సినిమా పక్కకి వెళ్ళిపోయింది. ఇప్పుడు మళ్ళీ అదే కథ తిరిగి తిరిగి సందీప్ కిషన్ దగ్గరికి వచ్చినట్టుగా తెలుస్తోంది. తాజాగా సందీప్ కిషన్, నక్కిన త్రినాథ రావు దర్శకత్వంలో ఎస్కె 30 అంటూ ఒక సినిమాని అధికారికంగా ప్రకటిం చారు. దీనికి బెజవాడ ప్రసన్న కుమార్ కథ ఇవ్వగా, రాజేష్ దండా నిర్మాత.

# చిరంజీవి ప్లాన్ వర్కవుట్ అవుతుందా..



మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం వశిష్ట దర్శకత్వంలో విశ్వంభరలో నటిస్తున్నాడు. ఈ సినిమా షూటింగ్ వేగంగా జరుగుతుంది. కొల్లూరులో గుంటూరు కారం కోసం వేసిన ఇంటి సెట్లో చిరంజీవి సినిమా షూట్ జరుగుతుంది. ఇందులో త్రిష మెయిన్ హీరోయిన్‌గా నటిస్తుంటే.. సురభి, ఈషా చావ్లా, ఆషికా రంగనాథ్ లాంటి హీరోయిన్లు చిరంజీవి చెల్లెల్లుగా నటిస్తున్నారు. జగదేకవీరుడు అతిలోకసుందరి, అంజి సినిమాల తర్వాత చిరంజీవి నటిస్తున్న సోషల్ ఫాంటసీ మూవీ ఇదే. దీనికోసం దాదాపు 200 కోట్ల బడ్జెట్ పెడుతున్నారు యూవీ క్రియేషన్స్. ఇప్పటివరకు మెగాస్టార్ మీద అంత బడ్జెట్ పెట్టిన నిర్మాతలు ఎవరూ లేరు.. కానీ కథ మీద నమ్మకంతో అంత భారీ బడ్జెట్ పెట్టడానికి రెడీ అయ్యారు నిర్మాతలు. ఇదిలా ఉంటే ఈ సినిమా చేస్తూనే మరొక సినిమా కూడా చేయాలని మెగాస్టార్ ఆలోచిస్తున్నాడు. దాని కోసమే కథ చెప్పే దర్శకుడి కోసం వెయిట్ చేస్తున్నాడు చిరంజీవి. నిన్న మొన్నటి వరకు అనిల్ రావిపూడి, చిరంజీవి సినిమా కన్ఫామ్ అనుకున్నారు కానీ ఇప్పుడు వెంకటేశ్ దగ్గరికి వెళ్లిపోయాడు అనిల్. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో సంక్రాంతికి కలుద్దాం అనే సినిమా వస్తుంది. దిల్ రాజు ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. 2025 సంక్రాంతి లక్ష్యంగా చేసుకొని అనిల్ రావిపూడి సినిమా రాబోతుంది. ఇప్పటికే ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన ఎఫ్2, ఎఫ్3 సినిమాలు బాగానే వసూలు చేశాయి. ఇప్పుడు హ్యాట్రిక్ కొట్టాలని చూస్తున్నారు వెంకటేశ్, అనిల్ రావిపూడి. అనిల్ సినిమా మిస్ అయిపోవడంతో ఇంకో దర్శకుడు కోసం వెయిట్ చేస్తున్నాడు చిరంజీవి.





# డిమాండ్‌లో ఉన్న నటి మృణాల్ ఠాకూర్

ప్రస్తుతం మృణాళ్‌ఠాకూర్ టైమ్ నడుస్తున్నది. సీతా రామం, హాయ్ నాన్న విజయాలతో మంచి దూకుడు మీద ఉన్నది ఈ అందాలభామ. ఈ మహారాష్ట్ర అందానికి మరో అద్భుతమైన అవకాశం వరించిందని ఫిల్మ్‌నగర్ టాక్. త్వరలో ప్రభాస్‌కి జోడీగా కనిపించను న్నదట మృణాళ్‌ఠాకూర్. వివరాల్లోకెళ్తే.. ప్రభాస్ కథానాయకుడిగా దర్శకుడు హను రాఘవపూడి త్వరలో ఓ పీరియాడికల్ డ్రామా తెరకెక్కించనున్నారు.
పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కనున్న ఈ సినిమాకు సంబంధించిన ప్రీప్రొడక్షన్ వర్క్ కూడా ఇప్పటికే మొదలైంది. ఈ సినిమాలో కథానాయికగా మృణాల్‌ని ఎంపిక చేశారన్న వార్త సాంఘిక మాధ్యమాల్లో బాగా వైరల్ అవుతున్నది. అయితే, దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన మాత్రం ఇంకా రాలేదు. అదే నిజమైతే మృణాళ్ రొట్టే విరిగి నేతిలో పడ్డట్టే. ప్రస్తుతం మృణాళ్ 'ఫ్యామిలీస్టార్'లో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే.

# ఆనంద్ సినిమా పవన్ కోసం రాసిందట



ఫలానా హీరోను దృష్టిలో పెట్టుకుని దర్శక, రచయితలు కథను రెడీ చేసుకోగా పలు కారణాల వల్ల అందులో వేరే హీరో నటించడం చిత్ర పరిశ్రమలో అప్పుడ ప్పుడూ జరుగుతుంటుంది. ఇలా వచ్చిన కొన్ని సినిమాలు ఊహించని విజయం అందుకున్నాయి, మరికొన్ని పరాజయం పొందాయి. ఈ జాబితాలో నిలిచిన ఓ హిట్ చిత్రం గురించి ఆసక్తికర విషయం తెలుసుకుందాం. ఆ మూవీ మరేదో కాదు 'ఆనంద్: మంచి కాఫీలాంటి సినిమా' చదువు పూర్తి కాగానే అమెరికా వెళ్లిన శేఖర్ కమ్ముల సినిమాపై ఆసక్తితో ఉద్యోగానికి రాజీనామా చేసి, ఫిల్మ్ మేకింగ్ కోర్సులో చేరిన సంగతి తెలిసిందే. తన అనుభవాన్ని రంగరించి రాసుకున్న తొలి స్క్రిప్టు 'డాలర్ డ్రీమ్స్'. తెలుగు, ఇంగ్లిష్‌లో రూపొందిన ఆ సినిమా కమర్షియల్‌గా హిట్ కాలేదుగానీ 'బెస్ట్ డెబ్యూ డైరెక్టర్'గా శేఖర్‌కు జాతీయ అవార్డు అందించింది. పవన్ కల్యాణ్ ను దృష్టిలో పెట్టుకునే ఈ కథను సిద్ధం చేశానని, కానీ ఆయన్ను సంప్రదించలేదని శేఖర్ ఓ సందర్భంలో తెలిపారు. ఎందుకు మీట్ అవలేదనే విషయాన్ని ప్రస్తావించలేదు. అలా పవన్‌ను ఊహించుకుని రాసుకున్న ఆ స్టోరీలో.. అప్పటికి మూడు సినిమాల అనుభవం ఉన్న రాజా 'ఆనంద్'గా నటించి మంచి క్రేజ్ తెచ్చుకున్నారు. హీరోయిన్‌గా ముందుగా అసిన్, సదాను అనుకున్నా చివరకు ఆ అవకాశం కమలినీ ముఖర్జీకి దక్కింది.

# మళయాల సినిమాలో అనుష్క

కథానాయిక అనుష్క శెట్టి, జయసూర్య జంటగా నటిస్తున్న మలయాళ చిత్రం 'కథనార్- ది వైల్డ్ సోర్సెరర్' రోజిన్ థామస్ దర్శకత్వం వహిస్తున్నారు. మలయాళంలో స్వీటీ మొదటి చిత్రం. ఆమె షూటింగ్‌లో పాల్గొన్న ఫొటోలను దర్శకుడు ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. 'అనుష్క శెట్టి కథనార్‌లో భాగం అయ్యారు. ఆమెతో కలిసి వర్క్ చేస్తున్నందుకు ఆనందంగా ఉంది' అని నోట్ పెట్టారు. అనుష్క న్యూలుక్ చూసిన అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. 'లేడీ సూపర్‌స్టార్ అనుష్కను థియేటర్‌లో చూసేందుకు ఎదురుచూస్తున్నాం. స్వీటీకి అభిమానులందరి నుంచి శుభాకాంక్షలు' అని కామెంట్స్ పెడుతున్నారు.
'కథనార్' 14 భాషల్లో విడుదలకానుంది. కేరళలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. తెలుగులో దర్శకుడు క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో అనుష్క నటిస్తున్నారని సమాచారం. బలమైన కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోందని.. ఇందులో సవాల్‌తో కూడిన పాత్రలో కనిపించనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. త్వరలో ఈ సినిమా వివరాలను అధికారికంగా ప్రకటించనున్నారు.

# దేవి చిత్రానికి 25 ఏళ్లు

కోడి రామకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన సోషియో ఫాంటసీ చిత్రం 'దేవి'. అప్పట్లో సంచలనం సృష్టించిన ఈ సినిమా విడుదలై 25 ఏళ్లు పూర్తయింది. నటి ప్రేమ ప్రధానపాత్రలో నటించిన ఈ మూవీ గురించి ఆమె కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకు న్నారు. షూటింగ్ సమయంలో జరిగిన సంఘటనను ఇటీవల ఓ ఇంటర్వ్యూలో గుర్తుచేసు కున్నారు. లేడీ ఓరియెంటెడ్ సినిమాలు తక్కువగా వస్తున్న రోజుల్లో తీసిన చిత్రం 'దేవి'. మంచి విజయాన్ని సాధించింది. ఆ స్థాయిలో విజయం సాధించడానికి ప్రధాన కారణం కోడి రామకృష్ణ గారే. సన్నివేశం బాగా వచ్చే వరకూ 50టేక్‌లు అయినా తీస్తారు. రాత్రిపగలూ పని చేశాం. డైలాగులు బాగా ప్రాక్టీస్ చేయించేవారు. దేవత ఎలా మాట్లాడుతుందో అలాగే మాట్లాడమని చెప్పేవారు. ఆ గెటప్ వేశాక హావభావాలు వాటంతట అవే వచ్చేస్తాయి. 'ఇలాంటి పాముల సినిమాలు ఎవరు చూస్తార'ని అనుకున్నాం. చిత్రీకరణ మొత్తం అయ్యాక చూసి నేనే ఆశ్చర్యపోయాను. షూటింగ్ సమయంలో ఒక వ్యక్తిని నిజంగానే పాము కాటేసింది. అతనిని ఆసుపత్రికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోయింది. ఆ బాధతో మేం రెండు రోజులు షూటింగ్ ఆపేశాం. క్లైమాక్స్ తీసేటప్పుడు కూడా మంచులో చాలా ఇబ్బందులు పడ్డాం' అని చెప్పారు.





## అశోక్ ప్రాణాలకు ప్రమాదం జరిగితే
# సీఎం రేవంత్ రెడ్డిదే బాధ్యత

- నిరుద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**హైదరాబాద్, మార్చి 12 (జనంసాక్షి) :** రాష్ట్రంలో నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరతూ ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న నిరుద్యోగ నేత అశోక్ ప్రాణాలకు ప్రమాదం జరిగితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అన్నారు. పోలీసు నిర్బంధంలో మూడు రోజులుగా చైతన్యపురిలోని తన నివాసంలో ఆమరణ నిరాహారదీక్షకు సంఘీభావం తెలిపారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ నిరుద్యోగులు తమ డిమాండ్లను నెరవేర్చాలని నిరసన తెలిపితే ప్రభుత్వం నిర్బంధం విధిస్తుందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం కారణంగానే గురుకులల్లో 3,000 పోస్టులు ఖాళీగా మిగిలిపోయాయన్నారు. గురుకుల ఉద్యోగాల భర్తీలో రిలింక్విష్మెంట్ విధానాన్ని పాటిస్తే ఖాళీలు మిగిలేవి కావన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గురుకుల ఉద్యోగాలను అవరోహన క్రమంలో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు తీరని అన్యాయం చేస్తున్న జీవో నెం.46 ను తక్షణమే రద్దు చేయాలన్నారు. గ్రూప్-1,2,3 పోస్టులను ప్రస్తుతం ఉన్న ఖాళీలకు అనుగుణంగా పెంచి,నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు. టెట్ నిర్వహించిన తర్వాతే, డీఎస్సీ నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల డిమాండ్ల సాధనకోసం బీఎస్పీ నిరుద్యోగుల గొంతుకై ప్రశ్నిస్తుందని తెలిపారు.నిరుద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

# ఈ ఏడాదిలో సింగరేణి ఆధ్వర్యంలో 1900 ఉద్యోగాల భర్తీ

- నూతన గనుల ఏర్పాటు కోసం ప్రత్యేక కృషి
- సింగరేణిలో బీసీ లైజన్ ఆఫీసర్ నియామకం
- సింగరేణి ద్వారా మరో 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు
- సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో 800 మెగావాట్ల ప్లాంటు కు త్వరలో శంకుస్థాపన
- రామగుండం బీ పవర్ ప్రాజెక్టు స్థానంలో మరో 800 మెగావాట్ల ప్లాంట్... సింగరేణి ఆధ్వర్యంలో నిర్మాణంపై పరిశీలన
- సింగరేణిని కాపాడి అభివృద్ధి చేసే బాధ్యత మాదే
- సింగరేణి ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనే మా ధ్యేయం
- సింగరేణి సంపద పెంచడం.. కార్మికులకు పంచడమే మా లక్ష్యం
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రకటన
- మూడు నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సింగరేణిలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు : సీఎండీ ఎన్.బలరామ్





(ప్రత్యేక ప్రతినిధి - జనం సాక్షి)

సింగరేణి ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ముఖ్య ఉద్దేశంతో ఈ ఏడాదిలో సింగరేణి ఆధ్వర్యంలో దాదాపు 1900 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రకటించారు. ఇందులో భాగంగా గత వారంలో 489 ఉద్యోగాల నోటిఫికేషన్లు జారీ అయ్యాయని.. మరో 1352 ఉద్యోగాల భర్తీకి అతి త్వరలో నోటిఫికేషన్లు విడుదల కానున్నట్లు ఆయన ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్ బంజారా హిల్స్లో నిర్మించనున్న సింగరేణి అతిథి గృహ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 134 ఏళ్ల చరిత్ర ఉన్న సింగరేణికి హైదరాబాద్లో గెస్ట్ హౌస్ లేకపోవడం బాధాకరమని.. కార్మికులు, అధికారుల ప్రయోజనార్థం రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి గజాల స్థలాన్ని కేటాయించిందని తెలిపారు. సింగరేణి ప్రాంతానికి చెందిన తనకు ఈ అతిథి గృహాన్ని ప్రారంభించే అవకాశం లభించడం నిజంగా అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సింగరేణి విస్తరణ చర్యల్లో భాగంగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో జైపూర్ లో నిర్వ హిస్తున్న ప్రస్తుత 1200 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ ప్రాంగణంలో త్వరలో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అలాగే రామగుండంలో ఉన్న జెన్ కో ఆధ్వర్యంలో దశాబ్దాల క్రితం నిర్మించిన ప్లాంట్ ఆవరణలో 800 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి ఆధ్వర్యంలో ఈ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలని యోచిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో సింగరేణి థర్మల్ సామర్థ్యం 2800 మెగావాట్లకు చేరుతుందన్నారు. అలాగే సింగరేణి సుస్థిర భవిష్యత్ కోసం, ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం కొత్త గనులను ఏర్పాటు చేయాలన్న దృఢ సంకల్పంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కేంద్ర బొగ్గు శాఖ మంత్రిని కలిసి తాడిచర్ల -2 గనిని సింగరేణికి కేటాయించేందుకు విజ్ఞప్తి చేయగా.. సానుకూల స్పందన లభించిందన్నారు. అలాగే నైనీ గని ప్రారంభానికి ఉన్న అవాంతరాలను తొలగించేందుకు ఒడిశా ముఖ్యమంత్రితో మాట్లాడించడం జరిగిందన్నారు. సింగరేణి ఆధ్వర్యంలోని రాష్ట్రంలోని భారీ జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు, ఓపెన్ కాస్ట్ లపై పవన విద్యుత్ వంటివి ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు చేస్తున్నామన్నారు. సింగరేణి సమస్యలపై మానవీయ కోణంలో ముందుకు వెళ్తున్నామని... తాము తీసుకునే నిర్ణయాలన్నీ సింగరేణి ఉజ్వల భవిష్యత్కు బాటలు వేసేవిగానే ఉంటాయన్నారు. సింగరేణి సంపదను పెంచడమే తమ లక్ష్యమని.. అలా పెంచిన సంపదను కార్మికులకు పంచడమే ధ్యేయమని ప్రకటించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతను పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు వీలుగా డాక్టర్ బీఆర్.అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను త్వరలో ప్రారంభిస్తామని ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి కీలక పాత్ర పోషిస్తుందనీ, ఈ సంస్థను అభివృద్ధి చేయడం, కొత్త ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సింగరేణిలో ఎస్సీ, ఎస్టీ లైజన్ ఆఫీసర్లు ఉన్న మాదిరిగానే బీసీ లైజనింగ్ ఆఫీసర్ నియామకాన్ని చేపట్టేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని ఆదేశిస్తున్నట్లు తెలిపారు.

ఈ సమావేశానికి సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ స్వాగతం పలుకుతూ 134 సంవత్సరాల చరిత్ర గల సింగరేణి సంస్థకు హైదరాబాద్ లో సొంత గెస్ట్ హౌస్ లేదని, రాష్ట్ర ప్రభుత్వం వారు సొంత గెస్ట్ హౌస్ కోసం వెయ్యి గజాల స్థలాన్ని కేటాయించడమే కాక శంకుస్థాపనకు విచ్చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గత 100 రోజుల్లో సింగరేణిలో కార్మికుల సంక్షేమానికి, సంస్థ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అనేక కార్యక్రమాలను చేపట్టినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సంస్థను దేశంలోనే అగ్రగామి సంస్థగా నిలబెడతామన్నారు. సింగరేణి ఛైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వాణిజ్యం, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్బాబు, హైదరాబాద్ మేయర్ శ్రీమతి విజయలక్ష్మీ, కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు వివేక్, వినోద్, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ప్రేమ్ సాగర్ రావు, మాజీ ఎంపీ, భారత మాజీ క్రికెట్ కెప్టెన్ అజారుద్దీన్, ప్రాతినిధ్య సంఘ నాయకులు జనక్ ప్రసాద్ పాల్గొన్నారు.

# మహాలక్ష్మి వల్ల నష్టాల్లో ఉన్న ఆర్టీసీ లాభాల్లోకి..

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- ఆర్టీసీ గ్రీన్ మెట్రో ఎక్స్ప్రెస్లను ప్రారంభించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్రెడ్డి





**హైదరాబాద్, మార్చి 12 (జనంసాక్షి) :** మహాలక్ష్మి పథకం వల్ల నష్టాల్లో ఉన్న ఆర్టీసీ లాభాల్లోకి వచ్చిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ ఎన్టీఆర్ మార్గ్లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ ఆర్టీసీకి చెందిన గ్రీన్ మెట్రో ఎక్స్ ప్రెస్ నాన్ ఏసీ బస్సుల ప్రారంభోత్సవం మంగళవారం సందడిగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. పర్యావరణహితమైన 22 ఎలక్ట్రిక్ నాన్ ఏసీ బస్సులను వారు జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. బస్సుల ప్రారంభోత్సవ అనంతరం అంబేద్కర్ విగ్రహం నుంచి భట్టి విక్రమార్క మల్లు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎలక్ట్రిక్ బస్సులో ప్రయాణించి సచివాలయానికి వెళ్లారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ.. మహాలక్ష్మి-మహిళలకు ఉచిత బస్సు సౌకర్య పథకం అమలు వల్ల గతంలో నష్టాల్లో ఉన్న టీఎస్ఆర్టీసీ ప్రస్తుతం లాభాల్లోకి వెళ్లడమనేది తెలంగాణకే గర్వకారణమని అభిప్రాయపడ్డారు. తమ దైనందిన జీవితంలో మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకోవడం వల్ల.. ఆర్టీసీ బస్సులన్నీ నిండుగా వెళున్నాయని ఆయన చెప్పారు. మహిళలు గౌరవంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారని, మహిళల టికెట్ డబ్బును టీఎస్ఆర్టీసీకి ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణకు తలమానికైన ఆర్టీసీని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడి ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజా రవాణా వ్యవస్థ ప్రాముఖ్యతను గుర్తించి.. గత 90 రోజుల్లో అనేక కార్యక్రమాలను తీసుకువచ్చామని వివరించారు. ఆర్టీసీ సిబ్బంది పడుతున్న కష్టాన్ని, శ్రమను గుర్తించే వేతన సవరణ చేసి.. 21 శాతం ఫిట్మెంట్ను ఇటీవల ప్రకటించడం జరిగిందని గుర్తు చేశారు. టీఎస్ఆర్టీసీని బలోపేతం చేసేందుకు, సంస్థ అభ్యున్నతికి సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం వల్ల టీఎస్ఆర్టీసీ కళకళలాడుతోందని, ప్రతి బస్సు కూడా 100 శాతం ఆక్యూపెన్సీ రేషియో(ఓఆర్) తగ్గకుండా తిరుగుతోందని చెప్పారు. మహాలక్ష్మి స్కీం అమలులో ఎంతో కష్టపడుతున్నా ఆర్టీసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్టీసీ పరిరక్షణ, సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాముఖ్యత ఇస్తోందన్నారు. వినూత్న ఆలోచనలతో ఆర్టీసీ సమస్యలను పరిష్కరిస్తారని స్పష్టం చేశారు. తెలంగాణలో తొలిసారిగా ఎలక్ట్రిక్ నాన్ ఏసీ బస్సులను సంస్థ అందుబాటులోకి తీసుకువచ్చిందని, మహాలక్ష్మి పథకాన్ని ఈ బస్సుల్లో అమలు చేస్తున్నట్లు తెలిపారు. పెరిగిన రద్దీకి అనుగుణంగా భవిష్యత్ లో మరిన్ని కొత్త బస్సులను వాడకంలోకి వస్తాయని, వాటి కొనుగోలుకు ప్రభుత్వం సహాయసహకారాలు అందిస్తుందని తెలిపారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీఎస్ఆర్టీసీ అభ్యున్నతికి పాటుపడుతోందని అన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడమే కాకుండా.. కొత్త బస్సులను అందుబాటులోకి తీసుకువస్తోందన్నారు. ఆర్టీసీ సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తూ.. ఇటీవల వేతన సవరణనూ చేసిందన్నారు. టీఎస్ఆర్టీసీ సిబ్బంది నిబద్ధత, అంకితభావం క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రతి రోజు లక్షలాది మందిని క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చుతున్నారని కొనియాడారు. భవిష్యత్లోనూ ఇలాగే పనిచేస్తూ దేశంలోనే టీఎస్ఆర్టీసీకి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ.. ఇటీవల తమ ఉద్యోగులకు 21 శాతం ఫిట్మెంట్ ప్రకటించిన ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ సహకారంతో టీఎస్ఆర్టీసీ అభివృద్ధి బాటలో పయనిస్తోందన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఇప్పటివరకు 25 కోట్ల మంది మహిళలు రాకపోకలు సాగించి.. రూ.879 కోట్ల డబ్బును ఆదా చేసుకున్నారని తెలిపారు. రాబోయే ఐదారు నెలల్లో ప్రభుత్వ సహకారంతో 2515 బస్సులను వాడకం తెచ్చేలా సంస్థ ప్లాన్ చేసిందని తెలిపారు. ఈ ప్రారంభోత్సవంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, రవాణా శాఖ కమిషనర్ జ్యోతి బుద్దా ప్రకాశ్, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి, టీఎస్ఆర్టీసీ సీవోవో డాక్టర్ రవిందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వరావు, ఈడీలు మునిశేఖర్, కృష్ణకాంత్, వెంకటేశ్వర్లు, సీఎంఈ రఘునాథరావు పాల్గొన్నారు.

# టెట్ నిర్వహించి డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయండి

- ముఖ్యమంత్రి రేవంత్రెడ్డికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్రావు లేఖ



**హైదరాబాద్, మార్చి 12 (జనంసాక్షి) :** టెట్ నిర్వహించి డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్రావు లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకం కోసం డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఇటీవల కాలంలో టెట్ పరీక్ష నిర్వహించకపోవడం వల్ల దాదాపు 7 లక్షల మంది డిఎడ్, బిఎడ్ విద్యార్థులు డిఎస్సీకి దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని లేఖలో పేర్కొన్నారు. గత డిసెంబర్ నెలలో డీఎడ్ , బి.ఎడ్ కోర్సులు పూర్తి చేసుకున్న వారు దాదాపుగా 50వేల పై చిలుకు మంది ఉంటారని, టెట్ లో ఉత్తీర్ణత సాధించిన వారు మాత్రమే డిఎస్సీకి దరఖాస్తు చేయడానికి అ ర్హు ల వు తా ర ని పేర్కొన్నారు. గత ఏడాది సెప్టెంబర్ లో బిఆర్ఎస్ ప్రభుత్వం టెట్ నిర్వహించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టెట్ నిర్వహించలేదని, టెట్ పరీక్ష కోసం దాదాపు 7 లక్షల పై చిలుకు మంది ఎదురు చూస్తున్నారని, టెట్ లో ఉత్తీర్ణత సాధించి, డిఎస్సీకి దరఖాస్తు చేసుకోవాలని ఆశతో ఉన్నారని తెలిపారు. డీఎస్సీ నోటిఫికేషన్ తో పాటు, టెట్ నిర్వహించి విద్యార్థులు, నిరుద్యోగుల అవకాశాలు దెబ్బతినకుండా చూడాలని కోరారు.

# గత పాలకుల నిర్లక్ష్యం రైతులకు శాపం

- కాంగ్రెస్ ప్రభుత్వం పై బురదజల్లే కుట్ర
- సాగునీరు అందించి రైతుల పంటలను కాపాడుతాం
- మాజీమంత్రి ఎర్రబెల్లి రైతులను రెచ్చగొడుతున్నాడు
- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి



**పాలకుర్తి, మార్చి 12 (జనంసాక్షి) :** పాలకుర్తి నియోజకవర్గం లో గత పాలకులు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారిందని, ఎర్రబెల్లి నిర్లక్ష్యం కారణంగానే పాలకుర్తి నియోజకవర్గం లో రైతులకు సాగునీటి తిప్పల తప్పడం లేదని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డిలు విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో గల మిషన్ భగీరథ కార్యాలయం గెస్ట్ హౌస్ లో దేవాదుల, ఎస్సారెస్పీ అధికారులతో సాగునీటిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డిలు మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గం గత పది ఏళ్ళు ఎర్రబెల్లి పాలించాడని, పాలకుర్తి దేవరపుల మండలాలకు సాగునీరు అందించే కాలువలను ఎందుకు మరమ్మత్తులు చేయించలేదని ప్రశ్నించారు. రైతుల ఓట్లు దండుకునేందుకు రైతులను మోసం చేసి వేసవి సమయంలో రైతులు సాగునీరు వద్దని మొరపెట్టుకున్న అధికార దాహంతో సాగునీరు అందించి ఇప్పుడు సాగునీటి తిప్పల వచ్చే విధంగా వ్యవహరించారని విమర్శించారు. కాలువల్లో మట్టి కూరుకు పోయిందని, మరమ్మతులు చేయించకుండానే కాలయాపన చేశారని మండిపడ్డారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి రైతులను రెచ్చగొడుతున్నారన్నారు, దేవాదుల కాలువను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని, కాల్వ పనులు పూర్తయి సాగునీరు రైతులకు అందిస్తున్నప్పటికీ మరమ్మతు చర్యలు ఎందుకు చేపట్టలేదన్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో పాలకుర్తి, దేవరుప్పుల మండలాల రైతుల పంటలను కాపాడేందుకు యుద్ధ ప్రాతిపదికన దేవాదుల నీటిని విడుదల చేయించామని తెలిపారు. స్టేషన్ ఘన్పూర్ మండలం బోయిని గూడెం వద్ద దేవాదుల ప్రధాన కాలువతో పాటు 4 ఎల్ కెనాల్ కు గేట్లు పెట్టేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. గేట్లు పెట్టడం వల్ల రైతులందరికీ సమన్యాయం జరుగుతుందని సాగునీరు సకాలంలో అందుతుందని తెలిపారు. అనంతరం స్టేషన్ ఘన్పూర్ రిజర్వాయర్ తో పాటు చాగల్లు, బోయిని గూడెం వద్ద దేవాదుల ప్రధాన కాలువ, 4 ఎల్ కెనాల్ ను పరిశీలించి పూజలు చేశారు. రైతుల పంటలను కాపాడేందుకే దేవాదుల సాగునీరును విడుదల చేయించామన్నారు.

# రోడ్ల వెడల్పు, నిర్మాణానికి 60 కోట్ల నిధులు మంజూరు



- ఐటీ పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్ బాబు

**మంథని, మార్చి 12 (జనంసాక్షి) :** మంథని నియోజకవర్గంలోని ధన్వాడ-దామరకుంట, ఖమ్మంపల్లి - ఓడేడు రోడ్డు వెడల్పు కొరకు సెంట్రల్ రోడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కింద 60 కోట్ల నిధులు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ధన్వాడ నుండి దామెర కుంట వరకు 15 కిలోమీటర్లు 30 కోట్లు, ఖమ్మంపల్లి నుండి ఓడేడు వరకు 15 కిలోమీటర్లు 30 కోట్ల నిధులు రోడ్డు వెడల్పు కొరకు సెంట్రల్ రోడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కింద కేంద్ర ప్రభుత్వం మంజూరు మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నిధుల మంజూరుకు కృషిచేసిన తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కి ముత్తారం మండలం, కాటరం మండలం గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# పరిశ్రమలో డబ్బింగ్కు ప్రత్యేక స్థానం

- సీనియర్ నటీమణి, ప్రముఖ డబ్బింగ్ ఆర్టిస్ట్ రోజారమణి
- ఘనంగా డబ్బింగ్ అసోసియేషన్ దశాబ్ది ఉత్సవాలు



**హైదరాబాద్, మార్చి 12 (జనంసాక్షి) :** సినిమా,టెలివిజన్ పరిశ్రమలో డబ్బింగ్ కళకు ఒక ప్రత్యేక స్థానం ఉందని, తాను డబ్బింగ్ ఆర్టిస్ట్ అయినందుకు ఎంతో సంతోషంగా ఉందని,ముఖ్య అతిధిగా హాజరయిన సీనియర్ నటీమణి, ప్రముఖ డబ్బింగ్ ఆర్టిస్ట్ రోజారమణి తన ఆనందాన్ని పంచుకున్నారు. శ్రీనగర్ కాలనీలో శ్రీసత్యసాయి నిగమాగమంలో ఆదివారం డబ్బింగ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలుగు టెలివిజన్ దశాబ్ది ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. పాత్రకు తగిన గాత్రాన్ని అందించే డబ్బింగ్ ఆర్టిస్ట్ ల పాత్ర, చిత్ర విజయంలో ఎంతో ముఖ్యమైనదని వక్తలు కొనియాడారు. ఈ ఉత్సవాలకు ఆత్మీయ అతిధులుగా తెలుగు సినీ ఫెడరేషన్ అధ్యక్షులు అనిల్ వల్లభనేని,మనంసైతం అధ్యక్షులు కాదాంబరి కిరణ్,మూవీ డబ్బింగ్ యూనియన్ అధ్యక్షులు గోగినేని ప్రసాద్, టెలివిజన్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగబాల సురేష్, డాట్ గౌరవ అధ్యక్షులు కె ఎస్ వి కె కిషోర్, టెలివిజన్ ఫెడరేషన్ అధ్యక్షులు నాని, సంగీత దర్శకులు ఆర్ పి పట్నాయక్, బంటి, ఖుద్దూస్, ఉదయ్ కుమార్, సినీ నటులు అజయ్ ఘోష్, రామ్ జగన్, వినోద్ బాల,జెమిని సురేష్,ఆకాంక్ష వేణుమాధవ్, విజన్ వివికె విజయ్ కుమార్,సాయి బాలాజీ శరత్ బాబు, డాట్ పూర్వ అధ్యక్షులు బి వి సుబ్బారావు, బి వి రమణయ్య, డాట్ వ్యస్థాపక కార్యదర్శి మనోహర్ రావు, శ్యామ్ కుమార్, శ్రీశశాంక, సీనియర్ డబ్బింగ్ కళాకారులు అమరేంద్ర, దామోదర రెడ్డి,చంద్రిక, రత్నా సాగర్, అనూరాధ, నాగమణి, శృతి, వాయుపుత్ర నాగార్జున, మురళి, రాఘవేంద్రరావు, కె వి ఎస్ శ్రీనివాస్, మంగరాజు, సోమశేఖర్ ,హరిత, జ్యోతివర్మ,అమల, సాహితీ, గౌతమ్, ఇందిరాఫణి, అచ్యుత్, మురళి, గగన్, రవికుమార్, సుభాని, లక్ష్మణ్ కుమార్,తేజో నివాస్, మోహన్,ఇలా ఎందరో కళాకారులు హాజరయ్యారు. ముందుగా డాట్ అధ్యక్షులు ఆర్సిఎం రాజు అతిథులకు స్వాగతం పలుకగా ప్రధాన కార్యదర్శి బి. చంద్రశేఖర్ వర్మ, ఉపాధ్యాయురాలు హైమావతి, కోశాధికారి టివివి ఎస్ వరప్రసాద్,సంయుక్త కార్యదర్శి ఏడుకొండలు, కార్యవర్గ సభ్యులు జమా, జానకిరామ్ రెడ్డి, వినోద్ కుమార్, శ్రావణి సహకరించారు.అధ్యక్షులు ఆర్ సి యం రాజు కృషిని, ప్రధాన కార్యదర్శి బి. చంద్రశేఖర్ వర్మని అందరూ కొనియాడారు. ఒక ప్రాముఖ ఛానెల్ వారు ఎంతో సహకరించారు.సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Sy.No. 210, Padmanagar, Chinthakunta, Karimnagar Dist, Telangana - 505462 Published at Janam Sakshi Office, Bawazeer Estate, Beside HUDA High School, Civil Hospital Road, Karimnagar - 505001, Telangana. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2002/12105